


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-6-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 143 పేజీలు: 10+4 వెల: 6.50


**లక్ష్యాలకు చేరువలో ఉన్నాం: నెతన్యాహు**

**సిరియా చర్చిలో ఆత్మాహుతి దాడి: 24 మంది మృతి**

5లో

# బనకచర్లపై తగ్గేదేలే..

**ఎపి యత్నాలను అడ్డుకునేందుకు న్యాయ, చట్టపరమైన చర్యలు ● జులై మొదటివారంలో సిఎల్పీ సమావేశం, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ● 201 కి.మీ. మేర ఆర్ఆర్ఆర్ నిర్మాణం ● ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం, డిసెంబర్ 9న ఆవిష్కరణ ● అపరిష్కృతంగా ఉన్న అంశాలపై 2 రాష్ట్రాల అధికారుల కమిటీ సమావేశం ● పిసి ఘోష్‌కు పూర్తి వివరాలను అందించే బాధ్యత అధికారులకు అప్పగింత ● స్పోర్ట్స్ పాలసీకి ఆమోదం ● ప్రతి నెల రెండుసార్లు కేబినెట్ భేటీ, మూడు నెలలకొకసారి ప్రత్యేక భేటీ ● కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం, శ్రీహరి**



సోమవారం కేబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న మంత్రులు పొంగులేటి, పొన్నం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్23:** తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఎపి తలపెట్టిన గోదావరి బనకచర్ల ప్రాజెక్ట్‌ను వ్యతిరేకించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని ఇప్పటికే కేంద్ర జల వనరుల శాఖ మంత్రిని ముఖ్యమంత్రి, ఇరిగేషన్‌మంత్రి స్వయంగా ఢిల్లీకి వెళ్లి కలిసి విజ్ఞప్తి చేశారు. చట్టపరంగా, న్యాయపరంగా బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాలని, అన్నివేదికలను ఉపయోగించుకోవాలని కేబినెట్ తీర్మానించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం సాయంత్రం దాదాపు ఐదు గంటల పాటు కొనసాగింది. ఈ భేటీలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలను సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బిసి సంక్షేమశాఖమంత్రి పొన్నం ప్రభాకర్, క్రీడా, పశు సంవర్ధక శాఖల మంత్రి శ్రీహరితో కలిసి సచివాలయంలో మీడియాకు వివరించారు. గోదావరి బనకచర్లపై ఇప్పటి వరకు జరిగిన పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణకు సంబం ధించి జులై మొదటి వారంలో సిఎల్పీ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించిన కేబినెట్ నిర్ణయం తీసుకుం దని తెలిపారు. బనకచర్లపై పూర్తి వివరాలతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని కేబినెట్ తీర్మా నించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది వానా కాలం పంటలకు పెట్టుబడి సాయం రైతు భరోసాను విజయవంతంగా రికార్డు వేగంతో అందించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతునేస్తం కార్యక్రమంలో ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లో 9వేల కోట్లు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. కోటీ 49 లక్షల ఎకరాలకు ఈ సాయాన్ని పంపిణీ చేసింది. ఇంత తక్కువ వ్యవధిలో రాష్ట్రంలోని దాదాపు 71 లక్షలమంది రైతులకు రైతు భరోసా సాయం అందించిన ఘనత మా ప్రభుత్వానిదని మంత్రులు తెలిపారు. శుభ సందర్భాన్ని రైతుల సమక్షంలోనే ఉత్సవంగా జరుపుకోవాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు సెక్రటేరియట్ ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద 2 వేల మంది రైతులతో 'రైతు నేస్తం' కార్యక్రమం నిర్వహిస్తుంది. అన్ని జిల్లాల్లో >>2

> **రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్న అంశాలపై రెండు తెలుగు రాష్ట్రాల అధికారుల కమిటీ సమావేశంలో చర్చించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు పై పిసి ఘోష్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖపై కేబినెట్ చర్చించింది.**



**ప్రతీకార జ్వాలలు**

**అమెరికా ఎయిర్‌బేస్‌పై ఇరాన్**

# క్షిపణి దాడులు

**వెంటనే గగనతలం మూసివేసిన ఖతార్**

**గల్ఫ్‌లోని యుఎస్ స్థావరాలను లక్ష్యం చేసుకొన్న టెహ్రాన్**

**వార్ రూమ్‌లో చీఫ్‌లతో భేటీ అయిన ట్రంప్**

**దాడులతో అట్టుడుకుతున్న పశ్చిమాసియా**



**దోహా,జూన్ 23:** ఇరాన్‌పై నేరుగా దాడులుచేసి అణుస్థావరాలను ధ్వంసంచేసిన అమెరికాకు గుణపాఠం చెపుతామని, ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించిన ఇరాన్ అనుకున్నట్లే అమెరికా స్థావరాలపై దాడులుప్రారంభించింది. పశ్చిమాసియాలోని అమెరికా వైమానిక, నౌకాయాన, సైనిక స్థావరాలన్నింటినీ ధ్వంసంచేస్తామని ప్రకటించిన కొద్ది గంటలకే ఈ దాడులు జరిగాయి. ప్రస్తుతం గల్ఫ్‌లోని ఖతార్‌లో ఉన్న వైమానిక బేస్‌లపై ఇరాన్ ఐఆర్‌జిసి ఏడు క్షిపణులు ప్రయోగించిందని తేలింది. ఖతార్‌లో ఉన్న అల్ ఉదీద్ ఎయిర్‌బేస్‌ను ఇరాన్ టార్గెట్‌చేసింది. దోహా, ఖతార్ ప్రాంతాల్లో భారీ ఎత్తున పేలుళ్ల జరిగినట్లు ఖతార్‌ప్రభుత్వం ప్రకటించింది. సెంట్రల్ దోహా, ఖతార్ రాజధాని దోహాకు ఉత్తరం వైపున ఉన్న లూసైల్ ప్రాంతంలోను ఈ దాడులుచేసింది. దీనితో ఖతార్ వెంటనే తన గగనతలాన్ని మొత్తం మూసివేసింది. దేశ పౌరులు భద్రతను దృష్టిలో ఉంచు >>2

## నేడు రైతు భరోసా విజయోత్సవ సభ

**ఇప్పటిదాకా రూ. 8,284 కోట్లు జమ**

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త :** రైతు భరోసా విజయోత్సవాలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తెలంగాణ సచివాలయం వద్ద రైతు భరోసా విజయోత్సవ సభ నిర్వహించనుంది. సభ ఏర్పాటు నేపథ్యంలో సోమవారం సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద స్థలాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి వివరాలు వెల్లడిస్తూ గతంలో ఎప్పుడూ లేని విధంగా రైతుభరోసా నిధులను ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లోనే పూర్తి చేసిన సందర్భంగా, సెక్రటేరియట్ ఎదురుగా >>2

# ఉగ్రవాదానికి చరమాంకం

**ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం మున్ముందుకు**

**బిజెపికి పార్టీకంటే దేశ సమగ్రతే ముఖ్యం: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



**హైదరాబాద్, జూన్ 23 ప్రభాతవార్త:** బిజెపికి పార్టీ ఒక్కటే ముఖ్యంకాదు.. దేశం సమగ్రంగా ఉండడం అత్యంత ముఖ్యం అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో డా.శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తర్వాత ఆర్టికల్ 370 విషయంలో అప్పటి ప్రధాని నెహ్రూ తాత్కాలిక ప్రయోజనాల కోసం దేశ భవిష్యత్తును తాకట్టు పెట్టారని, పాకిస్థాన్‌కు కశ్మీర్‌లోని కొంతభాగాన్ని అప్పగించారని అన్నారు. తొలి కేంద్ర మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసిన డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ నెహ్రూ మంత్రివర్గం నుంచి రాజీనామా చేసి భారతీయ జనసంఘ్‌ను స్థాపించారు. ఆర్టికల్ 370ను వ్యతిరేకిస్తూ కశ్మీర్ పరిరక్షణ కోసం ఉద్యమాన్ని ప్రారంభించారు. దేశమంతా త్రివర్ణ పతాకం ఉండగా, కశ్మీర్‌కు మాత్రం మరో జెండా ఉండేదని, దేశమంతా ఒక ప్రధాని ఉండగా, కశ్మీర్‌కు మరో ప్రధానమంత్రి ఉండేవారు అన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగం దేశవ్యాప్తంగా అమలవుతుంటే, జమ్ము కశ్మీర్‌లో మాత్రం ఆర్టికల్ 370 ద్వారా ప్రత్యేక హక్కులు ఉండేవి అన్నారు. అప్పటి ప్రధాని నెహ్రూ స్వార్థపూరిత నిర్ణయాలతో దేశానికి నష్టం కలిగిందని శ్యామాప్రసాద్ ముఖర్జీ చెబితే, ఆయన మాటలను నెహ్రూ పెడచెవిన పెట్టారు. ఆర్టికల్ 370ని రద్దు చేయాలని,జమ్ము కశ్మీర్‌ను భారతదేశంలో అంతర్భాగంచేయాలని శ్యాంప్రసాద్ ముఖర్జీ మొట్టమొదట ఉద్యమాన్ని చేపట్టారు. వీసా,పర్మిట్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, జమ్ము కశ్మీర్‌లో అడుగుపెట్టారు. ఆయనతో పాటు అటల్ బిహారీ వాజ్‌పేయి సైతం ఉన్నారు.దేశ ప్రజలను చైతన్యం చేయాలని, కశ్మీర్‌లో జరుగుతున్న అసమానతల గురించి తెలియజేయాలని శ్యాంపసాద్ ముఖర్జీ వాజ్‌పేయిని ప్రేరేపించారు. కానీ, జమ్ముకశ్మీర్‌లో అడుగుపెట్టిన వెంటనే ఆయనను పర్మిట్ లేదన్న కారణంతో అరెస్ట్ చేశారు. తర్వాత ఆయన జమ్ముకశ్మీర్‌లోనే అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఈ ఘటన హత్యేనన్న ఆరోపణలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. దేశ సమగ్రతను కాపాడాలన్న సంకల్పంతో, ఆ ఆలోచనను కార్యరూపం దాల్చేందుకు ముందడుగువేసి డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలి >>2



# 'స్థానిక' ఎన్నికలు ఇంకెప్పుడు?

**ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు**

**గతేడాదే పూర్తయిన సర్పంచ్‌లు, ఎంపిటిసిల పదవీకాలం**

**గతంలో ప్రభుత్వం నెల గడువు కోరగా, రెండు నెలలు కావాలన్న ఇసి**

**హైదరాబాద్ జూన్ 23 ప్రభాతవార్త:** ఎన్ని రోజుల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. గత ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామన్న ప్రభుత్వం ఎందుకు ఎన్నికలు నిర్వహించలేదన్న నిలదీసింది.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నల్గొండ జిల్లా మాజీ సర్పంచ్‌లతో పాటు దాఖలైన మొత్తం ఆరు పిటిషన్లపై ఇవాళ తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. 2024 ఫిబ్రవరి 1వ తేదీతో తెలంగాణలో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిపోగా ఎంపిటిసి సభ్యుల పదవీకాలం 2024 జులై 5తో పూర్తయింది. నిబంధనల ప్రకారం 6 నెలలలోపు ఎన్నికల నిర్వహించాల్సి ఉండగా ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం జాప్యం చేస్తున్నదని తెలంగాణహైకోర్టులో గతంలో పిటిషన్లు దాఖలు కాగా వీటిపై ఇదివరకు >>2

## డ్రగ్స్ కేసులో తమిళ నటుడు శ్రీరామ్ అరెస్టు



**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** తమిళంతో పాటు పలు దక్షిణాది చిత్రాల్లో నటించిన కోలీవుడ్ నటుడు శ్రీరామ్ డ్రగ్స్ కేసులో తమిళనాడు పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. కొంతకాలంగా శ్రీరామ్ డ్రగ్స్ వాడుతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న చెన్నై నార్కో >>2

# 'ఓటుకు నోటు' సైతం ట్యాపింగ్‌తోనే నిర్ధారణ!

**2015 నుంచే నేతల ఫోన్లు ట్యాప్ అయినట్లు గుర్తించిన సిట్**

**ఎస్ఐబి తప్పుడు సమాచారం ఇచ్చిందని శాంతికుమారి వాంగ్మూలం?**

**సిట్ విచారణలో సంచలన విషయాలు**

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరిన్ని సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. 2018 ఎన్ని కలకు ముందు నుంచి ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు సిట్ విచారణలో తాజాగా వెలుగు చూసినట్లు తెలిసింది. 2015లో తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన ఓటుకు నోటు కేసు కూడా ఫోన్ ట్యాపింగ్ ద్వారానే ఎస్ఐబి బృందం గుర్తించిందని సిట్ విచారణలో తేలిందని తెలిసింది. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం 2023 ఎన్నికల్లోనే ప్రభాకర్‌రావు బృందం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు భావించిన సిట్ అధికారులు దీనికి సంబంధించి తాజాగా అందిన ఆధారాలను పరిశీలించిన తరువాత ఈ గోల్‌మాల్ 2018 ముందు నుంచి జరుగుతున్నట్లు సిట్ నిర్ధారించినట్లు తెలిసింది. మరోవైపు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి మాజీ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి సిట్ అధికారులకు సంచలన విషయాలను వెల్లడిస్తూ వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది.

అప్పట్లో ఎస్ఐబి అధికారులు ఫోన్ ట్యాపింగ్ విషయంలో తమకు తప్పుడు సమాచారం అందించారని శాంతి కుమారి సిట్ అధికారులకు వాంగ్మూలం ఇచ్చినట్లుతెలిసింది. శాంతి కుమారితో పాటు అప్పట్లో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి వున్న రివ్యూ కమిటీ సభ్యుడు, సీనియర్ ఐఎఎస్ అధికారి రఘునందన్‌రావు కూడా ఇదేవిషయాన్ని సిట్ అధికారులకు వెల్లడించినట్లు తెలిసింది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు >>2

## ఇఇ శ్రీధర్ లాకర్లలో రూ. 5కోట్లు గుర్తింపు

**కొనసాగుతున్న విచారణ**

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులో అరెస్టయిన నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నూనె శ్రీధర్‌కు సంబంధించి హైదరాబాద్‌లోని ఎస్‌బిఐ లాకర్‌లోను ఎసిబి అధికారులు సోమవారం తెరిచారు. ఇందులో ఐదు కోట్ల రూపాయల విలువ చేసే స్థిరచరాస్తులను ఎసిబి అధికారులు గుర్తించారు. ఈ >>2



# ఈ రోడ్లకు దారేది?

**రాష్ట్రంలో మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్న 4417 కి.మీ. రోడ్లు**

**ఈ వర్షాల్లో మరింత పెరిగే అవకాశం**

**రిపేర్లు కేవలం మాటల్లోనే!**

**కోట్ల నిధులు ఏ 'గుంత'లోకి?**

**హైదరాబాద్,జూన్23,ప్రభాతవార్త:** రాష్ట్రంలో రహదారులు పలుచోట్ల గుంతలతో ప్రమాదకరంగా మారాయి. గతేడాది కురిసిన వర్షాలకు రాష్ట్రంలో సుమారు 2,200 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. రాష్ట్రంలో తక్షణమే రోడ్లు భవనాలుశాఖ ఆధ్వర్యంలోని4,417 కిలో మీటర్ల మేర రోడ్ల మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. వర్షాలు ముమ్మరం అయ్యేలోగా మరమ్మతు చేయకపోతే అవి మరింతగా దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రహదారులు, భవనాల శాఖకు 16 సర్కిళ్లలో స్టేట్ రోడ్స్ కింద సుమారు 29,234 కిలోమీటర్ల మేర రహదారులు ఉన్నాయి. గత వర్షాకాలం దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేయకపోవడంతో చిన్నపాటి వర్షంపడితేనే గుంతల్లో నీరు చేరి మరింత అధ్వానంగా మారుతున్నాయి. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగా >>2



సోమవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన ఐసిఎఐ స్నాతకోత్సవంలో విద్యార్థులకు పట్టాలు ప్రదానంచేస్తున్న రాష్ట్రపతి ముర్ము

# 'స్థానిక' ఎన్నికలు ఇంకెప్పుడు?

>> సైతం వాదనలు జరిగాయి. తాజాగా ఇవాళ మరోసారి విచారణకు రాగా పిటిషనర్లు, రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం వాదనలు పూర్తి కావడంతో స్థానిక సంస్థలపై హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

**30 రోజుల గడువివ్వండి**

విచారణ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం 30 రోజులు, ఎన్నికల సంఘం 60 రోజుల పాటు గడువు కావాలని హైకోర్టును కోరాయి. రిజర్వేషన్లు, వార్డు డివిజన్ ప్రక్రియ పూర్తి కావడానికి ప్రభుత్వం గడువు కోరగా ప్రభుత్వం వైపు నుంచి క్లియరెన్స్ వస్తే ఎన్నికలు నిర్వహించేందుకు తమకు రెండు నెలల పాటు సమయం కావాలనిఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. అయితే గత ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పినప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదని పిటిషనర్ తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎన్నికల నిర్వహణ విషయంలో గత విచారణలోనే చెప్పినట్లుగా ప్రభుత్వం ఎందుకు ఎన్నికలు నిర్వహించలేదని కోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

**ఆగస్టు తర్వాతే లోకల్ బాడీ ఎన్నికలు:**

అయితే స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సమయాత్తం అవుతున్నదన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పంచాయతీరాజ్ అధికారులు, ఎన్నికల నిర్వహణకు సంబంధించి కసరత్తు పూర్తి చేస్తున్నాయి. ఎన్నికల విషయంలో మంత్రులు సైతం వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ఇంట్రెస్ట్ ను పెంచుతోంది. అయితే కులగణన, బీసీల రిజర్వేషన్ అంశం సైతం కోర్టు పరిధిలో ఉంది. ఈ నేపథ్యంలో రిజర్వ్ చేసిన తీర్పులో ఏముంది? ప్రభుత్వానికి ఎలాంటి ఆదేశాలు జారీ కానున్నాయనేది సస్పెన్స్‌గా మారింది. ప్రభుత్వం, ఈసీ వాదనలను కోర్టు పరిగణలోకి తీసుకుంటే స్థానిక సంస్థల ఎన్నికలు ఆగస్టు తర్వాతే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.



సోమవారం న్యూఢిల్లీలో విశ్వకర్మ వర్గీలయులతో ముచ్చటిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

# బనకచర్లపై తగ్గేదేలే..

>> రైతు వేదికలతో పాటు మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు సంబరాలు నిర్వహించాలని కేబినెట్ పిలుపునిచ్చింది. ఈ సంబరాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో ప్రతీ జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం. డిసెంబర్ 9వ తేదీన అన్ని జిల్లాల్లో ఈ విగ్రహాలను ఆవిష్కరించాలని నిర్ణయం. హైదరాబాద్ చుట్టూ నిర్మించబోయే రీజినల్ రింగ్ రోడ్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించింది. ఆర్ అండ్ బీ విభాగం తయారు చేసిన మూడు ప్రతిపాదనలను ఈ సందర్భంగా కేబినేట్ పరిశీలించింది. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201 కిలో మీటర్ల పొడవు ఉండే అలైన్ మెంట్‌కు తుది ఆమోదం తెలిపింది. రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్న అంశాలపై రెండు తెలుగు రాష్ట్రాల అధికారుల కమిటీ సమావేశంలో చర్చించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు పై పిసి ఘోష్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖపై కేబినెట్ చర్చించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న పూర్తి వివరాలను ఈ నెల 30 లోగా కమిషన్‌కు అందివ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో సీనియర్ అధికారులకు ఈ బాధ్యతను అప్పగించింది. రాష్ట్రంలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేలా, క్రీడా ప్రమాణాలను పెంపొందించేలా రూపొందించిన తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ ని కేబినెట్ ఆమోదించింది. ఈ పాలసీలో భాగంగా తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు ఆఫ్ గవర్నెన్స్ ఏర్పాటుచేస్తారు. తెలంగాణ క్రీడా అభివృద్ధి నిధి (టిఎస్‌డిఎఫ్)ని ఏర్పాటు చేస్తుంది. జిల్లాలో క్రీడాభివృద్ధికి ప్రతి ఏడాది జిల్లా కలెక్టర్ల అధ్వర్యంలో ఉండే క్రూషియల్ బ్యాలెన్స్ ఫండ్ (సిబిఎఫ్)లో పది శాతం కేటాయించాలన్న నిర్ణయాన్ని ఆమోదించింది. స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లకు అర్హత జాబితాలో సిఎం కప్ రాష్ట్ర స్థాయి విజేతలకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ పాలసీ డాక్యుమెంట్ రూపొందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరించాలని నిర్ణయించారు. తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన, ప్రణాళికల తయారీకి వివిధ రంగాల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు, నిపుణులతో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా వృద్ధి సాధించాలనేది లక్ష్యం. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం సాధించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుంది. అన్ని శాఖలు, అన్ని విభాగాలు ఇందులో భాగస్వామ్యం పంచుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఆశించిన వృద్ధి లక్ష్యంగా ఎంచుకునే కార్యక్రమాలు, చేపట్టాల్సిన కార్యాచరణను విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరుస్తారు. విజన్ డాక్యుమెంట్ తయారీకి నీతి అయోగ్‌తో పాటు, ఇండియన్ స్కూల్ అఫ్ బిజినెస్ రాష్ట్ర ప్రభుత్వానికి నాలెడ్జ్ పార్టనర్‌గా వ్యవహరిస్తారు. కేంద్రం ప్రకటించిన వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా అన్ని రంగాల్లో సుస్థిర సమ్మిళిత అభివృద్ధి, రాష్ట్రంలో మౌలిక సదుపాయల వృద్ధితో పాటు మహిళలు, రైతులు, యువకుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయిం చారు. దేశ ఎకానమీలో పదో వంతు సంపదను అందించే రాష్ట్రంగా తెలంగాణ వృద్ధి సాధించాలనే భారీ లక్ష్యంతో ఈ విజన్ రూప కల్పన చేయాలని కేబినెట్ అధికారులకు దిశా నిర్దేశం చేసింది. పరిపాలన సంస్కరణల్లో భాగంగా ఇకపై ప్రతి మూడు నెలలకోసారి కేబినెట్ మీటింగ్‌ను స్టేటస్ రిపోర్ట్ మీటింగ్‌గా నిర్వహించాలని నిర్ణయం. ఆ మూడు నెలల్లో జరిగిన కేబినెట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలుపై యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌ను ఈ ప్రత్యేక భేటీలో సమర్పించి చర్చిస్తారు. ఈ మూడు నెలల ప్రత్యేక భేటీకి మంత్రివర్గంతో పాటు అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొంటారు. సంగారెడ్డి జిల్లాలో ఇంద్రేశం, జిన్నారం కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో పాటు ఇస్నాపూర్ మున్సిపాలిటీని అప్ గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. వీటితో పాటు రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీల్లో కమిషనర్లతో పాటు వివిధ విభాగాల్లో 316 పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. పంచాయతీ ఎన్నికలపై హైకోర్టు తీర్పు రిజర్వ్‌లో ఉన్నందున కేబినెట్‌లో ఏ నిర్ణయం తీసుకోలేదు.

# రూ. 5కోట్లు గుర్తింపు

>> ఆస్తులన్నీ శ్రీధర్‌తో పాటు అతని బంధువుల పేరిట వున్నాయని తేలింది. నీటి పారుదల శాఖలో అవినీతి అధికారులుగా ముద్రపడ్డ పలువురు సీనియర్లతో పాటు ఇంకొందరు రాజకీయ నేతలకు శ్రీధర్ బినామీగా వ్యవహరించినట్లు ఎసిబి గుర్తించడం తెలిసిందే. ఈ నెల 11వ తేదీన శ్రీధర్‌ను ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో ఎసిబి అధికారులు అరెస్టు చేయడం విదితమే. ఎసిబి కోర్టు ఆదేశాల మేరకు శ్రీధర్‌ను ఎసిబి అధికారులు వరుసగా నాలుగవ రోజు కూడా కస్టడీలోకి తీసుకుని విచారించారు. బంజారా హిల్స్‌లోని ఎసిబి ప్రధాన కార్యాలయంలో ఈ విచారణ జరిగింది. నీటి పారుదల శాఖలో ఇంజనీర్ల సంఘానికి అధ్యక్షుడుగా కూడా వున్న శ్రీధర్‌పై చాలా కాలంగా అవినీతి ఆరోపణలు వున్నాయి. కాగా శ్రీధర్ విచారణ మంగళవారం నాడు ముగియనుంది.

# శ్రీరామ్ అరెస్టు

>> టిక్స్ ఇంటెలి జెన్స్ యూనిట్ విభాగం పోలీసులు అతనిపై నిఘా వుంచారు. సోమవారం నాడు అతన్ని అరెస్టు చేసి కొంతమేర డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శ్రీరాంకు వైద్య పరీక్షలు నిర్వహించగా అతను కొంతకాలంగా డ్రగ్స్ వాడుతున్నట్లు నిర్ధారణ అయ్యింది. ఎఐడిఎంఎ మాజీ నేత ప్రసాద్ నుంచి శ్రీరాం డ్రగ్స్‌ను కొంటున్నట్లు తేలింది. ఈ కేసులో ప్రసాద్‌తో పాటు మరో మధ్యవర్తిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. శ్రీరాం అసలు పేరు శ్రీకాంత్, చిత్తూరు జిల్లా తిరుపతికి చెందిన ఇతను 15 ఏళ్ల క్రితం సినీ రంగంలోకి వచ్చి తన పేరును శ్రీరాంగా మార్చుకున్నాడు.

# ట్యాపింగ్‌తోనే నిర్ధారణ!

>> రేపుతున్న ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణలో మరిన్ని విషయాలు బయటకు వస్తున్నాయి. రాష్ట్ర కాంగ్రెస్, బిజెపి నేతలు ఆరోపిస్తున్నట్లుగా 2018 ఎన్నికల్లోనూ అంతకు ముందు కూడా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు సిట్ విచారణలో వెలుగు చూసినట్లు సమాచారం. 2018 ఎన్నికల వేళ అప్పటి ఎస్ఐబి బాస్‌గా డిఐజి ర్యాంకులో వున్న ప్రభాకర్ రావు తన బృందంతో ప్రతిపక్ష నేతల ఫోన్‌లను వందల సంఖ్యలో ట్యాపింగ్ చేసినట్లు సిట్‌కు తాజాగా ఆధారాలు లభించినట్లు తెలిసింది. ఇప్పటి వరకు ఫోన్ ట్యాపింగ్ 2023 ఎన్నికల సమయంలోనే జరిగినట్లు అందరు భావించగా ఈ గోల్‌మాల్ ఐదేళ్ల ముందు నుంచి జరిగినట్లు తాజాగా రూఢీ అయినట్లయ్యింది. అప్పట్లో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌లో కాంగ్రెస్ నేతలతో పాటు తెలుగు దేశం, బిజెపి నేతల ఫోన్ లు ఎక్కువగా వున్నాయని సిట్ విచారణలో తేలిందని సమాచారం. ఫోన్ ట్యాపింగ్‌కు బీజం పడింది ఓటుకు నోటు కేసుతోనే అని సిట్ అధికారులకు ఆధారాలు లభించినట్లు తెలిసింది. 2015లో జరిగిన ఈ కేసులో నాటి తెలుగుదేశం నేత ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి అరెస్టయి రెండు నెలల పాటు జైల్లో వుండడం తెలి సిందే. ఈ కేసులో ఎపి సిఎం చంద్రబాబు నాయుడు సహా పలువురు నిందితులు కూడా వుండడం విదితమే. ఓటుకు నోటు కేసు వెలుగు చూడడానికి ఫోన్ టా ్యపింగ్ కారణమని సిట్ విచారణలో తేలిందని సమాచారం. దీని తరువాత ప్రభాకర్ రావు బృందం ఇష్టారాజ్యంగా రాజకీయ నేతలు, ప్రముఖులు, వ్యాపారుల ఫోన్‌లను ట్యాపింగ్ చేసి భారీగా లబ్దిపొందినట్లు సిట్ విచారణలో వెలుగు చూసిందని సమాచారం. అప్పట్లో మావోయిస్టు నాయకులు, వారి సాను భూతిపరుల పేరిట కొందరి ఫోన్‌లను ట్యాపింగ్ చేయాలని ఎస్ఐబి అధికారులకు తమకు చిట్టా ఇచ్చిన మాట వాస్తవమేనని, అయితే ఇందులో వున్న నంబర్లు రాజకీయ నేతలు, ప్రముఖులు, జడ్జిలు, జర్నలిస్టులవని తమకు తెలియవని, దీనిపై ఎస్ఐబి అధికారులు తమకు తప్పుడు నివేదిక ఇచ్చారని శాంతి కుమారి, రఘునందన్ రావు తమ వాంగ్మూలంలో వెల్లడించినట్లు తెలిసింది. అప్పట్లో తమకు అందిన నంబర్లలో తాము అభ్యంతరం చెప్పామని, దీనిపై ఆ తరువాత ఏం జరిగిందనేది తమకు తెలియదని వారిద్దరు సిట్ అధికారులకు వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. ఇదే కేసులో మరికొందరి వాంగ్మూలం వెలుగు చూడలేదు. ఇంకొందరి వాంగ్మూలం నమోదు కావాల్సి వుంది.

**ఫోన్ ట్యాపింగ్‌పై కీలక విషయాలు వెల్లడించిన ప్రభాకర్ రావు**

ట్యాపింగ్ వల్లే దుబ్బాక, మునుగోడు ఉప ఎన్నికలతో పాటు పలుచోట్ల నేతలు, వ్యాపారుల డబ్బులు సీజ్ మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరవసారి సిట్ విచారణకు హాజరైన ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు దీనికి సంబంధించి కీలక సమాచారం వెల్లడించినట్లు తెలిసింది. అప్పట్లో జరిగిన దుబ్బాక, ముగుగోడు ఉప ఎన్నికల సమయంలో బిజెపి నేతలకు సంబంధించి పట్టుకున్న డబ్బులంతా ఫోన్ ట్యాపింగ్ వల్లే సాధ్యమయ్యిందని ఆయన అంగీకరించినట్లు తెలిసింది. అప్పట్లో తాము బిజెపి నేతల ఫోన్‌లను ట్యాపింగ్ చేసి డబ్బుల తరలింపుపై అందిన సమాచారాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందించగా వారు డబ్బులను దారిలో పట్టుకునే వారని ప్రభాకర్ రావు అంగీకరించినట్లు తెలిసింది. దీంతో పాటు అప్పట్లో ప్యారడైజ్ వద్ద భవ్య ఆనంద్ ప్రసాద్ అనే వ్యాపారికి చెందిన 70 లక్షల రూపాయల నగదును కూడా ఇదేరీతిన జప్తు చేశామని ఆయన అంగీకరించినట్లు తెలిసింది. దీంతో పాటు అప్పట్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు హైదరాబాద్‌లో పట్టుకున్న హవాలా నగదు సహా నేతలకు సంబంధించిన నగదు కూడా ట్యాపింగ్ ఆధారంగానే సాధ్యమయ్యిందని ప్రభాకర్ రావు అంగీరించినట్లు తెలిసింది.

# క్షిపణి దాడులు

>> కుని ఈ చర్యలుచేపట్టినట్లు తేలింది. కొన్ని క్షిపణులు ఆకాశ మార్గంలో అల్ ఉదీద్ ఎయిర్‌బేస్‌వెపు శరవేగంగా దూసుకువెళ్లినట్లు దృశ్యాలు కనిపించాయి. అమెరికా ఇరాన్‌పై దాడికి ఎన్ని బాంబులను వినియోగించిందో ఇరాన్‌కూడా అమెరికా వైమానిక స్థావరాలపై అదేసంఖ్యలో క్షిపణి దాడులు చేసిందని ప్రకటించారు. పరిస్థితి తీవ్రం అవుతుండటంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్, డిఫెన్స్ సెక్రటరీ పేటే హెగ్‌సేత్ జాయింట్‌స్టాఫ్ ఆఫ్ చీఫ్స్ జనరల్ జాన్ కైనీలు వార్‌రూమ్‌లో అత్యవసర సమావేశంనిర్వహించి ఖతార్‌పై ఇరాన్‌దాడుల స్థితిపై చర్చలుజరిపారు. ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామ్మర్‌పేరిట నిర్వహించిన దాడుల్లో బంకర్‌బస్టర్ బాంబులు ఉపయోగించి ఇరాన్‌లోని మూడు కీలక అణుస్థావరాలను ధ్వంసంచేసింది. సోమవారం కూడా కొన్ని చోట్ల దాడులునిర్వహించిందని తేలింది. ఇందుకు ప్రతీకారం తప్పదని ముందే హెచ్చరించిన ఇరాన్ తాను అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు తొలివిడతగా ఖతార్ ఎయిర్‌బేస్‌ను ఎంచుకుని దాడులుచేసింది. ఇరాన్ తానుచేసిన దాడులకు ఆపరేషన్ బేషరత్ ఫతాహ్ అని పేరుపెట్టింది. యుద్ధవాతావరణం అలుముకుంటుండటంతో దోహా ఎయిర్‌పోర్టుకువచ్చే విమానసర్వీసులన్నింటిని దారిమళ్లించాలని ఆదేశాలుజారీచేసింది. అలాగే ఖతార్‌లోని అమెరికా దౌత్యకార్యాలయం కూడా అమెరికా పౌరులు ముందస్తు జాగ్రత్తల్లోభాగంగా ఇళ్లనుంచి బయటికి రావద్దని తదుపరి మార్గదర్శకాలు వెలువడేంతవరకూ అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని హెచ్చరించింది. అయితే ఈ దాడుల పరిణామాలు కూడా మరింత తీవ్రం కావచ్చని అంచనా. పశ్చిమాసియాలోని మా స్థావరాలపై దాడులుచేస్తే ఇరాన్‌కు మరింత గట్టిగా బుద్ధిచెపుతాం అంటూ అమెరికా అధ్యక్షుడు హెచ్చరించిన సంగతి తెలిసిందే. అలాగే ఇజ్రాయెల్‌కూడా తాము అనుకున్న లక్ష్యం నెరవేరిందని, యుద్ధం మరెంతోకాలం సాగదని ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. ఇపుడు తాజాగా జరిగిన ఇరాన్‌దాడులు పరిస్థితులను మరింత ఉద్రిక్తంగా మార్చే ప్రమాదం లేకపోలేదు. ఇరాన్‌కూడా అనేక కీలక ఇజ్రాయెల్ విద్యుత్‌స్థావరాలపై దాడులుచేయడంతో ఇజ్రాయెల్‌లోని కొన్ని ప్రాంతాల ప్రజలు గాడాంధకారంలోమునిగిపోయారు.

అందుకు ప్రతిగా ఇజ్రాయెల్‌కూడా ఇరాన్‌లోని ముఖ్య నగరాలను టార్గెట్‌చేసి దాడులకు ఉపక్రమించింది. తాజాగా అమెరికాపై దాడులు ఇపుడు ఎటుదారితీస్తాయోనన్న ఆందోళనలు ఇరాన్‌ప్రజలను పీడిస్తున్నాయి. ఇదిలా ఉండగా అమెరికా దాడులను తీవ్రంగా ఖండించిన రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇరాన్‌కు సంపూర్ణమద్దతునుప్రకటించారు. అలాగే ఉత్తరకొరియాసైతం ఇరాన్‌కు మద్దతును ప్రకటించింది.

సుదీర్ఘకాలంగా ఉత్తరకొరియాకు ఇరాన్‌తో స్నేహసంబంధాలున్నాయని అధ్యక్షుడు కిమ్‌జాంగ్ ఉన్ ప్రకటించారు. అదేవిధంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌సైతం తన మద్దతును తెలియజేసారు. ప్రస్తుతం రష్యా పర్యటనలో ఉన్న ఇరాన్ మంత్రి అరాగ్చి అక్కడ అధ్యక్షుడు, ఇతర కేబినెట్ మంత్రులు, రక్షణరంగ ప్రతినిధులతో భేటీ అయి మొత్తం పరిస్థితులు వివరించారు. పశ్చిమదేశాల్లో యుద్ధాన్ని రెచ్చగొడుతున్నదని రష్యా, కొరియాలు ఆరోపించాయి. ఇక ఇతర మద్యప్రాచ్యదేశాల్లోని సైనిక, వైమానిక, యుద్ధనౌకలను ఇరాన్ దాడులతో అక్కడినుంచి ఇతర సురక్షితప్రాంతాలకు తరలిస్తోంది.

# ఈ రోడ్లకు దారేది?

>> ఇలో పలుచోట్ల కంకర తేలి, గుంతలు ఏర్పడ్డాయి. రాష్ట్రంలో సుమారు 1,690 కిలోమీటర్ల మేర రోడ్లకు అత్యవరంగా మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. అక్కడక్కడా పనులు చేస్తున్నామని చెబుతున్నా ఎప్పటిలాగానే అధ్వానంగానే కనిపిస్తున్నాయి. భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా కురిసిన అధిక వర్షాల కారణంగా పలు గ్రామాల్లో రహదారులు గుంతలు పడి దారుణంగా మారాయి. ఇప్పుడు మరమ్మతులు చేయకుంటే వర్షాకాలంలో ప్రయాణికులు నిత్యం నరకం చూడాల్సిన పరిస్థితులు నెలకొంటాయి. ఇప్పటికే తరచూ వాహనాలు పాడవుతున్నాయని చోదకులు, వాహనాల యజమానులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని అటవీ గ్రామాల్లో ఆర్టీసీ బస్సులు నడపాలంటే భయపడాల్సి వస్తోందని డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో ఏడు ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బి రోడ్ల మరమ్మతు పనులకు సుమారు రూ.2.90 కోట్ల నిధులు కొద్ది నెలల క్రితం మంజూరయ్యాయి. ఈ నిధులతో గుంతలు పడిన రోడ్ల మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. చాలావరకు పన్నుల నత్తనడకన సాగుతున్నాయి. కాటారం నుంచి మానేరు వంతెన వరకు. గంగారం క్రాస్ రోడ్డు నుంచి కాళేశ్వరం వరకు, ప్రతాపగిరి రోడ్డు, భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్ రోడ్డు మార్గంలోని రాజీవ్‌నగర్ నుంచి రాంపూర్ వరకు మరమ్మతు పనులు చివరిదశకు చేరాయి. గణపురం పట్టణంలో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణ పనులు ఇంకా మొదలు కాలేదు. భూపాలపల్లి జాతీయ రహదారి నుంచి మల్లంపల్లి గ్రామం వరకు గుంతలు పడి రోడ్డు దెబ్బతింది. మరమ్మతు కోసం నిధుల విడుదలకు ప్రతిపాదనలు పంపించినా, నిధులు విడుదల కాలేదు. గుంతల కారణంగా ద్విచక్రవాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలు పూడ్చితే ప్రయాణికులకు ఇబ్బందులు తొలగిపోతాయి. చిట్యాల మండలం ముషినిపర్తి గ్రామం నుంచి బావుసింగ్‌పల్లి గ్రామం వరకు గుంతలతో ప్రమాదకరంగా మారింది.

ఈ రోడ్డు రైతులతో పాటు చుట్టు పక్కన గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతుంది. రూ.20 లక్షలు నిధులు మంజూరైనా పనులు ప్రారంభంకాలేదు. గుంతలు పూడ్చకుంటే వర్షాకాలం రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలుంటాయి.. బయ్యారం ఇబ్రహీంపల్లి రోడ్డు దుస్థితి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు నడిచే ఈ రోడ్డులో అడుగడుగునా గుంతలే రూ.70 లక్షలు మంజూరైనా పనులు చేపట్టలేదు. వర్షాకాలంలో గత కారణంగా రోడ్డు ప్రమాణాలు జరిగే అవకాశం ఉంది. భూపాలపల్లి పట్టణంతో పాటు పలు గ్రామాల్లో చేపట్టిన రోడ్ల విస్తరణ పనులు సంబందిత అధికారుల పర్యవేక్షణ లేకుండా కొనసాగటం వల్ల గుత్తేదారులు ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. కాటారం నుంచి పెద్దపల్లి రోడ్డువరకు కొనసాగుతున్న విస్తరణ పనులు పూర్తిగా నత్త నడకన సాగుతున్నాయి. ఒకపక్క పనులు చేస్తుండగానే డివైడర్లు కూలిపోతున్నాయంటే నిర్మాణ పనుల్లో నాణ్యత ఎలా ఉందో తెలిసిపోతోంది. గణపురం మండలం బుద్దారం నుంచి వయా బాగిర్దిపేట మీదే గా రేగొండ మండలం కొడవటంచ వరకు రూ.65 కోట్లతో చేపట్టిన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రుద్రారం నుంచి కొయ్యూరు వరకు చేపడుతున్న పనులు సుమారు 80 శాతం వరకు పూర్తయినా, నాణ్యత లేమితో అక్కడక్కడ కంకర తేలిపోతోంది. కామారెడ్డి జిల్లాలో ప్యాచ్‌వర్క్ లకు ప్రభుత్వం సుమారు రూ.38 కోట్లు మంజూరు చేసినా పనులు సరిగ్గా జరగలేదు. పలుచోట్ల నాసిరకంగా, తూతూమంత్రంగా చేపట్టినట్లు ఆరోపణలున్నాయి. ప్యాచ్ వర్క్ చేసిన చోట మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రం నుంచి వడ్గాం హీరాపూర్ వరకు ప్రధాన రహదారిపై ప్రయాణించాలంటే 30 గ్రామాల ప్రజలు నరకం చూస్తున్నారు. వర్షాకాలంలో గుంతల రోడ్డుపై వెళ్లాల్సి వస్తోంది. మండల కేంద్రం నుంచి వడ్గాం, సిరికొండ వరకు 1995-96లో అప్పటి ప్రభుత్వం రూ.65లక్షలతో తారు రోడ్డును ఏర్పాటు చేసింది. తర్వాత మరమ్మతులకు నోచుకోలేదు.

ప్రజలు కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం 12.49 కి.మీ దూరం తారు రోడ్డు మరమ్మతులకు రూ.8.95 కోట్లు విడుదల చేసింది. టెండర్లు పూర్తివేసి పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. రెండు నెలల కిందట మొదటిసారి పిలిచిన టెండర్లలో పనులు తీసుకునేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. నారాయణపేట జిల్లాలోని మక్తల్ నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు. సుమారు 30 కిలోమీటర్లు ఉంటుంది. ఈ రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ఊట్కూరుతిప్రాస్పల్లి, ఊట్కూరుకొల్లూరు మధ్య గుంతలు ప్రమాదకరంగా మారాయి. సుమారు ఆర కిలోమీటరు మేర రోడ్డు గుంతలతోనే దర్శన మిస్తోంది. గతంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే ప్రయాణికులు జంకుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎమ్మెల్యే అభివృద్ధి నిధులతో తాత్కాలిక కాజ్వే నిర్మించారు. "ఎయిర్ప్రెషర్ జెట్ ప్యాచర్, పాటోల్ అండ్ రోడ్ మెయింటెనెన్స్ మిషనరీ" ద్వారా ప్రయోగాత్మకంగా గత ఏడాది నవంబరులో రంగారెడ్డి జిల్లా చిలుకూరు వద్ద ఆర్ అండ్ బి రోడ్లపై గుంతలను పూడ్చే పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ యంత్రాలతో అన్ని జిల్లాల్లో గుంతలను పూడ్చుతామని అధికారులు ప్రకటించారు. ఆదిలో కొద్ది రోజులు పనులు చేపట్టి మమ అనిపించారు. కానీ గుంతలుఅలాగే కనిపిస్తున్నాయి. రహదారులు, భవనాల శాఖకు 16 సర్కిళ్లలో స్టేట్ రోడ్స్ కింద సుమారు 29,234 కిలోమీటర్ల మేర రహదారులు ఉన్నాయి. ఇందులో 995 కిలోమీటర్ల సిసి రోడ్లు, 26,612 కిలోమీటర్ల బిటి, 549 కిలోమీటర్ల మెటల్, 1,078 కిలోమీటర్ల మట్టి రోడ్లు ఉన్నాయి. హ్యామ్ కింద అన్ని జిల్లాల్లో రోడ్లను బాగు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. అయితే కాంట్రాక్టర్లు బిల్లులు మంజూరు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుండటంతో ముందుకు రావడంలేదు. ఫలితంగా రోడ్ల పనులు ముందుకు సాగడంలేదు.

## వారం - వర్జ్యం

తేది : 24-06-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
చతుర్దశి రా.7.01
రోహిణి మ.12.55
వర్జ్యం సా.6.00-7.27
దు.ఉ.8.14-9.06, 2)రా.11.58-12.50
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** ప్రముఖులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. వృత్తి-వ్యాపారాలు విస్తరిస్తారు.

**వృషభం :** దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించుకుంటారు. మానసిక ప్రశాంతత పొందుతారు.

**మిథునం:** అనుకోని అతిథుల ద్వారా ముఖ్య విషయాలు తెలుసుకుంటారు. వస్తు సేకరణ.

**కర్కాటకం :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ప్రయాణాలు.

**సింహం:** ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు. భూ వివాదాలు తీరి లబ్ధిపొందుతారు.

**కన్య :** ఇంటాబయటా ప్రోత్సాహం లభిస్తుంది. సంతాన సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు.

**తుల :** మిత్రులతో అకారణంగా విరోధాలు ఏర్పడతాయి. దీర్ఘకాలిక సమస్యలు వచ్చి మీదపడతాయి.

**వృశ్చికం:** చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. శ్రమపడ్డా ఫలితం కనిపించదు.

**ధనుస్సు:** కుటుంబ సభ్యులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. నూతన వస్తుకొనుగోలు.

**మకరం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. శ్రమకోర్చి పనులు పూర్తిచేస్తారు.

**కుంభం:** భాగస్వామ్య వ్యాపారాలు ప్రారంభిస్తారు. ప్రముఖులనుండి ఆహ్వానాలు అందుతాయి.

**మీనం :** సంతానంనకు నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు. సోదరుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఉగ్రవాదానికి చరమాంకం

>> దానం చేశారు. డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ లక్ష్యాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2019లో నెరవేర్చారు. ఆర్టికల్ 370 రద్దుతో పాటు జమ్ము కశ్మీర్‌లో దళితులకు, మహిళలకు దేశంలోని ఇతర ప్రాంతాలవారిలా సమాన హక్కులు కల్పించబడ్డాయని అన్నారు. ఆర్టికల్ 370 అమలులో ఉండగా 42 వేల మంది సైనికులు, పౌరులు జమ్ము కశ్మీర్‌లో ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ వారిని పట్టించుకోలేదు. బడుగు బలహీన వర్గాలను వంచించింది. అక్కడ ప్రభుత్వాలు, కొంతమంది నాయకులు పాకిస్థానీలకు అనుకూలంగా వ్యవహరించారు. ఆనాడు జమ్ము కశ్మీర్ గోడలపై "ఓ దేశం కుక్కలారా, ఈ దేశం నుంచి వెళ్లిపోండి" అన్న రాతలు కనిపించేవి. దారుణ పరిస్థితులు ఉండేవని అన్నారు. అలాంటి సమయంలో జాతీయ పతాకాన్ని లాల్ చౌక్‌లో ఎగురవేయడానికి బిజెపి జాతీయ అధ్యక్షుడు మురళీ మనోహర్ జోషి కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ఏక్తా యాత్ర నిర్వహించారు. నరేంద్ర మోడీ కన్వీనర్‌గా వ్యవహరించారు. మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారాయి. ఆర్టికల్ 370 రద్దు తరువాత లాల్ చౌక్‌లో జాతీయ పతాకం అధికారికంగా ఎగురవేయబడిందన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కులం, మతం, భాషల పేరుతో దేశాన్ని విభజించే ప్రయత్నం చేసిందన్నారు. రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేసి, లక్షలాది మందిని జైలులో వేసి, పౌరహక్కులను హరించివేసి దేశాన్ని మొత్తం ఒక జైలుగా మార్చేశారు. ఆనాడు జనసంఘ్‌ను దేశం కోసం, పౌర హక్కుల కోసం, పత్రికా హక్కులను రక్షించేలా ప్రజాస్వామ్యం కోసం జనతా పార్టీలో తృణప్రాయంగా విలీనం చేసింది. అలాంటి విశిష్ట నాయకత్వాన్ని, దేశభక్తిని, గొప్ప సిద్ధాంతాన్ని మనకు అందించిన మహనీయుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అన్నారు.

# నేడు రైతు భరోసా విజయోత్సవ సభ

>> ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన రైతుపండగ కార్యక్రమంలో సాయంత్రం 6 గంటలకు రైతులను ఉద్దేశించి సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతారన్నారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతాపూర్వకంగా ప్రజా ప్రతినిధులు రైతులతో కలిసి వారి వారి నియోజకవర్గాల్లో, మండలాల్లో, గ్రామాల్లో పెద్దఎత్తున పాల్గొని ఈ రైతుపండగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా సాగులో ఉన్న ప్రతి గుంటకు రైతుభరోసా నిధులు జమ చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు 67.01 లక్షల మంది రైతుల ఖాతాలలోకి రూ. 8.284.66 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేసినట్టు పేర్కొన్నారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగులో ఉన్న మిగతా భూములకు కూడా రైతుభరోసా నిధుల ప్రక్రియను ఈ నెల 24వ తేదీ వరకూ పూర్తి చేస్తామన్నారు. సీఎం ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లోనే వానాకాలం రైతుభరోసా ప్రక్రియను పూర్తి చేసి, రైతులపై తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నా మన్నారు. ఈ నెల 16 న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకున్న రైతుభరోసా నిధుల విడుదలలో భాగంగా మొదటి రోజు రెండు ఎకరాల వరకు రూ.2,349.83 కోట్లు, రెండో రోజు 3 ఎకరాల వరకు రూ.3,901.73 కోట్లు, మూడో రోజు 4 ఎకరాల వరకు రూ.5,215.26 కోట్లు, నాలుగో రోజు 5 ఎకరాల వరకు రూ.6,404.70 ఎకరాలు, ఐదో రోజు 7 ఎకరాల వరకు రూ.7,310.59 కోట్లు, ఆరో రోజు 9 ఎకరాల వరకు రూ.7.770.83 కోట్లు, ఏడో రోజు 15 ఎకరాల వరకు రూ.8,284.66 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. ఇంత తక్కువ రోజుల్లోనే రైతుభరోసా నిధుల జమ ప్రక్రియను పూర్తి చేయడం రాష్ట్ర చరిత్రలోనే మొట్ట మొదటిసారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్న కూడా రైతు సంక్షేమంలో ఎలాంటి రాజీ పడకుండా వానాకాలం రైతుభరోసా పథకాన్ని పూర్తి చేయడం జరిగిందని చెప్పారు. ఇంతకుముందు రైతు రుణమాఫీ కూడా చెప్పినట్టుగానే ఆగస్టు 15 లోగా పూర్తి చేశామని ఈ సందర్భంగా మంత్రిగారు గుర్తుచేశారు. అంతేకాకుండా దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయనివిధంగా సన్నలకు మద్ధతు ధరపై రూ.500 బోనస్ ప్రకటించడం జరిగిందని, తద్వారా అదనంగా 2 వేల కోట్లకు పైగా రైతులు లబ్ధి పొందారన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా పండిన ప్రతి పంటను సేకరిస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే రైతుల సంక్షేమం కోసం మా ప్రభుత్వం రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.

# ఫోర్డో అణుకేంద్రంపై మళ్లీ వైమానిక దాడులు!

**టెహ్రాన్, జూన్ 23:** ఇరాన్‌లోని పర్వత ప్రాంతాల్లో ఉన్న ఫోర్డో భూగర్భ అణు కేంద్రం పై సోమవారం మరోసారి దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఫోర్డోపై మళ్లీ దాడి జరిగినట్లు ఇరాన్ మీడియా పేర్కొన్నది. అయితే యురేనియం శుద్ధికి చెందిన ఫోర్డో అణు కేంద్రంలో భారీనష్టం జరిగి ఉంటుందని అంతర్జాతీయ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ పేర్కొన్నది. భూగర్భ అణు కేంద్రంపై రెండు రోజుల క్రితం అమెరికా బీ2 బాంబర్లతో దాడి చేసిన విషయం తెలిసిందే. బంకర్ బస్టర్ బాంబర్లతో ఆ అణు కేంద్రాన్ని ధ్వంసం చేశారు. అయితే ఈ ఘటనపై వియన్నా నుంచి ఐఎఇఎ అధినేత రఫేల్ మారియానో గ్రోసీ ఒకప్రకటన విడుదలచేశారు. ఫోర్డోను పేల్చేందుకు భారీగా పేలోడ్ బాంబులను వినియోగించారని, చాలా తీవ్ర స్థాయిలో భూ ప్రకంపనలు వచ్చాయని, బహుశా తీవ్ర స్థాయిలో డ్యామేజ్ జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నామని మారియానో పేర్కొన్నారు. ప్రస్తుతం ఫోర్డో భూగర్భ కేంద్రంలో ఎంత నష్టం జరిగిందన్న దానిపై సమగ్రంగా అంచనా వేయలేమని ఆయన తెలిపారు. సుమారు 30 వేల పౌండ్ల బరువు ఉన్న జీబీయూ57 ఆర్డినెన్స్ పెనెట్రేటర్ బాంబును అమెరికా వినియోగించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఫోర్డో కేంద్రాన్ని ఇదే ధ్వంసం చేసి ఉంటుందని అనుమానిస్తున్నారు.


# అత్యంత రహస్య స్థావరంలో ఖమేనీ!

## ఇజ్రాయెల్, అమెరికాల హెచ్చరికలే కారణం

**టెహ్రాన్, జూన్ 23:** ఆపరేషన్ రైజింగ్ లైన్ పేరుతో ఇజ్రాయెల్ వరుసవెంబడి దాడులు, అటు అమెరికాసైతం ఆపరేషన్ మిడ్‌నైట్ పేరిట ఏకంగా అణుస్థావరాల విధ్వంసం వంటి సంఘటనల నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమైనీ భద్రతకు ముప్పు వాటిల్లుతున్నట్లు ఇరాన్‌ప్రభుత్వం భావిస్తోంది.



ప్రస్తుతం ఆయన అత్యంత రహస్య స్థావరంలో కనీసం ఐఆర్‌జిసికి కూడా తెలియని స్థావరంలో ఉంటున్నట్లు సమాచారం. దీనికితోడు ఇజ్రాయెల్ ఖమైనీ అంతంతోనే యుద్ధం ఆగుతుందని చేసిన హెచ్చరికలతో ఎవ్వరికీ తెలియని రహస్య స్థావరంలోకి ఆయన్ను తరలించారు. ముందుగానే తనిఖీచేసిన సిబ్బంది ఆయనకు రక్షణగా ఉన్నారు. శత్రువులకు ఎలాంటి అవకాశం లేకుండాచేసేందుకు ఎవరికీ తెలియని విభాగం ఆయన భద్రత బాధ్యతలునిర్వహిస్తోంది. ఈరహస్య యూనిట్ 24 గంటలు విధుల్లో ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నిజానికి ఖమైనీ సెంట్రల్ టెహ్రాన్‌లోని బీత్‌రహ్బారిగా పిలిచే కట్టుదిట్టమైన రక్షణకవచంగా ఉన్న భవనంలో ఉండేవారు. అక్కడినుంచే విధులు నిర్వహించేవారు. ప్రత్యేక సందర్భాల్లో మినహాయించి అత్యంత అరుదుగా బయటకు వచ్చేవారు. ఇజ్రాయెల్ ఖమేనీ నివాసంతోపాటు ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఉన్న మోనిరియే సమీపంలో వైమానిక దాడులుచేసింది. అలాగే సీనియర్‌సైనిక అధికారులు, అణుశాస్త్రవేత్తలను మట్టుబెట్టింది. ఖమే నీని అంతంచేస్తేనే యుద్ధం ముగుస్తుందని ఒకదశలో ఇజ్రాయెల్‌ప్రధాని నెత న్యాహు కూడా ప్రకటించారు. వీటన్నింటి నేపథ్యంలో ఇపుడు అత్యంత రహస్య స్థావరంలో ఖమైనీ నివసిస్తూ అక్కడినుంచే కార్యకలాపాలు సాగిస్తు న్నారు. డిజిటల్ ఉత్పత్తులసాయంతో ఆచూకీ తెలుస్తుందని ఈ ప్రాంతంలో మొత్తం కమ్యూనికేషన్ వ్యవస్థలను నిలిపివేసారు. తనకు విధే యులుగా ఉన్న వారి సాయంతోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.



# జూనియర్లు, సీనియర్లు తేడా లేకుండా సమన్వయంతో మెలగండి

## పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

### కోటి 50 లక్షల ఎకరాలకు రైతు భరోసా విడుదల : డిప్యూటీ సిఎం భట్టి

**హైదరాబాద్,జూన్23,ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీలో అంతా సమానులేనని సంస్థాగత అభివృద్ధికి పనిచేసే క్రమంలో సీనియర్, జూనియర్ తేడా లేకుండా సమన్వయంతో కలిసి పనిచేయాలని ఎఐసిసి ఇంచార్జీ నటరాజన్ తెలిపారు. గాంధీ భవన్ లో జై బాపు, జై భీమ్ కో ఆర్డినేటర్ల సమావేశంకు ముఖ్య అతిథులుగా ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఏఐసిసి రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథన్, సభ్యులు వంశీ చంద్ రెడ్డిలు పాల్గొన్నారు. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆమె సూచించారు రాజ్యాంగ పరిరక్షణ కోసం జై సంవిధాన్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంచండని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నాయకులపై ఉందని ఆమె వివరించారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులు విడుదల చేసామని తెలిపారు.ఇప్పటి వరకు 1 కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు.

**నియోజకవర్గాల పునర్విభజనలో రాష్టానికి అన్యాయం జరగొద్దు**

నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాదికి అదే విధంగా తెలంగాణకు అన్యాయం జరుగొద్దని దీనికోసం ప్రజలను జాగృతం చేయాలని ఎఐసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ అన్నారు. టిపిసిసి డిలిమిటేషన్ తొలి సమావేశం సోమవారం గాంధీభవన్ లో చైర్మన్ సభ్యులు వంశీ చంద్ రెడ్డి అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# హైకోర్టులో బండి సంజయ్, ఎమ్మెల్యే హరీశ్‌కు స్వల్ప ఊరట

## వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు

### ఎంపి లక్ష్మణ్ కేసు మరో ధర్మాసనానికి బదలీ

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** గతంలో తమపై నమోదైన కేసులను కొట్టివేయాలని కోరుతూ బిజెపికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, ఎమ్మెల్యే హరీష్ బాబు వేర్వేరుగా ఈ పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు బండి సంజయ్, హరీశ్ బాబులకు ఊరట కల్పించింది. కింది కోర్టుల్లో వారికి వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఎంపి లక్ష్మణ్‌కు సంబంధించిన కేసుల విచారణను వేరొక ధర్మాసనానికి బదిలీ చేయాలని హైకోర్టు న్యాయమూర్తి రిజిస్ట్రీని ఆదేశించారు. అనంతరం, ఈ పిటిషన్లపై తదుపరి విచారణను జూలై 17వ తేదీకి వాయిదా వేసింది.

# కంచ గచ్చిబౌలి భూములపై హైకోర్టు విచారణ వాయిదా

## టిజిఐఐసికి భూములు కేటాయించడంపై దాఖలైన పిల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 23:** రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో కొనసాగుతున్న విచారణ వాయిదా పడింది. ఈ భూములకు సంబంధించి దాఖలైన పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై (పిల్) విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. వివరాల్లోకి వెళితే, కంచ గచ్చిబౌలిలోని వివాదాస్పద భూములను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థకు (టీజీఐఐసీ) అప్పగించింది. ఈ భూములను అభివృద్ధి చేసి, ఐటీ కంపెనీలకు కేటాయించేందుకు టీజీఐఐసీ ప్రణాళికలు కూడా సిద్ధం చేసింది. ఈ క్రమంలో, సదరు భూములను యంత్రాలతో చదును చేసే పనులు ప్రారంభించడంతో, ఈ చర్యలను నిలుపుదల చేయాలని కోరుతూ హైకోర్టులో వేర్వేరుగా నాలుగు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా, టీజీఐఐసీకి భూములను కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేయాలని పిటిషనర్లు న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయితే, కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించిన కేసు ఇప్పటికే సుప్రీంకోర్టులో విచారణలో ఉందని ధర్మాసనం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో, సుప్రీం కోర్టులో కేసు విచారణలో ఉన్నందున, ఇక్కడ విచారణను కొనసాగించడం సమంజసం కాదని భావించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం, తదుపరి విచారణను మూడు వారాలపాటు వాయిదా వేసింది. దీంతో ఈ భూముల భవితవ్యంపై మరికొంతకాలం సందిగ్ధత కొనసాగనుంది.

# సిఎం కప్ పోటీలతో గ్రామస్థాయి క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తాం

## ఒలింపిక్‌లో పతకాల విజేతలకు ప్రోత్సాహకాలు: మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** సిఎం కప్ పోటీలు నిర్వహించి గ్రామస్థాయి క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తామని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ప్రముఖ కోచ్‌లను నియమిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఒలింపిక్ డే వేడుకలు నిర్వహించారు. 14 ప్రాంతాల నుంచి ఒలింపిక్ రన్ ద్వారా విద్యార్థులు ఇక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగా తీసుకురానున్న క్రీడా పాలసీలో అన్ని రకాల క్రీడాకారులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందిస్తామని పేర్కొన్నారు.'క్రీడా రంగానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బడ్జెట్లో అధిక మొత్తం కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువస్తున్న క్రీడా పాలసీకి త్వరలో రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపనుంది. నైపుణ్యమున్న యువతను బయటకు తీసుకొచ్చి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొస్తామన్నారు. ఇటీవల ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ జాతీయ క్రీడలలో పాల్గొని తెలంగాణ రాష్ట్రానికి పతకాలు సాధించిన క్రీడా కారులకు నగదు రూ.84 లక్షలనగదు పురస్కారాన్ని అందజేశారు.

**త్వరలోనే రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీ: జయేశ్ రంజన్**

ఒలింపిక్స్‌లో మన ప్రతిభను కనబరచడానికి కృషి చేయాలని ఐటీ,క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పిలుపు నిచ్చారు. ప్రపంచ వ్యాపనతంగా చాలా దేశాలు ఒలింపిక్స్‌లో తమ సత్తా చాటుతున్నాయన్నారు. క్రీడారంగంలో దేశం దూసుకు పోతోందని రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడా రంగంపై ఆసక్తిగా ఉన్నారని పేర్కొన్నారు.

**పతకాలు సాధించిన వారికి ఉద్యోగాలు: శివసేనారెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా క్రీడా పాలసీని తీసుకు వస్తోందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. దీని తర్వాత క్రీడాకారులకు మంచి ప్రోత్సా హకాలు ఉంటాయని చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ పతక విజేత దీప్తి జివాంజీ, ఐజి స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్ ఎం.రమేష్, డబుల్ ఒలంపియన్ మంజిత్, అర్జున అవార్డు గ్రహీతలు మిగతా దడ్ వే అనుప్‌కుమార్ యామ, ఇంటర్నేషనల్ అథ్లెట్ నందిని ఆగసర, మహిళా క్రికెటర్ గొంగిడి త్రిష వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




# ఒక్క ప్లాట్ రూ.33 కోట్లు..

## గచ్చిబౌలిలో రికార్డు స్థాయి ధర పలుకుతున్న భూమి

### హౌసింగ్ బోర్డు స్థలాలకు డిమాండ్

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాజధాని పరిసరప్రాంతాల్లోని హౌజింగ్ బోర్డుకు చెందిన భూముల బహిరంగ వేలంలో మరోసారి రికార్డు స్థాయి ధరలు పలికాయి. గచ్చిబౌలి ప్రాంతం లోని ఒక కమర్షియల్ ప్లాట్‌ను ఏకంగా రూ.33 కోట్లకు కొనుగోలు చేయడానికి ముందుకు రాగా,మరో చోట రూ. 13.51 కోట్లు పలికింది. రెండు ఎంఐజి ప్లాట్లను కూడా సుమారు 4.50 కోట్లకు పైగా వెచ్చించి బహిరంగ వేలంలో దక్కించుకోడానికి పోటీపడ్డారు.అలాగే చింతల్ ప్రాంతంలోని ప్లాట్లను కూడా కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేశారు.మొత్తం 11 ప్లాట్లను వేలం వేయగా రూ.65.02 కోట్ల మేర ఆదాయం వచ్చిందని హౌజింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌజింగ్ కమిషనర్ వి.పి.గౌతం తెలిపారు.నగరంలోని చింతల్, గచ్చిబౌలి, నిజాంపేట తదితర ప్రాంతాల్లో వివిధ రకాలైన ప్లాట్లకు సోమవారం నాడు హౌజింగ్ బోర్డు అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. చింతల్ ప్రాంతంలో 266 చదరపు గజాల విస్తీర్ణంలోని రెసిడెన్షియల్ ప్లాట్లు,గచ్చిబౌలి ప్రాంతంలో కమర్షియల్ ప్లాట్లు, నిజాంపేటలో 413 చదరపు గజాల ప్లాట్లు వీటిలో ఉన్నాయి.కూకట్ పల్లి కెపిహెచ్ బి కాలనీ కమ్యూనిటీ హాల్ లో నిర్వించిన ఈ స్థలాల వేలం పాటలో 55 మంది పాల్గొన్నారని హౌజింగ్ కమిషనర్ పేర్కొన్నారు.గచ్చిబౌలి ప్రాంతంలో 3271 చదరపు గజాల భూములు, చింతల్ ప్రాంతంలో 799.98 చదరపు గజాలు, నిజాంపేటలో 1653 చదరపు అడుగుల విస్తీర్ణంలో వేలం వేయగా రూ.65.02 కోట్లు బోర్డుకు ఆదాయంగా వచ్చింది. గచ్చిబౌలి హౌజింగ్ బోర్డు కాలనీలో ఉన్న 1487 గజాల కమర్షియల్ ల్యాండ్ ను గజానికి రూ.2.22 లక్షలు చొప్పున సుమారు రూ.33 కోట్లకు కొనుగోలు చేశారు.ఈ భూములకు చదరపుగజానికి 1.20 లక్షలను ఆఫ్‌సెట్ ధరగా నిర్ధారించగా వేలం పాటలో అది 2.22 లక్షలు పలికింది.అట్లాగే ఇదే ప్రాంతంలోని 1200 గజాల పాఠశాలభూములకు ఆఫ్ సెట్ ధర చదరపు గజానికి 80 వేలుగా నిర్ధారించగా, వేలంలో ఆ భూములకు రూ. 1.12 లక్షలకు కొనుగోలు చేశారు. అలాగే ఇక్కడి రెండు ఎంఐజి ప్లాట్లు చదరపు గజం రూ.1.86 లక్షలు, రూ.1.32 లక్షల ధరలు పలికాయి. ఒక్క గచ్చిబౌలి ప్రాంతానికి సంబంధించిన భూముల ద్వారానే రూ.55 కోట్ల 56 లక్షల 84 వేలు ఆదాయం హౌజింగ్ బోర్డుకు సమకూరింది. కుత్బుల్లాపూర్ మండలంలోని చింతల్ ప్రాంతంలోని హౌజింగ్ బోర్డు ఎంఐజి ప్లాట్లు కూడా అత్యధిక ధరలతో బహిరంగ వేలంలో అమ్ముడు పోయాయి.ఈ ప్రాంతంలో మొత్తం10ప్లాట్లను వేలం వేయగా,వీటిలో ప్లాట్ నెం.113,114,115ల ద్వారానే సుమారు రూ. 8.11 కోట్లమేర ఆదాయంవచ్చింది. నిజాం పేట బాచుపల్లిలోని 4 ప్లాట్లను సుమారు రూ.70 లక్షలకు వేలం పాటలో కొనుగోలు చేశారు.

# అమెరికాకు సొంతగడ్డపైనే మిన్నంటిన నిరసనలు

## ఇజ్రాయెల్‌కు మద్దతు నిలిపివేయాలంటూ నినాదాలు

**న్యూయార్క్, జూన్ 23:** ఇరాన్‌పై యుద్ధానికి దిగిన అమెరికాకు సొంతదేశంలోనే నిరసనలు మిన్నంటాయి. ఇజ్రాయెల్‌కు మద్దతివ్వడం ఆపండి అంటూ ప్లకార్డులుధరించిన నిరసనకారులు ఆందోళనలుచేపట్టారు. శ్వేతసౌధం ముందే డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఇక ఇరాన్‌పై యుద్ధం వద్దు. ఇజ్రాయెల్‌కు మద్దఉ ఇవ్వడం ఆపివేయండి గాజాలో నరమేధం ఆగిపోవాల్సిందే అని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నుద్దేశించి పలువురు ఇరాన్‌జెండాలను చేతబూని నినాదాలు చేసారు. అలాగేమరికొందరు ఇరాన్‌కు మద్దతుగా రోడ్లపైకి వచ్చి పాటలు పాడుతూ తమ నిరసనగళం విప్పారు. ప్రస్తుతం యుద్ధ వ్యతిరేక నినాదాలతో అమెరికా ప్రధాన నగరాలు బోస్టన్, చికాగో, న్యూయార్క్‌టైమ్ స్క్వేర్‌దగ్గర హ్యాండ్స్ఆఫ్ ఇరాన్ స్లోగన్లు ఉన్న బ్యానర్లను ప్రదర్శిస్తూ కొందరు నిరసన చేపట్టారు. వైట్‌హౌస్‌వద్ద ఉన్న నిరసనల్లో పశ్చిమాసియా ఉద్రిక్తతల్లో అమెరికా జోక్యం చేసుకోవద్దంటూ నినాదాలుచేయడం గమనార్హం.




టెహ్రాన్‌పై అమెరికాకు చెందిన బీ-2 బాంబర్లు దాడులుజరిపి సోమవారం ఉదయం వెనక్కి వచ్చేసాయి. ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్ పేరుతో 25 నిమిషాల్లోనే ఇరాన్ అణుకేంద్రాలైన ఫోర్డో, ఇస్ఫాహాన్; నటాంజ్‌లపై దాడులు చేసామని అమెరికా ప్రకటించింది. ఈ క్రమంలోనే అమెరికాలో యుద్ధ వ్యతిరేక నిరసనలు తీవ్రం అయ్యాయి. మరోవైపు ఆందోళనల నేపథ్యంలో అక్కడిభద్రతా బలగాలు అలర్ట్ అయ్యాయి. దౌత్య కార్యాలయాలతోపాటు మతపరమైన కేంద్రాలదగ్గర భద్రతను కట్టుదిట్టం చేసారు. ఇప్పటికే పలువురు ఆందోళన కారుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# కేబినెట్ సమావేశాల్లో సమస్యలపై చర్చ లేకుండా జాప్యం

## హామీలను నెరవేర్చండి.. బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్ర కేబినెట్ సమావేశాల్లో ముఖ్యమైన ప్రజా సమస్యలపై చర్చ లేకుండా, కబుర్లతో కాలయాపన చేసిన విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని బిజెఎల్‌పి నేతఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం బిజెపి కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. మరోసారి కేబినెట్ సమావేశం సోమవారం జరుగుతుందని,ఇప్పుడు కూడా అదే మళ్లీ జరుగుతుందా అన్న సందేహం నెలకొందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు అమలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీల గురించి ఇప్పటి వరకు కేబినెట్ సమావేశంలో ఎందుకు చర్చించడం లేదు? వాటిని అమలు చేసే ప్రణాళికను ఎందుకు సిద్ధం చేయలేకపోతున్నారు? ఇదే విషయాన్ని భారతీయ జనతా పార్టీ తరపున చాలాసార్లు స్పష్టంగా ప్రశ్నించిందన్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రజలకు ఇచ్చిన హామీలపై చర్చించకుండా, వాటిని అమలు చేసే దిశగా చర్యలు తీసుకోకుండా సమావేశం నిర్వహించడం, మళ్లీ మళ్లీ కాలయాపన చేయడం అంటే ఇదేనా పాలన? అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు, బిసి డిక్లరేషన్‌లో పేర్కొన్న హామీలు, ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ అంశం, మహాలక్ష్మి స్కీం కింద ప్రతి మహిళకు రూ.2500 ఇస్తామన్న హామీ, దివ్యాంగులకు రూ.6000కు పెంచుతామన్న పెన్షన్ ఇలా అనేక అంశాలపై కేబినెట్ సమావేశంలో ఎందుకు చర్చించడం లేదు? అన్నారు. హామీల అమలుకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంలో విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాల కోసం బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని మీరు ప్రకటించి, అసెంబ్లీ సాక్షిగా చట్టం కూడా తీసుకొచ్చిన విషయాన్ని మళ్లీ గుర్తు చేస్తున్నాం. ఈ ఏడాది మార్చి 17న అసెంబ్లీలో ఆమోదం పొందిన తరువాత ఇప్పటివరకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయకుండా జాప్యం చేయడమేంటి? ఇప్పుడు మరోసారి 42శాతం బిసి రిజర్వేషన్ అంశం క్యాబినెట్ సమావేశంలో చర్చకు వస్తోందన్న సమాచారం వచ్చిందన్నారు.ఎట్టి పరిస్థితిలోనైనా కాంగ్రెస్ పార్టీ బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేయాలని బిజెపి డిమాండ్ చేస్తుందన్నారు.

# కేరళలో ఎల్డీఎఫ్‌కు షాక్.. యుడిఎఫ్ అభ్యర్థి గెలుపు



## అమృత్‌సర్, గుజరాత్ విసావదర్ స్థానాల్లో ఆప్ గెలుపు

### కాళిగంజ్ స్థానం నిలుపుకున్న టిఎంసి

**న్యూఢిల్లీ, జూన్ 23:** నాలుగురాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికలు మిశ్రమ ఫలితాలిచ్చాయి. ప్రధానిమోడీ, హోంమంత్రి అమిత్‌షాల స్వరాష్ట్రం అయిన గుజరాత్‌లో ఆప్ పాగా వేసింది. అలాగే కేరళలోని నీలంబూర్ స్థానంలో పినరయి విజయన్ కూటమికి కాంగ్రెస్ కూటమి యుడిఎఫ్ చెక్‌పెట్టింది. ఇక పశ్చిమబెంగాల్‌లోని కాలిగంజ్ అసెంబ్లీ స్థానాన్ని ఎప్పటిలాగే తృణమూల్ కాంగ్రెస్ కైవసంచేసుకోగా గుజరాత్‌లోని విసావదర్ స్థానాన్ని ఆప్ రాష్ట్ర చీఫ్ గోపాల్ ఇటాలియా చేజిక్కించుకున్నారు. మరోస్థానం కాడిలో బిజెపి అభ్యర్థి రాజేంద్ర చావ్డా విజేతగా నిలిచారు. ఆమ్ ఆద్మీపార్టీకి మాజీ గుజరాత్ చీఫ్‌గా పనిచేసిన ఇటాలియా తన సమీప ప్రత్యర్థి బిజెపి అభ్యర్థి కిరీట్ పటేల్‌ను 17,554 ఓట్ల తేడాతో ఓడించారు. ఇటాలియాకు 75,942 ఓట్లు లభిస్తే పటేల్ 58,388 ఓట్లు సాధించారు. 18 ఏళ్లతర్వాత బిజెపి మళ్లీ వసావదర్‌లో గెలుస్తోందని బిజెపి ధీమాతో ఉన్నా ఆప్ మాజీ చీఫ్ చేజిక్కించు కోవడంతో ఆప్ కేడర్ లో హుషారు పెరిగింది. ఇక ఎస్సీ రిజర్వు కాడి స్థానంలో బిజెపి అభ్యర్థి రాజేంద్రచావ్‌డా 35వేల ఓట్ల తేడాతో గెలిచారు. కాంగ్రెస్ అభ్యర్థిరమేష్‌చావ్‌డాపై చెప్పుకోదగిన ఆధిక్యంతో గెలిచారు. రాజేంద్ర చావ్‌డాకు 99,742ఓట్లులభిస్తే కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే రమేష్ చావ్‌డాకు 60,290 ఓట్లు మాత్రమే లభించాయి. ఇక పంజాబ్‌లోని లూధియానా వెస్ట్‌సీటులో ఆప్‌అభ్యర్థి సంజీవ్ అరోరా గెలిచారు. కాంగ్రెస్‌కు చెందిన భరత్‌భూషణ్ అసును 10,637 ఓట్లతేడాతో ఓడించారు. బిజెపి జీవన్‌గుప్తా మూడోస్థానంలో నిలిచారు. ఆ తర్వాత శిరోమని అకాలిదళ్ పరుప్కర్‌సింగ్ ఘుమన్ నాలుగో స్థానంలో నిలిచారు. ఆప్ ఎమ్మెల్యే గురుప్రీత్ బస్సా గోగీ మరణంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించారు. ఇక పశ్చిమబెంగాల్‌లోని కాలిగంజ్‌స్థానంలో టిఎంసి అభ్యర్థి ఆలీఫా అహ్మద్ గెలిచారు. రికార్డుస్థాయి మెజార్టీని పొందారు, 50,049 ఓట్లు ఆధిక్యంతో సమీప బిజెపి అభ్యర్థి ఆశిష్‌ఘోష్‌పై ఆమె ఘనవిజయం సాధించారు. ఆలిఫాకు 1,02,759 ఓట్లురాగా ఆశిష్‌ఘోష్‌కు 52,710 ఓట్లుమాత్రమే లభించాయి. వామపక్షం మద్దతిచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి కబిల్ ఉద్దీన్‌షేక్‌కు మూడోస్థానంలో 28,348 ఓట్లుమాత్రమే లభించాయి. గత ఫిబ్రవరిలో ఇక్కడి ఎమ్మెల్యే నసీరుద్దీన్ అహ్మద్ మృతికారణంగా ఉప ఎన్నిక నిర్వహించారు. ఇక కేరళలోని నీలంబూర్‌స్థానంలో యుడిఎఫ్ అభ్యర్థి గెలిచారు. కాంగ్రెస్ వృద్ధనేత అర్యదన్ ముహమ్మద్ కుమారుడు అర్యదన్ షౌకత్ ఈ స్థానంలో గెలిచి పినరయి విజయన్ ఎల్డీఎఫ్‌కు షాక్ ఇచ్చారు. సిపిఎంకు చెందిన ఎం స్వరాజ్ పై 11,077 ఓట్లతేడాతో గెలిచారు. ఈ విజయం ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి రిఫరెండం వంటిదని చెపుతున్నారు. మాజీ ఎమ్మెల్యేల పివి అన్వర్ రాజీనామాతో ఉప ఎన్నికలు అనివార్యం అయ్యాయి. బిజెపి అభ్యర్థిమోహన్ జార్జి భారీగా వెనుకబడిపోయారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు కేరళలో కాంగ్రెస్, యుడిఎఫ్ కూటమికి మంచి ఫలితాలు వస్తాయని ఈ ఎన్నికలు నిరూపించిందని కాంగ్రెస్ శ్రేణులు సంతోషం వ్యక్తంచేస్తున్నాయి.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కొనసాగుతున్న

# బాధితుల వాంగ్మూలం నమోదు

## సిట్ ఎదుట హాజరైన కాంగ్రెస్ నేత సుధీర్‌రెడ్డి

### బిజెపి ఎంపి ఈటలకు పోలీసుల నోటీసులు

### నేడు విచారణకు హాజరు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితుల వాంగ్మూలం నమోదు కొనసాగుతోంది. జూబ్లీహిల్స్ ఎసి పి కార్యాలయంలో జరుగుతున్న వాంగ్మూలం నమోదుకు సోమవారం నాడు వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత బిళ్ల సుధీర్ రెడ్డి నాటి ఫోన్ ట్యాపింగ్‌పై వాంగ్మూలం ఇచ్చారు. అప్పట్లో ఫోన్ ట్యాపింగ్ వల్ల తాను ఎదుర్కొన్న కష్టాలను ఆయన పోలీసులకు వివరించారు. తనతో పాటు అప్పట్లో చాలా మంది కాం గ్రెస్ నేతలు, ఇతరుల ఫోన్‌లను ట్యాపింగ్‌కు గురయ్యిందని ఆయన తెలిపారు. ఈ కేసుపై సమగ్రంగా విచారణ జరపాలని, దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన సిట్ అధికా రులను కోరారు. ఈ కేసులో వున్న వారు ఎంతటి వారైనా వదల కూడదని ఆయన కోరారు. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో బిజెపి ఎం పి ఈటల రాజేందర్‌కు సిట్ అధికారులు సోమవారం నాడు నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో మంగళవారం నాడు తమ ఎదుట విచారణకు హాజరై వాంగూ ్మలం ఇవ్వాలని వారు కోరారు. ఇంకోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి సిఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ నేత సింగిరె డ్డి హరివర్ధన్ రెడ్డి ఫోన్‌లు సైతం అప్పట్లో ట్యాప్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించారు. దీనిపై వారికి సిట్ అధికారులు నోటీసులు ఇచ్చి వాంగ్మూలం నమో దు చేయాలని నిర్ణయించారు.

# మహారాష్ట్రలో దారుణం.. నీట్‌లో ర్యాంకు రాలేదని కూతురును కొట్టి చంపిన తండ్రి

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** వైద్యవిద్య ప్రవేశపరీక్ష నీట్‌లో తక్కువ మార్కులు తెచ్చుకుందనే కోపంతో ఓ కిరాతక తండ్రి తన కుమార్తెను దుడ్డు కర్రతో చావబాది దారుణంగా హత్య చేసిన ఘటన మమారాష్ట్రలో వెలుగు చూసింది. వివరాలు ఇలావున్నాయి. సాంగ్లీ జిల్లాకు చెందిన ధోండీరాం ఖోసలేలో ఒక పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. ధోండీరాం కూతురు ఇటీవల నీట్ పరీక్ష రాయగా ర్యాంకు రాలేదు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ధోండీరాం ఆదివారం కూతురును దుడ్డు కర్రతో చావబాదాడు. ఈ దెబ్బలకు తాళలేక ఆ బాలిక తీవ్రంగా గాయపడి ఇంట్లోనే స్పృహ కోల్పోయింది. అయితే కుమార్తెను ఆసుపత్రికి కూడా తీసుకు వెళ్లకుండా అక్కడే పడవేసిన ధోండీరాం పాఠశాలకు వెళ్లిపోయాడు. కొన్ని గంటల తరువాత అతను ఇంటికి తిరిగివచ్చి చూడగా అచేతనంగా ఉన్న కుమార్తెను ఆసుపత్రికి తీసుకు వెళ్లగా అప్పటికే బాలిక మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ కేసులో ధోండీరాంను పోలీసులు అరెస్టు చేశారు.

# ఎంపి రఘునందన్‌రావుకు బెదరింపు కాల్

## పోలీసు ఉన్నత అధికారులకు ఎంపి ఫిర్యాదు

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 23, ప్రభాతవార్త:** బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావుని చంపేస్తామని పీపుల్స్ వార్ మావోయిస్టుల పేరుతో ఫోన్ బెదిరింపు కాల్ రావడం సోమవారం సంగారెడ్డి జిల్లాలో తీవ్ర చర్చనీయాంశమైంది.. సోమవారం సాయంత్రం లోగా చంపుతామంటూ ఎంపీని హెచ్చరించారు. తాను మధ్యప్రదేశ్‌కి చెందిన మావోయిస్టునని బెదిరింపులకు పాల్పడ్డాట్లు తెలుస్తోంది.సోమవారం మేడ్చల్ జిల్లాలోని దమ్మాయిగూడలో రఘునందన్ రావు పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొన్నారు. ఈ సమయంలోనే రఘునందన్‌రావుకి ఆగంతకుడి నుంచి ఫోన్ వచ్చింది.అయితే ఆ ఫోన్ కాల్‌ని రఘునందన్‌రావు పీఏ ఎత్తాడు. 912143352974 నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చినట్లు గుర్తించారు. వెంటనే రఘునందన్ రావు అప్రమత్తమై తెలంగాణ డీజీపీ జితేందర్‌కి, సంగారెడ్డి ఎస్పీకి, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రఘునందన్ రావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాల్ నెంబర్ ఆధారంగా విచారణ చేస్తున్నారు. ఎక్కడ నుంచి ఈ కాల్ వచ్చిందనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ విషయంపై బీజేపీ అగ్రనేతలు ఎంపీ రఘునందన్‌రావుకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించింది.

# రెరా అప్పిలేట్ అథారిటీ చైర్మన్‌గా జస్టిస్ సంతోష్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 22:** తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ అథారిటీ(రెరా) చైర్మన్‌గా జస్టిస్ అనుగు సంతోష్‌రెడ్డి నియామకం అయ్యారు. ఈ మేరకు రెరా కార్యాలయంలో సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెరా సభ్యులు, అధికారులు ఆయనకు స్వాగతం చెప్పారు. జగిత్యాల జిల్లా జోగినపల్లి గ్రామంలో జన్మించిన అనుగు సంతోష్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే అనుగు నారాయణరెడ్డి కుమారుడు. అనంతపూర్‌లోని



కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో లా డిగ్రీ చదివి,ఉస్మానియాలో ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. 1985లో ఆయన అడ్వకేట్‌గా ఎన్‌రోల్ అయి కరీంనగర్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్‌ను ప్రారంభించారు. ఆయన 1991లో జిల్లా మున్సిఫ్‌గా జ్యుడిసియల్ సర్వీస్‌లో ప్రవేశించారు. తర్వాత సీనియర్ జడ్జిగా, ఆ తర్వాత జిల్లా జడ్జిగా పదోన్నతులు పొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో న్యాయ శాఖ సెక్రటరీగా ఉండి, రాష్ట్ర విభజన అంశాలలో పాల్గొన్నారు. తర్వాత 2014 జూన్ 2 నుంచి తెలంగాణ రాష్ట్రంలో తొలి లా సెక్రటరీగా విధులు నిర్వహించారు. తర్వాత రంగారెడ్డి రంగారెడ్డి జిల్లా అదనపు జడ్జిగా విధులు నిర్వహించారు. తర్వాత ఆయన తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీగా విధులు నిర్వహించారు. 2022 మార్చ్ 24లో ఆయన తెలంగాణ హైకోర్టు జడ్జిగా బాధ్యతలు తీసుకున్నారు. 2023 జూన్ 20న హైకోర్టు జడ్జిగా రిటైర్ అయ్యారు. జ్యూడిషియల్ రంగంలో ఆయనకు అపార అనుభవం ఉన్న దృష్ట్యా ప్రభుత్వం ఆయన్ను రెరా చైర్మన్‌గా నియమించింది.


తెలంగాణ ప్రభుత్వం
మెదక్ మునిసిపాలిటీ కార్యాలయం, మెదక్ జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
1) ఇ-నిట్ నం.లు: E1/MCM/4 నం.ల పెండ్స్/వర్క్స్/SDF/2024 తేది: 24.06.2025
పనుల యొక్క సంఖ్య: (1), బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 24.06.2025 ఉ.10.30 గం. వర్క. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 11.07.2025 సా.05.30 గం. వర్క. ప్రైస్ బిడ్ తెరచు తేది: (ఫైనాన్షియల్ బిడ్ స్టేజ్) 11.07.2025 సా.05.35 గం. వర్క. . గమనిక: టెండర్‌కు సంబంధించిన సవివర సమాచారాన్ని Tender.telangana.gov.in యొక్క వెబ్‌సైట్‌పై పొందవచ్చును. ఏ ఇతర సమాచారానికైనా, కమిషనర్ (లేదా) ఇంజనీర్ మెదక్ మునిసిపాలిటీ ఫోన్ నం: 9154293322, 9154293336, 6303678200 సంప్రదించవచ్చును.
DIPR.No.3984-PP/CL/Advt/1/2025-26, తేది: 23.06.2025 సం/- కమిషనర్, మెదక్ మునిసిపాలిటీ

మితభోజనం వల్ల తిండిపోతు అనేందుకు ఆస్కారం లేకపోవడం, ఆరోగ్యం, ఆయుష్షు, బలం, సుఖం, మంచితనం అనే ఆరు గుణాలు లభిస్తాయి.

-ప్లినీ

# భాషా వైవిధ్యమెందుకు?

భాషా వైవిధ్యాల,వైరుధ్యాల కొలిమి నుంచి బయటపడడానికి అప్పటి ప్రభుత్వాలు భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేసి కాస్త ఊపిరి పీల్చుకున్నాయి. రానురాను స్వభాషల మీద ఎంత మమకారమున్నా పరాయి భాష ఇంగ్లీష్‌ను మరచిపోలేని పరిస్థితి తలెత్తింది. ఇప్పటికీ ఆంగ్ల భాషా వ్యామోహాన్ని వదిలించుకోలేని పరిస్థితి ఉంది. మాతృ భాషలో చదివితే మంచి చదువులు అబ్బుతాయన్న గ్యారంటీ ఏమి ఉండదనే వాదన ఉంది. ఆంగ్ల భాషను బ్రిటిష్ వారు వదిలి వెళ్ళారనే ఒకే ఒక కారణంతో పక్కన పెట్టడానికి వీలు లేదు. కానీ భాషల విషయంలో చెలరేగుతున్న వైరుధ్యాలను, వైవిధ్యాలను పట్టుకుని భాష వైషమ్యాలు పెరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనదే. స్థానిక భాషతో ఉపాధి పొందలేనపుడు ఉపాధినిచ్చే భాషా విజ్ఞానం సాధించడం పెద్ద తప్పేమీ కాదు. కూటి కోసం కోటి విద్యలని చిన్నారి పొన్నారి చిరుత కూకటి నాడే నేర్చుకున్న సూక్తి. ఇంగ్లిష్ మాట్లాడేవాళ్లు త్వరలోనే సిగ్గుపడతారని, దేశంలో అలాంటి సమాజం ఏర్పడేరోజు దగ్గరలోనే ఉందని అంటూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. భారతీయ భాషలే దేశ గుర్తింపునకు కేంద్రంగా ఉంటాయని, అందుకే ఇంగ్లిష్ కంటే వాటికే ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించడం మంచిదే.కానీ ఎన్నో దేశాల వాడుక భాషను వీడి వారికి తెలియని భాషలో వ్యవహారాన్ని నడిపించగలిగే పరిస్థితులు కనపడవు. ఢిల్లీలో ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న అమిత్ షా మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలనలోని బానిసత్వానికి చిహ్నంగా ఆంగ్లభాష మనకెందుకు!? అనేవిధంగా మాట్లాడారు. భారతీయ భాషలు మన సంస్కృతికి రత్నాల వంటివి. మన భాషలు మనకు లేకుండా మనం నిజమైన భారతీయులుగా ఎలా ఉండగలం అనే ధోరణిలోసాగింది. భారతదేశ భాషా వారసత్వాన్ని పునరుద్ధరించేందుకుకృషి జరగాల్సిన తరుణంలో ఆంగ్లమీడియా, తెలుగు మీడియాలతో మనమెలా మనుగడ సాధించగలమో విశ్లేషించుకోవాల్సిన అవసరముంది. మనదేశం, సంస్కృతి, మతానికి ఏ విదేశీ భాష కూడా సరితూగదు. అసంపూర్ణమైన విదేశీ భాషలతో సంపూర్ణమైన భారత దేశం అనే భావనను ఊహించలేం. ఇలాంటి ఆలోచనఎంత సంక్లిష్టమైందో తెలుసు. కానీ భారతీయ సమాజం విజయం సాధిస్తుందని, మరోసారి ఆత్మవిశ్వాసంతో, మనం దేశాన్ని మన భాషలతో నడిపించగలం, ప్రపంచానికి నాయకత్వం వహించగలమని నమ్ముతున్నానని షా అన్నారు. నూతన విద్యా విధానం ముసుగులో త్రిభాష సూత్రం ద్వారా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం హిందీని బలవంతంగా రుద్దేందుకు ప్రయత్ని స్తున్నదని పలు రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అమిత్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకు న్నాయి. ఇంగ్లీష్ వద్దనడం పేదలను చులకన చేయడమే నని వారిని ఉన్నత విద్యకు దూరం చేసే కుట్రయని ఒక వారధిలాంటి భాషగా ఉన్నా ఆంగ్లాన్ని వదిలిపెట్టమనడం తగదని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఇంగ్లీష్ అనేది డ్యామ్ కాదు, ఒక బ్రిడ్జి. ఇంగ్లీష్ అంటే సిగ్గు కాదు, పవర్, ఇంగ్లీషు అనేది ఒక చైన్‌కాదు, చైన్లను బ్రేక్ చేసే పరికరం. ఇండియాలోని పేద పిల్లలు ఇంగ్లీష్ చదువుకోవడం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఇష్టం లేదు. వాళ్లను ప్రశ్నించేవారు ఉండకూడదని వారుకోరుకుంటున్నారు. తమతో సమానంగా ఎదగడం కూడావారికి ఇష్టంలేదని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాహుల్ పేర్కొన్నారు.ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రతిరోజూ ఇంగ్లీష్ మాట్లాడవద్దని, హిందీలో మాట్లాడమని చెబుతుంటారని,అయితే ఆర్ఎస్ఎస్, బీజేపీలోని పిల్లలు మాత్రం ఇంగ్లీషు విద్యకు వెళ్తుంటారని, దీనివెనుక కారణమేమిటని రాహుల్ ప్రశ్నించారు. ఎందుకంటే పేద పిల్లలు బోర్డ్ రూములోకి ఎంటర్ కారాదని, అధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలు రాకూడదని వారు కోరుకుంటున్నారని అన్నారు. వాళ్ల ఇంగ్లీషు స్కూళ్లకు వెళ్లి కాంటాక్టులు పెంచుకుంటారని, పేదపిల్లలకు మాత్రం తలుపులు మూసేస్తారని అక్షేపణ తెలి పారు.సాధికారతకు మాతృభాషతోపాటు ఇంగ్లీష్ చాలా అవసరమని, ఇంగ్లీష్ విద్య విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని, ఉపాధిని కల్పిస్తుందని రాహుల్ అన్నారు. దేశంలోని ప్రతిభాష ఆత్మవంటిదని,సంస్కృతి, నాలెడ్జికి ప్రతీక అని అన్నారు. భాషాభివృద్ధి జరగాలని, అదే సమయంలో ప్రతి ఒక్కపిల్లవాడికి ఇంగ్లీష్ బోధించాలని అన్నారు. అప్పుడే ప్రపంచంతో భారత్ పోటీ పడగలుగుతుందని, ప్రతి ఒక్క పిల్లవాడు సమానావకాశాలు పొందగలడని రాహుల్ స్పష్టం చేశారు. తన ఎక్స్ అకౌంట్లో హిందీ భాషలో రాహుల్ గాంధీ ఈ పోస్టు చేశారు. ఇంతకు నాలుగు రోజులకు ముందే ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ జాతీయవిద్యావిధానం గురించి మాట్లాడుతూ హిందీ ప్రస్తావన తెచ్చారు.ఇలా భాషల విషయంలో అన్ని రాష్ట్రాలతోనూ సంప్రదించి సమగ్ర విద్యావిధానాన్ని భాషా ఔన్నత్యాలను గుర్తించాలి. జాతీయ విద్యావిధానం లోని త్రిభాషా సూత్రంతో దేశవ్యాప్త విద్యార్థులు మూడుభాషలు నేర్చుకోవాలిని కేంద్రం అభిభాషణ.దాంతోనే తమిళరాష్ట్ర పాలకులు స్టాలిన్ ఈరకం విద్యావిధానంపై ఆగ్రహం వెలిబుచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో హిందీ మూడో భాషగా ఉంచాలని కుదరదని ఢంకా బజాయించి చెప్పారు. రాష్ట్రపరంగా తమిళ ప్రాముఖ్యతను తప్పించడం సాధ్యపడదని తేల్చిచెప్పారు. భాషలన్నింటంలోనూ ఏ భాష మేలు అంటే ఏ భాషకు ఆభాషే గొప్పది. మాతృభాష మరీ గొప్పది. ఎన్నో దేశాలు అనుసరించే ఆంగ్లమూ అనుసరణీయమే! దేన్నీ కాదనలేం.

మనకున్న దానితో సంతృప్తిపడడం సబబే అయినా మన స్వభావాన్ని మాత్రం సంస్కరించుకోవాలి.



మహాత్మాగాంధీ

విధి అంటూ ఎవరూ సృష్టించలేదు. మనకు మనమే సృష్టించుకున్నాం. మన మాట, ఆలోచన, ప్రవర్తన వల్ల మన జీవితానికి మనమే బాధ్యులం.



డబ్ల్యు.ఎమర్సన్

## ప్రజావాక్కు



### ముదురుతున్న బనకచర్ల వివాదం

ఈ మధ్యకాలంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య బనకచర్ల ప్రాజెక్టు వివాదం తీవ్రమవుతూ, ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. గోదావరి నదిలో వృథాగా సముద్రంలో కలిసిపోతున్న నీటిని వినియోగించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించింది. అయితే ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధమని తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. విభజన చట్టాన్ని, జల వివాదాల ట్రిబ్యునల్ నిబంధనలను ఉల్లంఘించేలా ఏపీ ప్రభుత్వం వ్యవ హరిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ రైతులకు నష్టం కలుగుతుందని, రాష్ట్ర హక్కులను కాపాడేందుకు అన్ని చట్టపరమైన మార్గాలను అనుసరిస్తామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రోడ్డు ప్రమాదాలకు హెడ్‌లైట్లే కారణం

ఈ మధ్యకాలంలో దేశంలో నిత్యం ఎక్కడో ఒక చోట వాహన ప్రమాదాలు సంభవిస్తూ ఏటా లక్షలాది మంది చనిపోవటం, గాయపడటం జరుగుతుంది. ఈ ప్రమాదాలు ముఖ్యంగా రాత్రివేళల్లో అమిత వేగంతోవెళ్లే వాహనాలు, కళ్లు మిరుమిట్లు గొలిపే వాటి హైటెక్ లైటింగ్, కొందరు మద్యం సేవించి వాహనాలు నడపటం వంటివి. ఒకప్పుడు స్వదేశీ వంటి కార్లు,బస్సులు,ద్విచక్ర వాహనాల హెడ్‌లైట్లపై సగం నల్ల రంగు వేయడటమో నల్ల స్టిక్కర్లు అంటించటమో జరిగేది. ఫలితంగా కాంతి అన్ని వైపులా ప్రసరించకుండా ఎదుటి వాహనాలు స్పష్టంగా కనిపించేవి. కనుక ఇకనైనా వాహన తయారీ కంపెనీలు ఎదుటి వాహనాలకు ఇబ్బంది లేని విధంగా లైటింగ్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించాలి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### మత ఛాందసవాదం

యుద్ధం ఆధిపత్యం చాటడానికి మాత్రమే. పర్షియన్ చరిత్ర నాగరికత ఎంత మహోన్నత లౌకిక విలువలు కలిగిన నాగరికత.ఇప్పుడు మత ఛాందసవాదంలోకి ఆధిపత్య దేశాల చక్రబంధంలోకి జారిపోవడం ఒక రకంగా విచిత్రం అయితే మతం ఆధారంగా నాయకులు పుట్టుకు రావడం కూడా ఒక రకంగా దీనికి కారణం కావొచ్చు.

- భారత అవినాష్, జనగామ

### అగ్నికి ఆజ్యం పోస్తున్న దేశాలు

భారత్ ప్రధాని మోడి అద్భుతమైన నాయకుడు, కాని తనకు పాకిస్థాన్ అంటే వల్లమాలిన ప్రేమ అంటూ అమెరికన్ ట్రంప్ శత్రుదేశాలుగా మారిన ఇండోపాక్‌ల మీద కురిపిస్తున్న అభిమానం. పాక్ మిలిటరీ చీఫ్ అయిన మునీర్‌ను ట్రంప్ తన శ్వేత సౌధానికి పిలిచి అతనితో భోజనం చేసాడు. అమెరికాకు ఇరాన్‌తో పొరపొచ్చాలులేకపోయినా ఇజ్రాయిల్‌కు ఆయుధ సామాగ్రి, ఆర్థిక సహాయం చేసి ఇరాన్ మీద యుద్ధానికి మరింత పుష్టిని చేకూర్చడానికిట్రంప్ ఉవ్విళ్ళురుతున్నాడు.ఏయుద్ధాలను ఆపలేని అగ్రరాజ్యాధినేతకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలా? పైగా ఇండోపాక్ యుద్ధాన్ని తానే ఆపానాని పదేపదే గ్లోబెల్ ప్రచారం చేస్తే ప్రపంచం నమ్మేస్తుందా?కాల్పుల విరమణ కోరింది మేమేనని పాక్ ఉపప్రధాని కూడా ఒప్పుకున్నాడు. అందరూ ఇలా అగ్నికి ఆజ్యంపోసేవాళ్లే కాని శాంతి సామరస్యాలకు బాటలు వేసేవారెవరూ కనుచూపు మేరలో కానరావడం లేదు. ఐక్యరాజ్య సమితి ఉన్నా ఒకటే లేక పోయినా ఒకటే.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఒక్కొక్క పార్టీకి ఒక్కో ఛానెల్

ఒక దశాబ్దం నుండి మన తెలుగు చానెల్లో ఒక్క దూరదర్శన్ ఛానల్‌లోతప్పా మిగతా ప్రైవేట్‌చానెల్స్ ఎలా మారిపోయాయంటే ఏదో ఒక రాజకీయ పార్టినో ఏదో ఒక సామాజిక కులాన్నో మోస్తోన్న వ్యవస్థలుగా మారిపోయాయి. వాళ్లవాళ్ల మీటింగులు, వారి వారి చెత్తడప్పులు కొట్టుకోవడం చేస్తే ఒక సందర్భంలో కొంతలోనైనా మంచిది. విరుద్ధంగా పగ వారిని తిట్టించడం ఎక్కువై పోయింది. డిబేట్లు అయితే తిట్టు కోవడమే పరామవధి. వక్తలు సహనం కోల్పోయి కొట్టుకోవడం వరకూ వెళ్తే మరి వారినిఫాలో అయ్యే జనాల పరిస్థితి రోడ్ల మీద చూస్తూనే ఉన్నాము. ప్రభుత్వం అంటే పోలీస్ శాఖ, అంటే భయం లేని జనాలు రోడ్ల మీద సినిమాలు చూపిస్తున్నారు.

- గార్లపాటి సీతారామయ్య,హైదరాబాద్

### చదువు ఖరీదైన వస్తువు

అన్ని ప్రయివేటు విద్యా సంస్థలు కేజి నుండి పేజి వరకు సంవత్సరం ఫీజులను ఇబ్బడిముబ్బడిగా పెంచేస్తున్నారు. చదువులు రానురాను అధిక ఖరీదైన వస్తువుగా మారిపోతున్నది. ఇంజినీరింగ్ ఫీజు సాలీనా రెండు నుంచి రెండున్నర లక్షల వరకూ ఉంది.ప్రభుత్వం ఫీజులను తగ్గించదు. తగ్గిస్తే ప్రొఫెసర్లకు ఇతర స్టాఫ్‌కు జీతాలు యివ్వలేమని యాజమాన్యాల ఆవేదన.

- ఎన్.రామారావు, నల్గొండ

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వడ్డీ వ్యాపారుల ఆగడాలను నియంత్రించాలి!

*సాంప్రదాయక అటవీ హక్కుల చట్టం 2006ప్రకారం తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు అటవీ హక్కు పత్రాల పంపిణీ చేసింది. ఆదివాసీ ప్రాంతాల్లో వారసత్వంగా సాగు చేసుకుంటున్న పోడుభూములకు హక్కుపత్రాలు అందడంలేదు. ఇచ్చిన పత్రాలకు రుణాలు ఇవ్వడం లేదు. మిషన్ కాకతీయ వల్ల సాగు విస్తీర్ణం 51శాతం పెరిగింది. పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అంది స్తున్న రైతుబంధు సాయంవల్ల కొంత మేలు జరుగుతోంది. అకాల వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అరికట్టేందుకు రైతులకు తగిన నష్టపరిహారం, రుణమాఫీ అమలు చేయాలి. త్వరలో రైతులందరికీ పెట్టుబడిగా ఇవ్వబోయే ముందస్తు సాయం, రుణాలు సకాలంలో అందించి ఏజెన్సీ ప్రాంత అన్నదాతలను ఆదుకోవాలి. ప్రభుత్వం శూన్య ఆధారిత వడ్డీతో రుణాలు అమలు చేస్తే ఏజెన్సీ రైతులకు మేలు జరుగుతుంది. అలాగే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారి స్తున్న వడ్డీ వ్యాపారస్తులను కఠినంగా శిక్షి ంచాలి.*



గుమ్మడి లక్ష్మీనారాయణ

ఆరుగాలం కష్టించిన రైతులు ప్రత్యేకించి సన్న, చిన్నకారు రైతులకు పండించిన పంటకు గిట్టుబాట ధర లేకపోగా సరైన ఆదరణ లభించడం లేదనేది సుస్పష్టమైన విషయం.పంట కోసం తెచ్చిన అప్పుల కిచ్చేందుకు రైతులు నరకయాతన పడుతున్నారు. వడ్డీకి వడ్డీ వసూలు చేసుకుంటూ దళారులు మోసానికి పాల్పడుతుండటంతో అన్నదాతల కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ఏడాదికి ఒకే పంట పండించే ఏజెన్సీ ప్రాంతాలలో అప్పు చేయని రైతు కుటుంబమే కన్పించదు. పంట పండితేనే అప్పు తీరేది.. అన్నట్లు మరోపక్క వరుణుడు కరుణించకపోతే దిగుబడి అనుమానమే. దీంతో ఆదివాసీ రైతులు దళారుల వలలో చిక్కుకొని మోసపోతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. వారు నిత్యకూలీలుగా మారడం సర్వసాధారణం అయిపోయింది. ప్రభుత్వపరంగా బ్యాంకులిచ్చే రుణాలు రైతులకు భరోసా కల్పించడం లేదు. వానాకాలం (ఖరీఫ్ పంటకు) షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షపాతం సగటుగా ఉంటున్నప్పటికీ, పెద్ద చెరువులు, లిఫ్ట్ ఇరిగేషన్, బోర్లు, బావులు లేక మరోపక్క కరెంటు కనికరించక ఏడాదికి ఒకే పంటతో సరిపుచ్చుకుంటున్నారు. అనేక ఏజెన్సీప్రాంతాల్లో యాసంగి అనేదే కన్పించదు. మహబూబాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో కాకతీయులు నిర్మించిన పాకాల సరస్సు, బయ్యారం పెద్ద చెరువు ఉన్నాయి. ఏజెన్సీ అడవుల నుండి పాకాలలో చేరే వాననీరు ఆయకట్టు కింద 28,512 ఎకరాల సాగుకు, అదీ గిరిజనేతర రైతులకే తోడ్పడుతుంది తప్ప ఒక్క ఆదివాసీ రైతుకు ఉపయోగపడటం లేదు. ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వడ్డీ వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుండి ఏజెన్సీ ఏరియాకి వస్తుంటారు. స్థానిక వ్యాపారులతో పాటు వీరు కూడా విత్తనాలు, పెట్టుబడి ఇస్తామంటూ మాయమాటలు చెబుతారు. బ్యాంకు రుణం దొరకని రైతులు తప్పనిసరి పరిస్థితిలో వీరి నుండి విత్తనాలు, ఎరువులు, అప్పు తీసుకుంటారు. పంట చేతికొచ్చే వరకు అంతా వడ్డీ వ్యాపారి కనుసన్నలలోనే సాగు పనులు నడుస్తాయి. వ్యాపారులు 10 నుంచి 15 శాతం వడ్డీ వసూలు చేస్తారు. అమ్మకాలు సైతం వారి చేతులలో ఉండాల్సిందే. దళారులను వెంట పెట్టుకొని కొందరు తక్కువ ధరకే రైతుల పంటను కల్లాల వద్దే దౌర్జన్యంగా కాంటాలు పెట్టి కొనుగోలు చేయించి తమ పైకం తీసుకుంటారు. ఒకవేళ అప్పు చెల్లించే స్తోమత లేని రైతులు నుంచి వారి కాడెడ్లను సైతం కమేళాలకు తరలించడం, వాహనాలను, వస్తువులను స్వాధీనపర్చుకోవడం ఆనవాయితీగా మారింది. రైతులు తమవద్ద రుణాలు తీసుకోవాలనే షరతు విధించి, సుమారు 20శాతం పంట డబ్బులను బయానా (అడ్వాన్స్)గా పొందడమే గాక, వాటికి వడ్డీ చెల్లించకపోవడం కొసమెరుపు మోసం. ఇలా తిండి గింజల కోసం ఆరుగాలం కష్టించే రైతులు ప్రత్యామ్నాయంగా పత్తి తదితర వాణిజ్య పంటలు పండించినా వారి ఆశలు నెరవేరకపోగా ఆత్మహత్యలే శరణ్యమవుతున్నాయి. రాష్ట్రంలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ ప్రాంతాల ఆదివాసీ రైతులకు చాలా మందికి అటవీ హక్కు పత్రాలు ఇవ్వకపోవడంతో బ్యాంకు రుణాలు అందటంలేదు. 2016లో గిట్టుబాటు ధర లభించని ఒక కుటుంబం (ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని కుంటగూడ గ్రామం) వడ్డీ వ్యాపారికి రూ.60 వేల విలువైన ఎడ్లను అమ్మివేసి, తమ పిల్లలను చదువు మాన్పించి, కూలి పనులకు కుదిరించింది. వడ్డీ వ్యాపారులకు భయపడి కొందరు రాత్రివేళ ఇళ్ళు చేరడం, లేదా గూడేలు వదిలి పోవడం జరుగుతోంది. ఇక రోజువారీ గిరిగిరి వ్యాపారం అడ్డూ అదుపూ లేదు. కొందరు వడ్డీవ్యాపారులు గిరిజనులను నమ్మించి 5 నుంచి 10 శాతం వడ్డీతో అప్పులిచ్చి నెలనెలా బెదిరించి వసూలు చేస్తున్నారు. చక్ర వడ్డీలు వేస్తున్నారు. రుణదారుని నిరూపణ కోసం బ్యాంకు చెక్కులు, ఏటిఎం కార్డులు,బంగారు ఆభరణాలు, ఫిక్స్ సేవింగ్ బాండ్స్ తీసుకొని దగ్గర పెట్టుకుంటున్నారు. ఏజెన్సీలో ఉద్యోగస్తులకు గంట గంటకి లెక్కించి ఇస్తున్నారు. ఉద్యోగస్తులకు జీతం ఆలస్యమైతే చక్రవడ్డీ లెక్కగడుతున్నారు. నెల మొదటి తేదీన జీతం రాగానే రుణదారునికి ఈఎంఐ పోగా మిగిలినవి ఇస్తూ ఏ.టి.ఎం కార్డు మాత్రం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో ఒక వడ్డీ వ్యాపారస్తుడు ఇద్దరి వద్ద షూరిటీ బాండ్ పేపర్స్ తీసుకొని 5లక్షలు అప్పు ఇచ్చాడు. అప్పు తిరిగి కట్టినా బాండ్ పేపర్లు ఇవ్వకుండా అధిక వడ్డీ కోసం డిమాండ్ చేయడంతో బాధితుల ఫిర్యాదు మేరకు రిమాండ్‌కి పంపిన సంఘటన ఇటీవల జరిగింది.



గిరిజనుల అమాయకత్వాన్ని, నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని, వడ్డీ వ్యాపారస్థులు చేస్తున్న మోసాలు అరికట్టేందుకు ప్రభుత్వం ఏజెన్సీలో వడ్డీ వ్యాపార నిబంధన చట్టం 1960ను రూపొందించింది. దీని ప్రకారం నాము, సిరి నాము (నాము అంటే బస్తాకు రెండు బస్తాలు, సిరి నాము అంటే బస్తాకు బస్తన్నర) పేరుతో పంటల మీద వడ్డీకి అప్పులు, బంగారు ఆభరణాలు, వస్తువులు తదితర తాకట్టు పెట్టుకుని అప్పులు ఇవ్వడం నిషేధించబడింది. ఈ చట్టం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 5,948 షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతాలన్నింటికీ వర్తిస్తుంది. లైసెన్సు పొందకుండా రుణాలు ఇవ్వరాదు. అనుమతి లేకుండా ఏజెన్సీలో వ్యాపారం చేస్తే ఏడాది జైలుశిక్ష లేదా రూ.1000 వరకు జరిమానా లేదా రెండూ విధిస్తారు. రుణగ్రహీతల నుండి వడ్డీ వసూలు చేసే సమయంలో వారిని నిర్బంధాన్ని గురిచేసినా, బెదిరించినా లేదా ఆస్తులకు ఆటంకం కలిగించినా శిక్ష, జరిమానా లేదా రెండూఉంటాయి. నిబంధనలకు ఇచ్చిన వారు కోర్టుకు వెళ్లి తిరిగి వసూలు చేసుకునేందుకు వీలుండదు. లైసెన్స్ పొంది రుణాలు ఇచ్చేవారు ఖచ్చితంగా రాతపూర్వక ఒప్పందం చేసుకోవాలి.సాక్షుల సంతకాలు ఉండాలి.మొదటి సాక్షిగా సర్పంచ్ సంతకం తప్పనిసరి. లేకవారి కేసును కోర్టులు విచారణకు స్వీకరించవు. వ్యాపారులు రుణ వివరాలతో కూడిన రిజిస్టరు నిర్వహించాలి. కానీఇవేవీ సక్రమంగా అమలు కావటం లేదు. ఏజెన్సీలోని పేద గిరిజన రైతులకు సకాలంలో బ్యాంకు రుణాలు అందకపోవడంతోనే వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగడం తప్పా గత్యంతరం లేదు. దీంతో దళారుల ప్రవేశం కూడా కాకతాళీయంగా మారింది. దీనికి తోడు అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారులపై అధికారుల నియంత్రణ చర్యలు లేవు. సాంప్రదాయక అటవీ హక్కుల చట్టం 2006ప్రకారం తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు అటవీ హక్కు పత్రాల పంపిణీ చేసింది. ఆదివాసీ ప్రాంతాల్లో వారసత్వంగా సాగుచేసుకుంటున్న పోడుభూములకు హక్కుపత్రాలు అందడంలేదు. ఇచ్చిన పత్రాలకు రుణాలు ఇవ్వడం లేదు. మిషన్ కాకతీయ వల్ల సాగు విస్తీర్ణం 51శాతం పెరిగింది. పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు సాయంవల్ల కొంత మేలు జరుగుతోంది. అకాల వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అరికట్టేందుకు రైతులకు తగిన నష్టపరిహారం, రుణమాఫీ అమలు చేయాలి. త్వరలో రైతులందరికీ పెట్టుబడిగా ఇవ్వబోయే ముందస్తు సాయం, రుణాలు సకాలంలో అందించి ఏజెన్సీ ప్రాంత అన్నదాతలను ఆదుకోవాలి. ప్రభుత్వం శూన్య ఆధారిత వడ్డీతో రుణాలు అమలు చేస్తే ఏజెన్సీ రైతులకు మేలు జరుగుతుంది. అలాగే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారిస్తున్న వడ్డీ వ్యాపారస్తులను కఠినంగా శిక్షించాలి. •

# మెడికల్ టూరిజం హబ్‌గా ఎదుగుతున్న భారత్!



కామిడి సతీష్ రెడ్డి

వైద్య రంగంలో ఎంతో పురోగతి సాధించి ప్రపంచానికే తలమానికంగా నిలుస్తున్నది మన భారత్.నిన్న మొన్నటి వరకు కూడా దేశ రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు ఏదైనా పెద్ద జబ్బు చేస్తే వైద్యం కోసం విదేశాలకు వెళ్లేవారు. కానీ ఇప్పుడు మన దేశం వైద్యరంగంలో ఎంతోపురోగతి సాధించడంతో పాటు, నిపుణులైన డాక్టర్లు అందుబాటులో ఉండటం, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన అధునాతనమైన వైద్య పరికరాలు, సదుపాయాలు, ఇంగ్లీష్ మాట్లాడే స్టాఫ్ మన దగ్గర ఎక్కువగా ఉండటం, పైగా వైద్యానికి తక్కువ ఖర్చు అవుతుండటం వంటి ఇత్యాది కారణాలతో ఇప్పుడు మన దేశానికి వైద్యులు సైతం వైద్యం చేయించునేందుకు క్యూ కడుతుండటం ఎంతైన యావత్ మన భారతదేశ ప్రజానీకానికి గర్వకారణమైన విషయం. అలాగే విదేశాల నుంచి వచ్చేవారు ప్రధానంగా తుంటి మార్పిడి, ఎముక మజ్జ మార్పిడి, కంటి శాస్త్రచికిత్సల కోసం ఏటా వేలాది మందికి పైగా విదేశీ రోగులు ముఖ్యంగా మొదటి ప్రాధాన్యతగా వున్న 'హెల్త్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా పిలువబడే చెన్నైకి విచ్చేస్తుండటం, ఆ తర్వాత అత్యున్నత అర్హతలు కలిగిన వైద్య నిపుణులు, వైద్య పరిశోధన బృందాలకు బెంగుళూరు నిలయంగా మారడంతో పాటు అక్కడికి సైతం విదేశీయులు ఆహ్లాదకరమైన వైద్యం కోసం ప్రపంచంలోని ఎక్కడెక్కడ నుంచో ఈ నగరానికి విచ్చేస్తుండటాన్ని బట్టి ఈ రెండు నగరాలు ఎంతగా వైద్య రంగంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయో మనం ఇట్టే ఊహించవచ్చు. తెలుగు ప్రజల ప్రముఖ నగరం హైదరాబాద్ సైతం కీలక స్థానమే. ఎందుకంటే హైదరాబాద్‌కు సులువైన రవాణా సౌకర్యం ఉండటం, అదీగాక అన్ని రకాల అధునాతనమైన వైద్య సదుపాయాలు ఉండటం, వైద్యం అందించడంలో చెయ్యి తిరిగిన, ఆరితేరిన డాక్టర్లు ఉండటం, పైగా విదేశీ విద్యా



ర్థులు, పలు భాషలు మాట్లాడే ఫెసిలిటేటర్స్ కూడా ఎక్కువగా ఈ నగరంలో ఉండటంతో విదేశీయులు వైద్యం కోసం ఈ నగరానికి సైతం రావడానికి మొగ్గు చూపుతున్నారు. ఇంకా చెప్పుకుంటూపోతే కేరళ రాష్ట్రం విషయానికి వస్తే అలెప్పీ 'మెడికల్ టూరిజం హాట్ స్పాట్'గా గుర్తింపు పొందడం, ఆయుర్వేద చికిత్సల కోసం విదేశీ రోగులు ఈ నగరానికి రావడానికి ఆసక్తి చూపుతున్నారు. పైగా ఇక్కడి చికిత్స పచ్చని ప్రకృతి మధ్య రిసార్టు వంటి కాటేజెస్‌లో సాగుతుండటం వారిని ఎంతగానో ఆకట్టుకుంటున్నది. అలాగే తమిళనాడులోని చెన్నై తర్వాత వైద్యానికి ప్రసిద్ధి చెందింది కోయంబత్తూర్, ఇక్కడ వైద్య ఖర్చులు కూడా తక్కువగా ఉండటం, పైగా ఈ నగరంలో అల్లోపతితోపాటు సిద్ధ, ఆయుర్వేద, యునాని, హోమియోపతి, ఈ ఎన్‌టీ, వెల్‌నెస్ వంటి చికిత్సల కోసం విదేశీ రోగులు ఇక్కడకు వస్తున్నారు అంటే ఈ నగరం సైతం వైద్యరంగంలో ఎంతటి ప్రత్యేకతను, గుర్తింపును చాటుకుంటున్నాదో చెప్పవచ్చు. తర్వాత స్థానాల్లో ఉత్తర భారత్‌లోని ఢిల్లీ, ముంబాయి వంటి నగరాలు వున్నాయి. ఏదిఏమైనా భారతదేశంలో మెడికల్ టూరిజంలో మన దేశం వెలుగు వెలుగుతుండటంతో మనదేశంలోని యూనివర్సిటీల్లో చదువుకుంటున్న విదేశీ విద్యార్థులు సైతం దీనివల్ల జీవనోపాధి పొందుతున్నారు. ఎలాగంటే వైద్యం కోసం ఈ దేశానికి వచ్చే విదేశీయులకు వసతి, భోజన సౌకర్యాల నుంచి ఆసుపత్రుల చుట్టూ తిప్పటం, వైద్య పరీక్షలకు వెంట ఉండటం, ఆ విదేశీ పేషెంట్లకు,డాక్టర్లకు మధ్య మధ్యవర్తులుగా వ్యవహరించడం వంటి సేవలను అందిస్తూ దాని ద్వారా వచ్చే డబ్బు విదేశీ విద్యార్థుల ఖర్చులకు ఉపయోగపడటంతో అది వాళ్లకు ఓ గొప్ప ఉపాధి మార్గంగా మారడం గొప్ప పరిణామం. ఏమైనా ఈ మెడికల్ టూరిజం ఎంతో మందికి ఉపాధి నిస్తూ, సంపదను సృష్టిస్తూ, మన భారతదేశ ఆర్థికవ్యవస్థ వృద్ధికి తోడ్పడటమే కాకుండా వైద్యంలో ఉన్నత ప్రమాణాలు సాధించేలా చేస్తూ మన దేశ వైద్య సేవలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం అనేది నిజంగా గొప్ప విశేషం. పైగా ఈ అద్భుతమైన పరిణామం మన భారతదేశ కీర్తి, ప్రతిష్టలను అంతర్జాతీయ స్థాయిలో విశ్వవ్యాప్తం చేస్తుంది. •

# దేశాభివృద్ధిలో దౌత్యవిధానం కీలకం



ఐ.ప్రసాద రావు

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దాదాపు ఆరు దశాబ్దాలుగా భారత్ చూపిన దౌత్యనీతికి ప్రపంచం అంతా ఆసక్తిగా అనుసరించింది. ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధానంతరం ద్విధ్రువ ప్రపంచంగా ప్రపంచ దేశాలు అన్నియు ఆనాడు ఉంటే, అమెరికా కూటమిలో, లేదా రష్యా కూటమిలో చేరడానికి సమాయత్తం అవుతున్న సమయంలో, అప్పుడే స్వాతంత్ర్యం పొందిన దేశాలను, తటస్థంగా ఉన్న దేశాలను ఏకం చేసి పైన పేర్కొన్న ఏ ఒక్క కూటమిలో చేరకుండా 'అలీన దేశాలు కూటమి ( నామ్)' ఏర్పాటు చేసిన ఘనత మనదేశం సాధించిన అద్భుతమైన అత్యున్నత దౌత్యనీతికి నిదర్శనంగా నిలుస్తోంది. అంతేకాకుండా 'సార్క్ దేశాల' కూటమి ఏర్పాటు చేసి ఆసియా దేశాలను ఐక్యవేదిక ద్వారా అనేక అంశాలపై గళం వినిపించింది. మనదేశం పెట్టుబడీదారి దేశాలు, నియంతృత్వ దేశాల పలు విషయాలపై నియంత్రణ సాధించింది. ముఖ్యంగా కాశ్మీర్ విషయంలో మూడోదేశం జోక్యానికి తావు లేకుండా చేసింది. అంతేకాకుండా, బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం విషయంలో కూడా చక్కటి పరిష్కారం చూపింది. అలాగే, భారత్ చైనా యుద్ధ సమయంలో 'పంచశీల' పద్ధతి ద్వారా పరిష్కారం చూపింది. అలాగే మూడు దశాబ్దాల క్రితం శ్రీలంకలో జాతుల మధ్య వైరుధ్యాలు ముఖ్యంగా ప్రభాకరన్ ఆధ్వర్యంలో జరిగిన ఎల్.టి.టి.ఈ పోరాటాన్ని అప్పటి ప్రధాని సరైన మార్గంలో పరిష్కారం చూపారు. తత్ ఫలితంగా తదుపరి తన ప్రాణాలను బలిదానం చేయవలసి వచ్చింది. అలాగే కాశ్మీర్ విషయంలో ఐక్యరాజ్యసమితి వేదికగా, మన దేశం అప్పటి లోక్‌సభ ప్రతిపక్ష నేత అటల్ బిహారీ వాజపేయి ద్వారా ఘాటుగా మన వాయిస్ వినిపించింది. మన ఇరుగు పొరుగు దేశాలతో ఉన్న వివిధ రకాల సమస్యలు మన దౌత్యవిధానం ద్వారా పరిష్కారం చేసుకున్న పరిస్థితి ఉంది. మరి ఇంత ఘనచరిత్ర ఉన్న మన దౌత్య విధానం ఇటీవల కొంచెం మసకబారుతున్న పరిస్థితి కనిపిస్తోంది అని పలువురు భావిస్తున్నారు.ఈ పరిస్థితిని సాధ్యమైనంత త్వరగా చక్కదిద్దేందుకు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా 2014నుంచి కేంద్రంలో ఉన్న ప్రస్తుత ప్రభుత్వం 'అలీన విధానాన్ని' పక్కన పెట్టారు. దీనికితోడు, అమెరికా పక్షాన నిలబడుతున్నట్లు కనపడుతుంది. ముఖ్యంగా గత దశాబ్దాలుగా మనం 'పాలస్తీనా' పక్షాన నిలబడితే, ప్రస్తుతం అమెరికా అండదండలతో గత రెండు సంవత్సరాలుగా పాలస్తీనా గాజాపై మానవత్వం లేకుండా విరుచుకు పడుతున్న ఇజ్రాయెల్‌పై మనం మౌనంగా ఉండటం మన దౌత్య విధానంలో మార్పులు వచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తుంది.'ఇది యుద్ధాల సమయం కాదు అని చెబుతున్నా,' ఎక్కడో స్పష్టత లోపం కనపడుతుంది. అదేవిధంగా, ఇటీవల బంగ్లాదేశ్‌లో అధికారం చేపట్టిన ప్రభుత్వం మనలను దూరం చేసుకుంటూ, చైనాతో స్నేహం కోసం ఆరాటం పడుతుంది. షేక్ హసీనా పదవీకాలంలో అక్కడ ఉన్న పరిస్థితులపై మనకు అవగాహనా లోపంఉన్నట్లు తెలుస్తోంది. అలాగే గతంలో మనతో కలిసి ఉన్న శ్రీలంక కూడా ఇటీవల కాలంలో చైనాతో సంబంధాలు పెంచుకుంటూ పోతూన్నారు. అంటే గతంలో మనద్వారా అనేక విధాలుగా లబ్ధిపొందిన మన ఇరుగుపొరుగు దేశాలు మనకు దూరంగా జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మన దౌత్య విధానంలో (లేదా) దౌత్యనీతిలో ఎక్కడో ఒకచోట 'గ్యాప్' ఏర్పడుతుంది. ఆలోపం విధానాల్లో ఉందా? లేదా రాజకీయ పరిపక్వత లేకుండా ఉన్న రాజకీయ నేతల్లోఉందా? త్వరితగతిన విశ్లేషణ చేసుకోవాలి. పరిష్కారం దిశగా అడుగులు వేయాలి.లేకపోతే వేమన చెప్పినట్లు 'ఇంటిలోని పోరు ఇంతింత కాదయ్యా' అన్నట్లు, మన ఇరుగు పొరుగు దేశాలతో వివిధ రకాల తలపోట్లు తలెత్తుతాయి. మనం చాలా విషయాల్లో అభివృద్ధి చెందుతున్నామని మనం పాలకులు చెబుతున్న మాటల్లో కొంతమేరకు వాస్తవం ఉన్నా, అదే సమయంలో మన చుట్టు పక్కల దేశాలు మనకు ఎందుకు దూరంగా జరుగుతున్నాయి అనే విషయాన్ని విశ్లేషణ చేసుకోవాలి. మనకు అత్యంత మిత్ర దేశం అయిన రష్యా కూడా ఇటీవల పాకిస్థాన్‌తో అనేక వేలకోట్ల రూపాయలతో ఒప్పందం చేసుకున్న సంగతి మరువరాదు.. అలాగే ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్నదాడుల విషయంలో కూడా ఇప్పటి వరకూ మనం నోరు మెదపకుండా ఉండటం కూడా సబబుగా లేదు అని చాలామంది రాజనీతిజ్ఞులు అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇతర దేశాలతో మన పొరుగు దేశాలు వారివారి అభివృద్ధికి ఒప్పందాలు చేసుకోవడం తప్పుకాదు కానీ మనకు దూరంగా జరుగుతున్న పరిణామాలు పై మాత్రం మనం దౌత్య పరంగా ఆలోచన చేయవలసి ఆవశ్యకత ఉంది. మనదౌత్య విధానంలో ఉన్న చిన్నచిన్న గ్యాప్‌లను సరిచేసుకోవాలి. అందరితో స్నేహంగా ఉండేటట్లు చూసుకోవాలి. ప్రస్తుతం ఒక్క అమెరికా పక్షాన నిలబడుతున్నట్లు కనపడుతున్న పరిస్థితి నుంచి చాకచక్యంగా వ్యవహరించి బయటపడాలి. ఇప్పటికే కాశ్మీర్ విషయంలో ట్రంప్ పాత్ర లేదు అని చెప్పడం జరిగింది. అయితే ఇంకా అనేక విషయాల్లో స్పష్టతగా మన వైఖరి చెప్పవలసి ఉంది. అలాగే అవసరమైన సందర్భాల్లో మాజీ దౌత్యవేత్తల సలహాలు, ప్రతిపక్ష నాయకుల అభిప్రాయాలను తీసుకోవాలి. భవిష్యత్తులో భారత్ దౌత్యవిధానం, దౌత్యనీతి అందరూ మెచ్చే విధంగా, ఆదర్శంగా ఉండాలని ఆశిద్దాం. 2047 నాటికి మన దేశం 'వికసిత భారత్' గా అవతరించాలంటే అందరితో కలిసిమెలిసి ఉండేవిధంగాదౌత్య విజయం సాధించడం అతి ప్రాముఖ్యమైన విషయం అదే సమయంలో రాజ్యాంగ ఆశయాలను ఆచరణలో పెట్టాలి. •





# లక్ష్యాలకు చేరువలో ఉన్నాం

## ఇరాన్ అణుకేంద్ర్రాలకు తీవ్రనష్టం కలిగించాం

## ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు

**టెల్ అవీవ్,జూన్ 23:** ఇరాన్ విషయంలో తాము నిర్దేశించుకున్న లక్ష్యాలకు అత్యంత చేరువలో ఉన్నామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి, అణు కేంద్రాలకు గణనీయమైన నష్టం కలిగించామని ఆయన తెలిపారు. అయితే, లక్ష్యాలు పూర్తిగా నెరవేరే వరకు తమ సైనిక చర్యలను ఆపేది లేదని స్పష్టం చేశారు. ఇరాన్‌లోని కీలక అణు కేంద్రాలపై అమెరికా దాడులు జరిపిన నేపథ్యంలో నెతన్యాహు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇరాన్‌లోని ఫోర్డో అణు కేంద్రానికి అమెరికా దాడుల వల్ల చాలా తీవ్రమైన నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. ఇరాన్ అణు కార్యక్రమం నుంచి ముప్పును తొలగిస్తున్నామని, వారిని వెనక్కి పంపిస్తున్నామని నెతన్యాహు పేర్కొన్నారు. లక్ష్యాలను సాధించడానికి అవసరమైన దానికంటే ఎక్కువగా మా చర్యలను కొనసాగించము. అలాగని చాలా త్వరగా ముగించము కూడా. లక్ష్యాలు నెరవేరి నప్పుడు, ఆపరేషన్ పూర్తవుతుంది. పోరాటం ఆగిపోతుందని నెతన్యాహు స్పష్టం చేశారు. సుదీర్ఘ పోరులోకి ఇరాన్‌ను లాగడానికి తాము సిద్ధంగా లేమని విలేకరులతో ఆయన అన్నారు. ఇజ్రాయెల్‌ను పూర్తిగా తుడిచిపెట్టాలనేదే ఇరాన్ పాలకుల ఉద్దేశం. ఈ విషయంలో నాకు ఎటువంటి సందేహం లేదు. అందుకే మా ఉనికికి ఉన్న రెండు ప్రధాన ముప్పులను తొలగించడానికి ఈ ఆపరేషన్ చేపట్టాం. ఈ లక్ష్యాలను సాధించే దిశగా మేం అంచెలంచెలుగా ముందుకు సాగుతున్నాం. వాటిని పూర్తి చేయడానికి మేం చాలా, చాలా దగ్గరలో ఉన్నామని నెతన్యాహు వివరించారు. ఇరాన్ వద్ద ఉన్న 400 కిలోల 60 శాతం శుద్ధి చేసిన యురేనియం ఎక్కడుందన్న ప్రశ్నకు, నెతన్యాహు తమ వద్ద ఈ విషయమై ఆసక్తికరమైన నిఘా సమాచారం ఉందని తెలిపారు. కానీ వివరాలు చెప్పడానికి నిరాకరించారు. మేం దాన్ని చాలా నిశితంగా గమనిస్తున్నాం. అది అణు కార్యక్రమంలో ఒక ముఖ్యమైన భాగం అని నేను మీకు చెప్పగలను. దానిపై మా వద్ద ఆసక్తికరమైన సమాచారం ఉంది. దాన్ని మీతో పంచుకోనందుకు నన్ను క్షమించండని ఆయన అన్నారు.

ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ చర్యల సమయం గురించి నెతన్యాహు మాట్లాడుతూ 2024 సెప్టెంబర్‌లో హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రల్లా హత్య తర్వాత టెహ్రాన్ అణు ఆయుధీకరణ వైపు వేగంగా వెళుతుండటంతో ఇజ్రాయెల్ చర్యలు తీసుకోవలసి వచ్చిందని అన్నారు. 2023 అక్టోబర్ 7న దక్షిణ ఇజ్రాయెల్‌లో హమాస్ ఉగ్రవాదుల దాడి తర్వాత లెబనాన్ ఉగ్రవాద సంస్థ హిజ్బుల్లా ఇజ్రాయెల్ ఉత్తర సరిహద్దులోని కమ్యూనిటీలు, సైనిక స్థావరాలపై దాడులు ప్రారంభించింది. దీంతో ఏడాదికి పైగా సాగిన ఘర్షణల్లో దక్షిణ లెబనాన్‌లో కొన్ని నెలల పాటు జరిగిన పూర్తిస్థాయి యుద్ధంలో ఒకప్పుడు టెహ్రాన్ బలమైన పరోక్ష శక్తిగా ఉన్న హిజ్బుల్లా తీవ్రంగా బలహీనపడింది.

నెలకు 300 బాలిస్టిక్ క్షిపణులను నిర్మించాలన్న ఇరాన్ ప్రణాళికలు కూడా నిర్వీర్యం చేసామన్నారు. గత 10 రోజుల్లో ఇస్లామిక్ రిపబ్లిక్‌లోని సగానికి పైగా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ కేంద్రాలను నిర్వీర్యం చేసినట్లు ఆయన చెప్పారు. ఈ ముప్పు తీవ్రత గురించి తాను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తన ఆందోళనలను పంచుకున్నానని, ఆయన దీనిని అర్థం చేసుకున్నారని నెతన్యాహు తెలిపారు. మేం చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆయనకు చెప్పాను. ఆయన దాన్ని చాలా బాగా అర్థం చేసుకున్నారు. కీలక సమయంలో ఆయన సరైన పని చేస్తారని నాకు తెలుసని నెతన్యాహు అన్నారు.



## రష్యా మాట్లాడే వారు 20 లక్షల మంది ఉన్నారు : అధ్యక్షుడు పుతిన్

**మాస్కో,జూన్ 23:** ఇజ్రాయెల్, అమెరికా దాడులతో అల్లాడుతోంది. అయినా మిత్ర దేశం రష్యా ఎందుకు మిన్నకుండిపోతోందని అంతర్జాతీయ మీడియా రష్యా అధ్యక్షుడి ముందు ప్రస్తావించింది. రష్యా స్నేహధర్మంపై సందేహాలు మొదలయ్యాయని చెప్పుకొచ్చారు. సెయింట్ పీటర్స్ బర్గ్ అంతర్జాతీయ ఎకనామిక్ ఫోరంలో ఎదురైన ఈ ప్రశ్నకు పుతిన్ సవివరంగా బదులిచ్చారు. మాజీ సోవియట్ యూనియన్, రష్యా ఫెడరేషన్‌కు చెందిన సుమారు 2 మిలియన్ల మంది ఇజ్రాయెల్‌లో ఉంటున్నారు. ఈ విషయాన్ని అందరూ గమనించాలి. దీంతో, అదో రష్యన్ దేశంగా కనిపిస్తోంది. అందుకే తటస్థంగా ఉండాల్సి వస్తోంది. అదే సమయంలో మేము రష్యా చరిత్రను కూడా పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. రష్యా స్నేహ ధర్మాన్ని ప్రశ్నిస్తున్న వారి సందేహాలను కూడా ఆయన తోసి పుచ్చారు. వీళ్లందరూ రష్యాను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అరబ్ దేశాలతో పాటు ఇస్లామిక్ దేశాలతో కూడా తమకు మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. రష్యా జనాభాలో 15 శాతం మంది ముస్లింలేనని కూడా తెలిపారు. ఇస్లామిక్ దేశాల సహకార కూటమిలో కూడా తాము పరిశీలక దేశంగా ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. ఇరాన్ అణుస్థావరాలపై అమెరికా దాడులను రష్యా తీవ్రంగా ఖండించింది. ఇది బాధ్యతారాహిత్యం, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని మండిపడింది. పరిస్థితిని ప్రమాదకరంగా దిగజారుస్తూ ప్రాంతీయ స్థిరత్వం, భద్రతలను దెబ్బతీస్తున్నారని మండిపడింది. ఇరాన్‌కు అణ్వాయుధాలు సరఫరా చేసేందుకు పలు దేశాలు సిద్ధంగా ఉన్నాయని రష్యా మాజీ అధ్యక్షుడు డిమిత్రీ మెద్వెదేవ్ కూడా హెచ్చరించారు. ట్రంప్ చర్యల కారణంగా అమెరికా మరో యుద్ధంలో ఇరుక్కుపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఇరాన్, రష్యా మధ్య ఎంతో కాలంగా గట్టి దౌత్య సంబంధాలు ఉన్నాయి. అయితే, ఇప్పటివరకూ రష్యా ఇరాన్‌కు ఎలాంటి ఆయుధాలు సరఫరా చేయలేదు.

# ఇరాన్‌కు అణ్వాయుధాలు ఇచ్చేందుకు చాలా దేశాలు రెడీ

## రష్యా మాజీ అధ్యక్షుడు డిమిత్రి మెద్వెదేవ్

**మాస్కో,జూన్ 23:** ఇరాన్‌కు అణ్వాయుధాలు ఇచ్చేందుకు చాలా దేశాలు రెడీగా ఉన్నాయని రష్యా మాజీ అధ్యక్షుడు డిమిత్రి మెద్వెదేవ్ సంచలన వ్యాఖ్యలు చేసారు.ఇరాన్ ప్రజలు ఇప్పుడు నిరంతర ముప్పు భయంలో ఉన్నారని, దేశంలోని అనేక చోట్ల పేలుళ్లు జరుగుతున్నాయని చెప్పారు. దాడుల వల్ల రాజకీయంగా ఇరాన్ బలపడుతుందన్నారు. ఇరాన్ రాజకీయ వ్యవస్థకు ఇబ్బందేమీ లేదని చెప్పారు. ఇరాన్‌లోని ఫోర్డో, నాటాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై ఆదివారం తెల్లవారుజామున అమెరికా బీ2 బాంబర్లపై దాడి చేయడంపై రష్యా మాజీ అధ్యక్షుడు, రష్యా భద్రతా మండలి డిప్యూటీ చైర్మన్ డిమిత్రి మెద్వెదేవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శాంతిని ప్రకటిస్తూ అధికారంలోకి వచ్చిన ట్రంప్ అమెరికాను మధ్యప్రాచ్యాన్ని యుద్ధంలోకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. ఇరాన్‌పై దాడిలో అక్కడ పెద్దగా నష్టమేమీ జరగలేదని, అమెరికా సైనిక లక్ష్యం విఫలమైందని చెప్పారు. ఇరాన్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ సైకిల్‌కు చెందిన క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఎలాంటి నష్టం జరిగినట్టు కనిపించడం లేదు. డ్యామేజ్ చాలా స్వల్పంగానే ఉంది. అణు పదార్థాల సుసంపన్నత, భవిష్యత్తులో అణ్వాయుధాల తయారీ కొనసాగుతుందని ఇప్పుడు మనం బహిరంగంగా చెప్పగలనని మెద్వెదేవ్ పేర్కొన్నారు. ఇరాన్‌కు నేరుగా తమ న్యూక్లియర్ వార్‌హెడ్‌లను సరఫరా చేసేందుకు అనేక దేశాలు సిద్ధంగా ఉన్నాయని మెద్వెదేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఆ దేశాల పేర్లను ఆయన చెప్పలేదు. ఇరాన్ ప్రజలు ఇప్పుడు నిరంతర ముప్పు భయంలో ఉన్నారని, దేశంలోని అనేక చోట్ల పేలుళ్లు జరుగుతున్నాయని చెప్పారు. దాడుల వల్ల రాజకీయంగా ఇరాన్ బలపడుతుందన్నారు. ఇరాన్ రాజకీయ వ్యవస్థకు ఇబ్బందేమీ లేదని, మరింత బలపడే అవకాశం కూడా ఉందని చెప్పారు. ఇంతకు ముందు పాలనా వ్యవస్థతో విభేదించిన వారితో సహా ప్రజలు దేశ ఆధ్యాత్మిక నాయకత్వం వైపు మొగ్గుచూపనున్నారని అన్నారు. కాగా, ఇరాన్ అణుస్థావరాలపై అమెరికా దాడుల నేపథ్యంలో తాను మాస్కో వెళ్తున్నట్టు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి ప్రకటించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఉన్నత స్థాయి సమావేశం జరుపనున్నట్టు చెప్పారు. ఇస్తాం బుల్‌లో ఓఐసీ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన అరాగ్చి పుతిన్‌ను కలుస్తామని తెలిపారు. ఇరాక్‌కు రష్యా మిత్రుడని, తాము ఒకరితో ఒకరు ఎప్పుడూ సంప్రదించుకుంటూనే ఉంటామని చెప్పారు. పుతిన్‌తో సీరియస్ చర్చలు జరపనున్నట్టు చెప్పారు.

# తప్పక ప్రతీకారం తీర్చుకుంటాం..

## ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి




**న్యూయార్క్,జూన్ 23:** అమెరికా, ఇజ్రాయెల్ ఇటీవల చేపట్టిన వైమానిక దాడులపై ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావానీ తీవ్రంగా స్పందించారు. అమెరికాపై తగిన సమయంలో స్పందిస్తామని పేర్కొన్నారు. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశంలో ఆయన అమెరికాపై ధ్వజమెత్తారు. అలాగే ఈ సమావేశంలో రష్యా, ఇరాన్ ప్రతినిధులు కూడా స్పందించారు. తమకు పూర్తి రక్షణ హక్కు ఉంది. అమెరికా, ఇజ్రాయెల్ చేసిన దాడులపై ఇరాన్ తగిన విధంగా స్పందిస్తుంది. ఆ స్పందన ఎప్పుడు, ఎలా, ఏ స్థాయిలో ఉంటుందో ఇరాన్ సైనిక బలగాలే నిర్ణయించేది. మరోవైపు దౌత్యాన్ని ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. ఇజ్రాయెల్ ఉద్దేశపూర్వకంగా దౌత్య మార్గాన్ని నాశనం చేసింది. తాము సమాధానానికి సిద్ధంగా ఉన్నట్టు ఇజ్రాయెల్ నటించినా, అది అంతర్జాతీయ సమాజాన్ని మభ్యపెట్టే ప్రయత్నమే అవుతుందని ఆయన అన్నారు. పాశ్చాత్య దేశాలపై కూడా ఇరావానీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పాశ్చాత్య దేశాలు ఇరాన్ చర్చల తిరిగి రావాలని అంటున్నాయని, అసలు తాము చర్చల నుంచి బయటకు వెళ్లలేదన్నారు. తమ మా విదేశాంగ మంత్రి ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తు చేశారు. చర్చలు జరుగుతున్న వారంలోనే అమెరికా ఈ దాడులు చేసిందని, వాటిని చూసి ఏం నేర్చుకోవాలని ఆయన అడిగారు. ఇలాంటి చర్యలు అత్యంత రాజకీయ ఉద్దేశ్యాలతో చేసినవని, అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధమైనవని అన్నారు. ఇరాన్‌లో పౌరుల ప్రాణనష్టానికి, ముఖ్యంగా మహిళలు, పిల్లలు మృతి చెందటానికి, అత్యవసర సదుపాయాల వినాశనానికి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ పూర్తిగా బాధ్యత వహించాలని ఘాటుగా స్పందించారు. ఈ సమయంలో భద్రతా మండలి తగిన చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ శాంతి భద్రతను కాపాడే బాధ్యతను, విశ్వసనీయతను శాశ్వతంగా కోల్పోతుందని ఇరావానీ స్పష్టం చేశారు. ఇరాన్‌పై అమెరికా జరిపిన వైమానిక దాడులపై అత్యవసర సమావేశంలో రష్యా ఐక్యరాజ్యసమితి రాయబారి వాసిలీ నెబెంజియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులపై ఇజ్రాయెల్ ఐక్యరాజ్యసమితి శాశ్వత ప్రతినిధి డ్యానీ డానాన్ కొనియాడారు. ఈ దాడులను ఆయన మానవాళికి ఉన్న అతిపెద్ద ముప్పును తొలగించే కీలక చర్యగా అభివర్ణించారు. అయినా దాన్ని కొన్ని దేశాలు దాన్ని తప్పుపడుతున్నా యని భద్రతా మండలి సభ్యులను ప్రశ్నించారు. ఇరాన్ పౌర వినియోగానికి మించిన స్థాయిలో యూరేనియం ఎన్ని టైమ్స్ శుద్ధి చేస్తే మీరు మౌనంగా అంటారని అడిగారు. ఖఇజ్రాయెల్‌ను నాశనం చేయాలన్న వారి ఆలోచలన గురించి మీరు ఎందుకు స్పందించలేకపోయారని నిల దీశారు. ఇరాన్ చర్చల ముసుగులో రహస్యంగా రాకెట్లు నిర్మించడంలో యూరేనియం శుద్ధిలో పురోగమించిందన్నారు. వారికి అన్ని అవకాశాలు ఇచ్చామన్నారు.కానీ వారు మారకపోతే, మార్చాల్సిన అవసరమే వచ్చిందని స్పష్టం చేశారు.



## సిరియా చర్చిలో ఆత్మాహుతి దాడి: 24మంది మృతి

**డమాస్కస్:** సిరియా రాజధాని డమాస్కస్ శివారులో ఉన్న ఓ చర్చిలో ఆత్మాహుతి (Suicide Bombing) దాడి జరిగింది. ద్వెయిల్ ప్రాంతంలోని మార్ ఎలియాస్ చర్చిలో ఈ ఘటన చోటుచేసుకున్నది. కిక్కిరిసిన చర్చిలో జనం ప్రార్థనలు చేస్తుండగా ఓ వ్యక్తి తనను తాను పేల్చుకున్నాడు. దీంతో ఇప్పటివరకు 22 మంది చనిపోయారు.మరో 63 మంది గాయపడ్డారు. చనిపోయినవారులో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ దాడికి సంబంధించి ఏ ఉగ్రసంస్థ బాధ్యులమని ప్రకటించుకోలేదు. Damascus l చర్చిలో జనం మధ్యకు చేరుకున్న ఓ వ్యక్తి తొలుత తుపాకీతో కాల్పులు జరిపి, అనంతరం తనను తాను పేల్చుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపినట్లు సిరియా అంతర్గత మంత్రిత్వ శాఖ వెల్లడించింది.దుండగుడు చర్చిలో గ్రెనేడ్ విసిరినట్లు చర్చి బిషప్ తెలిపారు. దాడికి పాల్పడినవ్యక్తిని తాను చూశానని, అతనితోపాటు మరో ఇద్దరు కూడా ఉన్నారని ప్రత్యక్ష సాక్షి పేర్కొన్నారు. ఈ దాడిని సిరియా సమాచార మంత్రిత్వశాఖ మంత్రి హమ్జా మొస్తాఫా ఖండించారు.దీనిని పిరికిపంద దాడిగా అభివర్ణించారు. కాగా,చర్చిల్లో దాడులు జరగడం సిరియాలో ఇటీవలి ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

# హనీమూన్ మర్డర్‌కేసులో ప్రాపర్టీ డీలర్

## రఘువంశీ హత్యలో కొత్త ట్విస్ట్




షిల్లాంగ్,జూన్ 23: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. భర్త రాజా రఘువంశీని హత్య చేసిన కేసులో ప్రధాన నిందితురాలైన సోనమ్ రఘువంశీ, ఆమె అనుచరులు ఇండోర్‌లోని ఒక ఫ్లాట్‌లో తలదాచుకున్న విషయం తెలిసిందే. అయితే, ఇప్పుడు ఆ ఫ్లాట్ యజమాని లోకేంద్ర తోమర్‌పై మేఘాలయ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దృష్టి సారించింది. హత్యకు సంబంధించిన కీలక సాక్ష్యాధారాలను లోకేంద్ర తోమర్ మాయం చేశాడని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, సోనమ్ రఘువంశీ ఇండోర్‌లోని హీరాబాగ్ ప్రాంతంలో ఉన్న ఫ్లాట్ నుంచి వెళ్లేటప్పుడు ఒక బ్యాగ్‌ను అక్కడే వదిలేసింది. ఆ బ్యాగ్‌లో ఒక నాటు తుపాకీ, ఆమె ఫోన్, రాజాకు చెందిన కొన్ని నగలు, సుమారు ఐదు లక్షల రూపాయల నగదు ఉన్నాయని భావిస్తున్నారు. ఈ బ్యాగ్‌ను ఫ్లాట్ యజమాని, ఒక నిర్మాణ రంగ సంస్థ అధినేత అయిన లోకేంద్ర తీసుకెళ్లాడని సిట్ అనుమానిస్తోంది. ఈ కేసులో అరెస్టయిన ప్రాపర్టీ డీలర్ సిలోమ్ జేమ్స్‌ను విచారిస్తున్న సమయంలో లోకేంద్ర పేరు వెలుగులోకి వచ్చింది. హత్య నిందితులకు ఫ్లాట్‌ను అద్దెకు ఇప్పించింది ఈ సిలోమ్ జేమ్స్. సోనమ్ పోలీసులకు లొంగిపోయిన కాసేపటికి ఫ్లాట్ నుంచి ఆమె బ్యాగ్‌ను తీసేయమని లోకేంద్ర తనను అడిగాడని సిలోమ్ జేమ్స్ పోలీసులకు చెప్పాడు. అయితే, తాను తీయకపోవడంతో ఫ్లాట్ యజమానే స్వయంగా ఆ బ్యాగ్‌ను తీసుకెళ్లాడని జేమ్స్ తెలిపాడు. అంతేకాకుండా, తన ఫ్లాట్ సమీపంలోని ఒక కారు షోరూమ్ సీసీటీవీ ఫుటేజ్‌ను సంపాదించడానికికూడా తోమర్ ప్రయత్నించాడని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం లోకేంద్ర తోమర్ పరారీలో ఉన్నాడని, అతని ఫోన్ స్విచ్ ఆఫ్ అయిందని తెలిసింది. ఇండోర్ లో అతని కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

# సీటివ్వలేదని ప్రయాణికుడిపై బిజెపి ఎమ్మెల్యే దాడి



**న్యూఢిల్లీ,జూన్ 23:** వందే భారత్ రైలులో ఓ ఎమ్మెల్యే ప్రయాణికుడిపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. సీటు మార్చుకోలేదన్న కోపంతో తన అనుచరులతో కొట్టించాడు. ఎమ్మెల్యే అనుచరుల దాడిలో ఆ ప్రయాణికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన ఢిల్లీ భోపాల్ వందే భారత్ రైలులో ఆలస్యంగా వెలుగుచూసింది. సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే ఉత్తర ప్రదేశ్, ఝాన్సీ ఎమ్మెల్యే రాజీవ్ సింగ్ తన భార్య, కొడుకుతో కలిసి ఢిల్లీభోపాల్ వందే భారత్ రైలు ఎక్కాడు. అయితే, ఆ ఎమ్మెల్యేకు కంపార్ట్ మెంట్ చివరన సీటు కేటాయించబడింది. ఆయన భార్య, కొడుకు కంపార్ట్‌మెంట్ ముందు భాగంలో సీట్లు కేటాయించబడ్డాయి.

భార్య, కొడుకు దగ్గర కూర్చోవాలని ఎమ్మెల్యే అనుకున్నాడు. వారి పక్క సీటులో ఉన్న వ్యక్తిని సీటు మారమని అడిగాడు. ఇందుకు అతడు ఒప్పుకోలేదు. దీంతో ఎమ్మెల్యే ఆగ్రహానికి గురయ్యాడు. తన అనుచరులకు విషయం చెప్పాడు. రైలు ఝాన్సీకి రాగానే ఎమ్మెల్యే అనుచరులు కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చారు. సీటు మార్పుకు ఒప్పుకోని వ్యక్తితో గొడవ పెట్టుకున్నారు. తర్వాత విచక్షణా రహితంగా అతడిపై దాడి చేసి కొట్టారు. ఆ వ్యక్తిని చెప్పులతో కూడా కొట్టడం గమనార్హం. ఎమ్మెల్యే అనుచరుల దాడిలో ఆ వ్యక్తి ముక్కుకు దెబ్బ తగిలింది. రక్తం బొటబొటా కారింది. ఆ రక్తంతో చొక్కా మొత్తం తడిసిపోయింది. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే దాడి తర్వాత ఎమ్మెల్యేనే బాధితుడిపై రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎమ్మెల్యే తన కంప్లైంట్‌లో నేను నా భార్య, కొడుకుతో రైలులో ప్రయాణిస్తూ ఉన్నాను. అతడు నా భార్యతో తప్పుగా ప్రవర్తించాడని పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీటు విషయంలోనే గొడవ జరిగినట్లు గుర్తించారు. సీసీటీవీ ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



## ఇజ్రాయెల్ విద్యుత్ కేంద్ర్రాలపై


# ఇరాన్ క్షిపణి దాడులు

## అంధకారంలో పలు ప్రాంతాలు

**టెహ్రాన్, జూన్ 23:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. ఇరాన్‌లోని బాలిస్టిక్ క్షిపణి స్థావరాలపై దాడులు చేసి ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. మరోవైపు తాజాగా ఇరాన్ క్షిపణులతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. ఇరాన్ 15 బాలిస్టిక్ క్షిపణులతో పలు ప్రాంతాల్లో దాడులకు ఐడిఎఫ్ వెల్లడించింది. 40 నిమిషాలపాటు ఈ దాడులకు పాల్పడినట్లు తెలిపింది. పలు ప్రాంతాల్లో సైరన్లు మోగుతున్నట్లు వెల్లడించింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తాజా ఇరాన్ దాడుల్లో ఎవరూ గాయపడినట్లు సమాచారం లేదని అయితే పలుచోట్ల మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని పేర్కొంది.

ఇజ్రాయెల్‌లోని విద్యుత్ కేంద్రాలు లక్ష్యంగా ఇరాన్ క్షిపణి దాడులకు దిగినట్లు ఇజ్రాయెల్ పేర్కొంది. దక్షిణ ఇజ్రాయెల్‌లోని వ్యూహాత్మక విద్యుత్ కేంద్రాలై ఇరాన్ దాడులకు పాల్పడినట్లు ఇజ్రాయెల్ ఎలక్ట్రిక్ కార్పొరేషన్ తెలిపింది. ఈ కారణంగా పలు ప్రాంతాలు అంధకారంలోకి వెళ్లాయని పేర్కొంది. 'ఆ ప్రాంతాల్లో వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరమ్మతులు చేపడుతున్నాం. అయితే భద్రత కారణాల రీత్యా సెక్యూరిటీ ఫోర్సెస్‌తో సమన్వయం చేసుకుంటూ ఈ పనులు చేపడుతున్నాం' అని ఎలక్ట్రిక్ కార్పొరేషన్ వెల్లడించింది.

ఇరాన్ దాడుల నేపథ్యంలో సైరన్లు మోగుతున్న ప్రాంతాల్లో ప్రజలంతా బాంబు షెల్టర్ కేంద్రాల్లోనే ఉండాలని ఇజ్రాయెల్ అధికారులు సూచించారు. మరోవైపు ఇరాన్‌లోని బాలిస్టిక్ స్థావరాలే లక్ష్యంగా తాజాగా దాడులు చేసినట్లు ఐడిఎఫ్ పేర్కొంది. ఇజ్రాయెల్ వాయుసేన సోమవారం ఉదయం కెర్మాన్‌షా ప్రాంతంలో 15యుద్ధ విమానాలతో ఇరానియన్ బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ స్థావరాలను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది.



## ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం వేళ..

# టెహ్రాన్‌లో భారతీయ ఇంజినీర్ అదృశ్యం

**న్యూఢిల్లీ, జూన్ 23:** పశ్చిమాసియాలో ఉద్రిక్తలు నానాటికీ పెరుగుతున్నాయి. అటు అమెరికా, ఇటు ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్‌లో పరి స్థితులు భయానకంగా ఉన్నాయి. ఈ ఉద్రిక్తతల వేళ భారత్‌కు చెందిన ఓ ఇంజినీర్ ఇరాన్‌లో అదృశ్యమయ్యారు. దీనితో తమకు సాయం చేయాలని అతడి కుటుంబం కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. బీహార్‌లోని సివాన్ ప్రాంతానికి చెందిన సిరాజ్ అలీ అన్సారీ (25) ఓ ప్రైవేట్ కంపెనీలో క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. కొన్నిరోజుల క్రితం అతడితోపాటు మరో 30-35మంది సదరు కంపెనీ నెల రోజుల వర్క్ వీసాపై ఇరాన్‌లో అరాక్ ప్రాంతంలో ఓ ప్లాంట్ నిర్మాణం కోసం పంపించింది. దీంతో సిరాజ్ ఈ నెల9న సౌదీ అరేబియా మీదుగా ఇరాన్ చేరుకున్నాడు. ఆ తర్వాత కొన్ని రోజులకే ఇరాన్‌పై ఇజ్రాయెల్ 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో దాడులు చేపట్టింది.

వీరు ఉన్న అరాక్ ప్రాంతంలోనూ ఇజ్రాయెల్ క్షిపణి దాడులు చేసింది. దీంతో సిరాజ్‌తోపాటు మిగతా వారిని ఓ రిఫైనరీ ప్లాంట్ టౌన్‌షిప్‌కు తరలించారు. అయితే ఆ తర్వాత నుంచి తమ కుమారుడి ఆచూకీ తెలియరావడంలేదని సిరాజ్ తండ్రి హజ్రత్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 17న అతడితో చివరిసారిగా మాట్లాడానని, ఆ తర్వాత నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని తెలిపారు. తాను ఉంటున్న ప్రాంతానికి కేవలం కిలోమీటరు దూరంలోనే పేలుడు సంభవించినట్లు సిరాజ్ తమతో చివరిసారిగా చెప్పినట్లు అతడి తండ్రి మీడియాకు వివరించారు. తమ కుమారుడి ఆచూకీ కోసం జిల్లా యంత్రాంగాన్ని ఆశ్రయించామని అన్నారు. అతడి ఆచూకీ గుర్తించి క్షేమంగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు సాయం చేయాలని కేంద్ర విదేశాంగ శాఖను అభ్యర్థించారు. ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలతో పశ్చిమాసియా రగులుతోన్న సంగతి తెలిసిందే. దీంతో ఇరాన్‌లో చిక్కుకున్న భారతీయుల కోసం భారత్ 'ఆపరే షన్ సింధు' కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం మరో 285 మందిని స్వదేశానికి తీసుకొచ్చింది. అలా ఇప్పటివరకు ఇరాన్‌నుంచి 1,713 మంది భారతీయులను క్షేమంగా స్వదేశానికి తరలించింది.

## ఇజ్రాయెల్‌కు గూఢచర్యం చేస్తున్నారని.. ఇరాన్‌లో వరుస ఉరిశిక్షలు!



**టెహ్రాన్, జూన్ 23:** ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకుంది. భీకర దాడులతో ఇరుపక్షాలు విరుచుకుపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు గూఢచర్యం చేస్తున్న ఓ వ్యక్తికి ఇరాన్ ఉరిశిక్షను అమలుచేసింది. ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ సర్వీస్ మొస్సాద్‌కు కీలక సమాచారం అందించిన ఘటనలో మొహమ్మద్ అమీన్ అనే వ్యక్తిని సోమవారం ఉరి తీసినట్లు ఇరాన్ న్యాయవ్యవస్థ పేర్కొంది. ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించిన తర్వాత.. సమాచారం లీక్ చేస్తున్న కారణాలతో ఇరాన్ ఇలా ఉరి తీయం ఇది మూడోసారి. మొస్సాద్ సహకారంతో మొహమ్మద్ అమీన్ ఓ సైబర్ నెట్‌వర్క్‌ను నడుపుతున్నాడని.. ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మీడియా ఆపరేషన్స్ చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు అతడు పొరుగు దేశంలో ఇజ్రాయెల్ ఏజెంట్లతో భేటీ అయినట్లు ఆరోపించారు. ఇస్లామిక్ రిపబ్లిక్ సాయుధ దళాలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం అతడికి అప్పగించిన పని అని పేర్కొన్నారు. ఇలాంటి గూఢచర్య ఆరోపణలతోనే గతవారం మాజిద్ మోసయేబి, ఇస్మాయిల్ ఫక్రీ అనే వ్యక్తులను ఇరాన్ ఉరి తీసింది. ఈ ఘటనలపై ప్రపంచ మానవ హక్కుల సంఘాలు, పలు సంస్థలు తీవ్రంగా స్పందిస్తున్నాయి. ఇరాన్ న్యాయ ప్రక్రియలో పారదర్శకతను ప్రశ్నిస్తూ తీవ్ర విమర్శలు చేశాయి. ఎలాంటి ఆధారాలు చూపకుండా బహిరంగ విచారణలు చేపట్టకుండా ఉరి శిక్షలను అమలు చేస్తున్నారని మండిపడ్డాయి. ఇక ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. తాజాగా ఇరాన్‌లోని బాలిస్టిక్ క్షిపణి స్థావరాలై దాడు చేసి ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. మరోవైపు ఇరాన్ క్షిపణులతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. ఇరాన్ 15 బాలిస్టిక్ క్షిపణులతో పలు ప్రాంతాల్లో దాడులకు దిగినట్లు ఐడిఎఫ్ వెల్లడించింది.

## సంపన్నులపై ఐదుశాతం ఆదాయపుపన్ను

# 2028నుంచి అమలుకు ఓమన్ నిర్ణయం

**మస్కట్,జూన్ 23:** ఒమన్ దేశం ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల కోసం అన్వేషిస్తోంది. అందులో భాగంగా ఆదాయంపై పన్ను వేయాలనుకుంటోంది. ఇన్‌కమ్ ట్యాక్స్‌ను 2028 నుంచి అమల్లోకి తీసుకురావాలని చూస్తోంది. అయితే అధిక సంపాదన ఉన్న వారి నుంచి మాత్రమే ఒమన్ పన్ను వసూలు చేయాలని భావిస్తోంది. ఏడాదికి 42 వేల రియాల్స్ అంటే 1.09లక్ష డాలర్లు కంటే ఎక్కువ సంపాదించే వారిపై 5శాతం చొప్పున పన్ను వేయాలని ఒమన్ యోచిస్తోంది.

దాంతో పన్ను పరిధిలోకి వచ్చే వారి సంఖ్య 1 శాతంగా ఉండవచ్చునని అంచనా వేస్తోంది. ఇనకమ్ ట్యాక్స్ అమల్లోకి వస్తే ఆదాయంపై పన్ను వేస్తున్న తొలి గల్ఫ్ దేశంగా ఒమన్ నిలువనుంది.అయితే ఈ ఏడాది సౌదీ అరేబియా, బహ్రెయిన్ దేశాలు ద్రవ్యలోటు ఎదుర్కొనే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. అంతర్జాతీయంగా శిలాజ ఇంధనాలకు డిమాండ్ తగ్గుతున్నందున దీర్ఘ కాలంలో ఆదాయపు పన్ను లాంటి సంస్కరణలు తీసుకురావాల్సిన అవశ్యకత ఉంటుందని ఐఎంఎఫ్ పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో చమురుపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ఒమన్ భావిస్తోంది. తద్వారా వచ్చే ఆదాయాన్ని సంక్షేమానికి వెచ్చించాలను కుంటున్నట్లు ఒమన్ ఆర్థికమంత్రి బిన్ మహ్మద్ అల్ సర్ఖి స్పష్టంచేసారు. జీసీసీలోని ఇతర దేశాలకు ఒమన్ తీసుకున్న నిర్ణయం ఆదర్శంకావొచ్చని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లో ఆదాయంపై పన్ను ఉండదన్న కారణంతోనే ఇతర దేశాల్లోని సంపన్నవర్గాలకు చెందిన వారు అక్కడ నివాసాలు ఏర్పరచుకుంటున్నారన్నది వాస్తవమే.

# తెలంగాణలో జోరుగా ఉపాధి పనులు

మొదటి రెండు నెలల్లోనే 70 శాతం పూర్తి

## పనిదినాల రెట్టింపునకు కేంద్రాన్ని కోరతాం: మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. కేంద్రం కేటాయించిన ఆరున్నర కోట్ల పనిదినాల్లో ఇప్పటికే 4.53 కోట్ల పనిదినాలను తెలంగాణ పూర్తి చేసింది. అంటే మొత్తం కేటా యించిన పనిదినాల్లో 70 శాతం లక్ష్యాన్ని తెలంగాణ సాధించింది. అయితే గతంలో మాదిరిగా 12 కోట్ల పనిదినాలు తెలంగాణకు కేటాయించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాశారు. పనిదినాలు రెట్టింపు చేయాలని కేంద్రాన్ని కోరనున్నట్లు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం నుంచి అనుమతులు వస్తాయన్న నమ్మకంతో ఉపాధి హామీ పనులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు 18.9 లక్షల కుటుంబాల్లోని 28.48 లక్షల మంది ఉపాధి కూలీలకు పని కల్పించారు. ఒక్కో కుటుంబం సగటున 24 రోజుల పని దినాలను పూర్తి చేసుకుంది. 1127 కుటుంబాలు వంద రోజుల పనిదినాలను పూర్తి చేసుకున్నాయి. అయితే సగటున ఒక్కో కూలీకి రూ. 250.75 రోజువారి వేతనం లభిస్తుంది. అయితే రోజు వారి వేతనం రూ.307 దక్కేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తూ కూలీ గిట్టుబాటు అయ్యేలా చర్యలు చేపడుతున్నారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా వ్యవసాయ అనుబంధ పనులకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది.

ఉపాధి హామీ పనుల్లో 60 శాతం పనులు వ్యవసాయ అనుబంధ పనులు చేయించాలని లక్ష్యం పెట్టుకోగా.. వ్యవసాయ అనుబంధ పనులు 50 శాతంగా నమోదయ్యాయి. ఇందులో ప్రధానంగా ఫాం పాండ్స్, పశువుల కొట్టాలు, మొక్కల నాటింపు వంటి పనులు లక్షకు పైగా కొనసాగుతున్నాయి. జీపీ భవనాలు, అంగన్వాడీ భవనాలు, సీసీ రోడ్ల వంటి మౌలిక వసతుల కల్పన పనులు లక్షా 31 వేలకు పైగా కొనసాగుతున్నాయి. అయితే ఉపాధి హామీ పనుల్లో ఉపాధి కల్పన తో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సదుపాయాల కల్పన, ఆస్థుల సృష్టికి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. మే మాసం ముగిసే నాటికి ఉపాధి హామీలో భాగంగా రూ. 1416 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. అందులో రూ.1151.67 కోట్లు వేతనాలు కాగా, రూ.191.03 కోట్లు మేటిరియల్ కాంపోనెంట్ గా నమోదు అయ్యింది. అయితే కేంద్రం నుంచి నిధుల విడుదలతో జాప్యంమైనా కూలీలకు ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు వేతనాలను ఉపాధి కూలీల ఖాతాల్లో జమచేస్తోంది.

ఇప్పటి వరకు కూలీల ఖాతాల్లో 733.52 కోట్లు జమ అయ్యాయి. అయితే ఉపాధి హామీ పనులకు తెలంగాణలో భారీ డిమాండ్ ఉంది. మరీ ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుండటంతో, ఉపాధి పనులకు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. అయితే గత యేడాదితో పోలిస్తే ఉపాధి పనిదినాలను సగానికి కేంద్ర ప్రభుత్వం కుదించింది. దీనిపై తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ..కేంద్ర ప్రభుత్వానికి మంత్రి సీతక్క ఇప్పటికే లేఖ రాశారు. అపాయింట్‌మెంట్ రాగానే కేంద్ర పెద్దలను కలసి..ఉపాధి పని దినాలను కనీసం 12 కోట్లకు పెంచాలని విజ్ఞప్తి చేయనున్నారు.




# బిసి బిల్లు అంశానికి రాజకీయ రంగు పులుముతున్న ఎమ్మెల్సీ కవిత

## రవాణ బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూన్23,ప్రభాతవార్త:** బిసి బిల్లు అంశానికి రాజకీయ రంగు కవిత, ఆర్.కృష్ణయ్యలు పులుముతున్నారని,ప్రధానమంత్రితో చట్టసభల్లో తెలంగాణ రాష్ట్రం చేసిన బిల్లుకు చట్టబద్దత తీసుకొని రావడానికి ఆర్ కృష్ణయ్య చొరవచూపాలని రవాణ బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీ మార్గదర్శకం లో సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో బిసి బిల్లును చట్టం రూపంలో చేసుకొని గవర్నర్ పంపినామని తెలిపారు. బిఆర్ ఎస్ హయంలో బలహీన వర్గాల తరఫున గొంతెత్తని కవితకు బిసి గురించి మాట్లాడే అర్హత లేదని ఆయన అన్నారు. రాజ్యసభ సభ్యులు, బిసి నేత ఆర్.కృష్ణయ్య అంటే గౌరవం మేం డిల్లీ వస్తాం, మీరు ప్రధాని అపాయింట్‌మెంట్ తీసుకోండి అందరం కలిసి వెళదాం మీ తమ్ముడిగా రిక్వెస్ట్ చేస్తున్నా అంటూ పొన్నం అభ్యర్థించారు. మా నాయకుడు రాహుల్‌గాంధీ పార్లమెంట్ సాక్షి గా బిసి విజన్ గురించి బల్ల గుద్ది చెబు తున్నారని ఆయన వివరించారు. కవిత సత్రంలో భోజనం పెడుతుంటే కూడా సిఫార్సు లెటర్ కావాలి అనే రకం అని ఎద్దేవా చేశారు. బిసి రిజర్వే షన్ల విషయంలో ఇప్పుడు అడ్డగోలుగా మాట్లాడుతూ, జరుగుతున్న మం చిపై కూడా సన్నాయి నొక్కులు నొక్కితే అర్థమే లేదు అని పొన్నం అన్నారు. బిసిల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో

# 27న ఎస్‌ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 3 నుంచి 13 వరకు జరిగిన ఎస్‌ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను ఈ నెల 27న విడుదల చేయనున్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 13 వరకు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 42,832 మంది దరఖాస్తు చేసుకోగా వారికోసం 150 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నాం 12.30 వరకు నిర్వహించారు. ఈ నెల 13తో పరీక్షలు పూర్తికాగా జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించి ముగించినట్టు తెలిసింది. మూల్యాంకనం అనంతర పనులను చేపట్టిన అధికారులు.. ఈ నెల 27న ఫలితాలను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఎస్ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల అనంతరం రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# అనుమానాస్పద లబ్ధిదారులకు రేషన్ నిలిపివేత

## రాష్ట్రానికి 1,62,773 మంది జాబితా పంపిన కేంద్రం

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** జాతీయ ఆహారభద్రత కార్డులు అనర్హులను తొలగించాలని కేంద్రప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలమేరకు తెలంగాణలోని సివిల్స్ సప్లయ్‌శాఖ తహశీల్దార్లతో క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి 96240 కార్డులను అనుమానస్పద కార్డులుగా గుర్తించారు. జిల్లా పౌరసరఫరాల అధికారికి, తహశీల్దార్లకు డాటాలో లాగిన్ కావడానికి అవకాశం ఇచ్చి రాష్ట్రంలో అనుమానాస్పద రేషన్ కార్డులపై క్షేత్రస్థాయి విచారణ ప్రక్రియను విజయవంతంగా ముగించారు. వరుసగా ఆరు నెలల్లో రేషన్ తీసుకోనివారి వివరాలను అధికార యంత్రాంగం పరిశీలించింది. ఈ కార్డులలో 1,62,773 మంది లబ్దిదారులు ఉన్నారు. ఆరోగ్యశాఖ,ఐసిడిఎస్ సర్వే ప్రకారం మృతులను, వలసవెళ్లినవారిని, డబుల్ కార్డులు కలిగిన లబ్ధిదారుల్లో 76.842 మంది గుర్తించి వారిని అనర్హులుగా గుర్తించారు .ఈ వివరాలను పౌర సరఫరాలశాఖ జిల్లాలవారీగా కలెక్టర్లకు పంపించింది. కొద్ది రోజుల్లోనే వారిని రేషన్ లబ్దిదారుల జాబితా నుంచి తొలగించనున్నట్లు తెలిసింది. ఇకనుంచి వారికి రేషన్ కోటా నిలిపివేయనున్నట్లు పౌర సరఫరాలశాఖ వర్గాలు తెలిపాయి. రేషన్ లబ్దిదారులకు ఉచితంగా బియ్యం ఇస్తున్నప్పటికీ చాలామంది తీసుకోవడం లేదు. కేంద్రప్రభుత్వం అనుమానాస్పద రేషన్ లబ్దిదారులుగా గుర్తించి వారి వివరాల్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి విచారణ కోరింది. పౌర సరఫరాలశాఖ ఈ వివరాల్ని జిల్లా కలెక్టర్లకు, డిఎస్‌వోలకు సమాచారం అందించి మండల స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం ద్వారా స్థానికంగా విచారణ జరిపించింది. ఇందులో అర్హులు. అనర్హులను గుర్తించి ఆ వివరాల్ని పౌర సరఫరాల శాఖకు పంపించగా, రేషన్ జాబితా నుంచి తొలగించాలని నిర్ణయించింది. అనుమా నాస్పద లబ్దిదారుల్లో 60 శాతం మంది అనర్హు లుగా తేలారు. ఇందులో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, చనిపోయినవారు, రెండుచోట్ల రేషన్ కార్డుల్లో పేర్లున్నవారు ఉన్నట్లు గుర్తించారు. క్షేత్రస్థాయి వివరాల ఆధారంగా పంపిన నివేదికలతో వారిపేర్లను తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర సివిల్ సప్లయ్‌శాఖ 96వేలకు పైగా కార్డులపై అనుమానం వ్యక్తం చేయడంతో విచారణ చేయగా అనర్హులుగా తేలినవారు హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, మేడ్చల్ జగిత్యాల, జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు. కేంద్రప్రభుత్వం చాలా కాలంగా రేషన్ సరుకులు తీసుకోకుండా కార్డులను నిరుపయోగంగా ఉంచుతున్న వారిపై దృష్టి సారించింది.

# బిసిల చేతివృత్తులకు చేయూత

## కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం

### 25 నుంచి 29 వరకు ఎగ్జిబిషన్: మంత్రి పొన్నం

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసిల చేతివృత్తులకు చేయూత నివ్వనున్నట్టు బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా చేతివృత్తుల కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం చేపట్టనున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యావరణహితమైన చేతివృత్తుల వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ చేయనున్నట్టు తెలిపారు. ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకంపై బిసి కుల సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని.. చేతివృత్తుల వారిని ప్రోత్సహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 25 నుండి 29 వరకు 5 రోజులు చేతివృత్తుల కళాకారులచే తయారుచేసిన వివిధ వస్తువుల ప్రదర్శన, అమ్మకం ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎగ్జిబిషన్‌ను ట్యాంక్‌బండ్, అంబేద్కర్ విగ్రహం పక్కనున్న చోట ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు జరుగు తున్నాయని తెలిపారు. ఈ ప్రదర్శనలో కుమ్మరులు తయారుచేసిన మట్టి పాత్రలు, గౌడన్నలచే నీరా, మేదరివారు తయారు చేసిన వెదురు వస్తువులు, పూసలవారి సామగ్రి.. అలాగే పోచంపల్లి, గద్వాల, నారాయణపేట మొదలైన చేనేత ఉత్పత్తులు, ఇతర బిసి వర్గాలచే తయారుచేసిన వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. వాటితోపాటు తెలంగాణ వంటకాలు, బెస్త సోదరులచే చేప వంటకాలు, ఇతర భోజన స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 9:30గంటల వరకు ఉంటుందని.. ఉచితప్రవేశం కల్పించినట్టు తెలిపారు.

# పాత ఫ్యాన్ కావడంతోనే ఊడింది

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘటన..

### ఆదిలాబాద్ డిఎంహెచ్ఒ వివరణ

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** ఆదిలాబాద్‌లో గుడిహత్నూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కింద పడిన ఫ్యాన్ సంఘటనపై జిల్లా వైద్యశాఖ అధికారి వివరణ ఇచ్చారు. ఆసుపత్రిలో ఫ్యాన్ ఊడి పడి చిన్నారికి గాయాలు అని పలు వార్తా పత్రికలు ప్రచురించాయిని అయితే ఈ సంఘటపై దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనపై మెడికల్ ఆఫీసర్ శ్యామ్‌ను స్టాఫ్ నర్స్ తిరుమల రాణిని, రోగి సహాయకుడు నుంచి తగిన సమాచారం సేకరించామన్నారు. ఫ్యాన్ ఊడిపడేందుకు గల కారణాలను తెలుసుకున్నామని, సీలింగ్ ఫ్యాన్ పాతది కావడమే కాకుండా అది తుప్పు పట్టడంతోనే ఫ్యాన్ పడిందని తన విచారణలో తేలిందన్నారు. తుప్పు పట్టిన ఫ్యాన్ కింద పడటంతో నవజాత శిశువుకు గాయమైనట్లు తెలిపారు.

# గాంధీభవన్‌లో గొర్రెల మంద ధూంధాం



## గాంధీభవన్‌లోకి వదలిన రెండు ట్రక్కుల గొర్రెలు

### మంత్రిమండలిలో చోటుదక్కలేదని గొల్ల కురుమల నిరసన

### పిసిసితో చర్చలకు పట్టుబట్టిన యాదవులు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** గాంధీభవన్‌లో సోమవారం గొర్రెల మంధ ధూంధాం సృష్టించాయి. గొల్ల కురుమలకు మంత్రి మండలిలో ప్రాధాన్యత దక్కలేదని గొల్లకురుమలు పెద్ద ఎత్తున గాంధీభవన్‌కు తరలివచ్చి గొర్రెలతో నిరసన తెలిపారు. గాంధీభవన్‌లో గొర్రెల అరుపులు ఒకవైపు బీర్ల ఐలయ్యకు మంత్రిమండలిలో అవకాశం కల్పించాలని గొల్ల కురుమలు నినాదాలతో ఆ ప్రాంతం హోరెక్కింది. కాంగ్రెస్ పార్టీ స్టేట్ ఆఫీస్ గాంధీభవన్ గొర్లను పంపి గొర్ల కాపరుల సంక్షేమ సంఘం నేతలు వినూత్న నిరసన చేయడం అందరిని ఆకర్షిం చింది. కాంగ్రెస్ పార్టీలో, ప్రభుత్వంలో గొల్ల, కురుమలకు ప్రాధాన్యత దక్కడం లేదంటూ యాదవులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేబినెట్లో యాదవ సామాజిక వర్గానికి అవకాశం ఉండేదని వారు గుర్తుకు చేశారు. మొదటిసారి కేబినెట్లో గొల్ల, కురుమలకు అవకాశం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లోనూ అవకాశం దక్కలేదన్నారు. ఈ నేపథ్యంలోనే గొర్రెలతో వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చి నట్లు మీడియాతో గొల్ల, కురుమ సంఘం నేతలు మీడియాతో మాట్లాడుతూ మంత్రి వర్గంలో అవకాశం కల్పించడంతో పాటు, ప్రాధాన్యత కలిగిన నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌తో చర్చలు జరిపేవరకు గాంధీ భవన్ నుంచి వెనక్కి వెళ్లమని వారు మొండికేసి అక్కడే గొర్రెల మందతో కూర్చొన్నారు. గాంధీ భవన్‌లో నిరసన నేపథ్యంలో గొల్ల, కురుమల సామాజికవర్గ నేతలతో టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చర్చలు జరిపారు. వారి వినతి పత్రం స్వీకరించి వారి గోడును విన్నారు. అలాగే పశుసంవర్ధక శాఖ మంత్రి వాకాటి శ్రీహరితో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని పీసీసీ చీఫ్ హామీ ఇచ్చారు. మీ సమస్యలను గొల్ల కురుమ నాయకులతో కలిసి కూలంకశంగా చర్చించి పరిష్కారం కోసం మంత్రితో మాట్లాడామన్నారు. కార్పొరేషన్ చైర్మన్లతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గొల్ల కురుమలకు అవకాశం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రివర్గంలో చోటు గురించి మీరు చేసిన విన్నపాలను హైకమాండ్ దృష్టికి తీసుకెళ్తాఅని అన్నారు. పశుసంవర్ధశాఖ మంత్రి వాకిటి శ్రీహరి వారితో చర్చించాలని పిసిసి చీఫ్ సూచించడంతో యాదవులు శ్రీహరికి తమ సమస్యలు వివరించారు.

# సూక్ళ్ల పర్యవేక్షణకు టీచర్ల నియామకం ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి

## పాఠశాల విద్య డైరెక్టర్‌కు టిఆర్‌టిఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల, విద్యా బోధన పర్యవేక్షణకు ప్రస్తుతం ఉన్న విధానాన్నే పటిష్టపరచాలని.. కొత్త విధానం అనవసర గందరగోళానికి దారితీస్తుందని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టిఆర్‌టిఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌ని సోమవారం టిఆర్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ కలిసి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన విధంగా పర్య వేక్షణకు ఒక డిఈఓ, పరిపాలనకు మరొక డిఈఓను నియమించాలని దాంతోపాటు మండలానికి ఇద్దరు ఎంఈఓలను నియమించాలని డైరక్టర్‌కి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 33 జిల్లాలు ఏర్పడినప్పటికీ.. ఇప్పటి వరకు 20 డీఈవో పోస్టులు కేటాయించలేదని.. అలాగే నూతన మండలాలకు మండల విద్యాధికారుల పోస్టులు కేటాయించలేదన్నారు. పూర్తిస్థాయి జిల్లా విద్యాధి కారులను కేటాయించాలన్నారు. విద్యాశాఖ అనుమతితో అప్‌గ్రేడ్ అయిన పాఠశాలలు నేటికీ మండల పరిషత్ హైస్కూల్‌గా 1 నుండి 10వ తరగతులు కొనసాగుతున్నాయని.. వాటిని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలుగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బైఫర్‌కేట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని డైరెక్టర్‌ని కోరినట్టు తెలిపారు. ప్రస్తుతం ఉన్న వ్యవస్థను పటిష్ట పరుస్తూ ప్యానెల్ ఇన్స్‌పెక్షన్‌ను చేయడం ద్వారా పూర్తిస్థాయి పర్యవేక్షణ జరుగుతుందని.. కానీ నూతన విధానం గందరగోళానికి దారితీస్తుందని ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల బదలీలు, పదోన్నతుల షెడ్యూల్ జారీ చేయాలని కోరినట్టు కటకం రమేష్ తెలిపారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బిఆర్‌ఎస్ నేతలకు ముచ్చెమటలు

## బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్ (గోషామహల్), జూన్ 23,ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గం బిజెపి శాసనసభ్యులు టి.రాజాసింగ్ బిఆర్‌ఎస్ నేతలకు కాళేశ్వరంలో విషయంలో స్ట్రాంగ్ హెచ్చరిక చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధారాలతో సహా బయటపెట్టగానే గులాబిపార్టీ నాయకులు, అవాక్కులు, చెవాక్కులు పేల్చుతున్నారని ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు. బండిసంజయ్‌పై చేస్తున్నవ్యాఖ్యలను తాను ఖండిస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ముమ్మాటికి అవినీతి ప్రాజెక్టేనని ఆయనఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చెప్పినట్లుగా కాళేశ్వరం ప్రాజెక్టు ఎటిఎంలా బిఆర్‌ఎస్ నేతలు వాడుకున్నట్లు తెలిపినట్లు గుర్తు చేశారు. 38వేల కోట్లతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో లక్షల20వేల కోట్ల పెంచలేదా అని నిలదీశారు. అనాడు స్వయం ప్రకటిత ఇంజనీర్‌గా అవతారం ఎత్తిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, నేడు కెటిఆర్ ఎన్డీఎస్ఏ కంటే తానే తెలివైన మేధావిగా ప్రవర్తించడం సిగ్గుచేటు అన్ని ఎమ్మెల్యే రాజాసింగ్ విమర్శించారు.



తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# ప్రత్యేక జర్నల్‌ను ప్రారంభించిన ఉన్నత విద్యామండలి

## టెక్నాలజీ-ఉన్నత విద్యపై ప్రారంభ సంచిక

### వర్చువల్‌గా ప్రారంభించిన మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్నత విద్యను బలోపేతం చేయడానికి ఉన్నత విద్యా మండలి ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా పరిశోధనల్లోనూ విద్యార్థులు ముందుండాలని భావించిన ఉన్నత విద్యా మండల ప్రత్యేకంగా తెలంగాణ జర్నల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టిజెహెచ్‌ఈ)ని ప్రారంభించింది. ప్రారంభ సంచికను చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి సోమవారం ప్రారంభించారు. జర్నల్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు, ఉన్నత విద్యా మండలి వైస్‌చైర్మన్లు ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ పాల్గొన్నారు. తెలంగాణలో పరిశోధనా పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి అన్నారు. బలమైన పరిశోధన సంస్కృతిని పెంపొందించడానికి, విద్యా నైపుణ్యాన్ని నడిపించడానికి, ఉన్నత విద్యలో సాక్ష్యం ఆధారిత విధానాన్ని ప్రోత్సహించడానికి టిజెహెచ్‌ఈ ఉపయోగపడుతుందన్నారు.

ఉన్నత విద్యా మండలి 6 నెలలకొక జర్నల్‌ను ప్రచురించ నున్న ట్టు తెలిపారు. తెలంగాణ విద్యా భవిష్యత్తును రూపొందించడంలో సహాయ పడటానికి ఒక శక్తివంతమైన వేదికగా టిజెహెచ్‌ఈ పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలోని ఉన్నత విద్యా సంస్థలలో పరిశోధన కోసం జర్నల్ ఏర్పాటు ఒక బెంచ్‌మార్క్‌లాగా ఉంటుందని బాలకిష్టారెడ్డి అన్నారు.

జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలను పెంచాలనే లక్ష్యంతో జర్నల్‌ను తీసుకొస్తున్నట్టు తెలిపారు. కొత్తగా వస్తున్న టెక్నాలజీ, ఆధునికతలను విద్యార్థులకు పరిచయం చేయడం, ఏడాదికి రెండు జర్నల్స్‌ను తీసుకు రావడంతో పాటు జాతీయస్థాయి సంస్థలతో అవ గాహన ఒప్పందాల(ఎంవోయు)ను చేసుకొని విద్యాసంస్థల సామర్థ్యంతోపాటు విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించుకోనున్నట్టు తెలిపారు.



ప్రెస్‌క్లబ్‌లో నిరసన తెలుపుతున్న పిఒడబ్ల్యు రాష్ట్ర కార్యవర్గం

# నిరసనకారులపై పోలీసుల దాష్టీకానికి ఖండన

## పోలీసుల దాడిలో వి.సంధ్యకు తీవ్రగాయాలు

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 23, ప్రభాతవార్త:** ప్రజాస్వామిక పాలనను అంది స్తామని వాగ్దానం చేసిన సిఎం రేవంత్‌రెడ్డి పాలనలో పోలీసులు నిరసన కారులపై చేస్తున్న దాష్టీకాన్ని, క్రూరంగా హించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మని ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ) రాష్ట్ర కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. ఇటీవల అమెరికా కాన్సులేట్ కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో పిఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు వి.సంధ్య, మహిళా కార్యకర్తలపైన, వయోధికులపై పోలీసుల దాష్టీకాన్ని కార్యవర్గం నిరసించింది. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, ప్రధాన కార్యదర్శి అంది మంగ తదితరులు మాట్లాడుతూ ఈ నెల 19న వామపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా వివిధ ప్రజాసంఘాలు, ప్రజా స్వామిక వాదులు అమెరికా కాన్సులేట్ ఎదురుగా నిరసన ప్రదర్శన చేస్తున్న వారిని పోలీసులు అడ్డుకుని దౌర్జన్యపూరితంగా వ్యవహరించారని ఆరోపిం చారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఉద్యమకారులను గచ్చిబౌలి పోలీస్ అధికారులు బలవంతంగా ఈడ్చుకుంటూ రెక్కలు విరిచి వ్యాన్‌లో పడేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో వి.సంధ్య తీవ్రంగా గాయపడ్డారన్నారు. నిరసన కారులపై అనుచితంగా ప్రవర్తించిన పోలీస్ అధికారులపై చర్యలు తీసు కోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నకిలీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

## తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ చేపట్టిన దీక్షకు మద్దతు తెలిపిన రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

### 25శాతం ఉచితవిద్యపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

### టిఆర్‌ఎల్‌డి రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్‌కుమార్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 23, ప్రభాతవార్త:** రైతులకు నకిలీ విత్తనాలు అమ్ముతూ మోసం చేస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ తీరును నిరసిస్తూ దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సంఘీభావం తెలిపి, ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాల్సిన బాద్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ, రేవంత్ సర్కార్ దాన్ని మరిచి, రైతులను కష్టాల సుడిగుండంలోకి నెట్టిందని ఆరోపించారు. రైతుల సమస్యపై అన్ని పార్టీలు స్పందించాల్సిన అవసరం ఉందని అన్నారు. మాజీమంత్రి విజయరామారావు మాట్లాడుతూ రాజకీయ అవినీతి వ్యవహారాన్ని ఒక అంశంగా తీసుకుని టీఆర్‌ఎల్‌డీ ఆధ్వర్యంలో దీక్ష చేయటం శుభపరిణామమన్నారు. టీఆర్‌ఎల్‌డి రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ కొంతమంది మంత్రులపై అవినీతి ఆరోపణలు ఉన్నా ముఖ్యమంత్రి ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. ఈ అవినీతి అంశంపై త్వరలో గవర్నర్‌ను కలుస్తామని స్పష్టం చేశారు. పార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులకు 25 శాతం ప్రైవేట్ పాఠశాలలో సైతం ఉచిత విద్య అందించాలని చట్టం ఉన్నప్పటికీ పాలకులు పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి

## రాజ్‌భవన్ ముట్టడికి ఎఐవైఎఫ్ యత్నం

### అడ్డుకున్న పోలీసులు.. అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలింపు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్నదని భయంకరమైన నరమేధ చర్యలు వెంటనే ఆపాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ చౌరస్తా నుండి రాజ్ భవన్ కు ర్యాలీగా వెళ్తున్న కార్యకర్తలను అడ్డుకుని, పోలీసులు అక్రమ అరెస్టు చేశారు. తోపులాటలో పలువురు నేతలకు గాయాలు అయ్యాయి. అరెస్ట్ చేసిన నేతలను పంజాగుట్ట పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ దండ కారణ్యం తుపాకుల గర్జనతో దద్దరిల్లుతున్నదని, మావోయిస్టులతో పాటు అమాయక ఆదివాసీల నెత్తురు ఏరులై పారుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరు నెలలుగా ఏకధాటిగా కొనసాగుతున్న కూంబింగ్ ఆదివాసీ గూడాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నదని, మావోయిస్టు రహిత భారత్ కోసమంటూ చేపట్టిన ఆపరేషన్ కగార్ మానవ హక్కుల్ని ఉల్లంఘిస్తూ చేస్తున్న మారణ హోమం వెనుక ఉన్న ఉద్దేశమేంటి? ప్రశ్నించారు. అడవుల్లో మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో ఉన్న ఖనిజ నిక్షేపాలు. అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లకు అటవీ సంపదను దోచి పెట్టేందుకే ఈ నరమేధం అని విమర్శించారు.




రాజ్‌భవన్ ముట్టడికి వెళ్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

# కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణ జరిపించాలి

## బిజెపి నేతల డిమాండ్

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** కాళేశ్వరం అవినీతి నుండి బయటపడేందుకు బిఆర్‌ఎస్ నేతలు అపసోపాలు పడుతున్నారని బిజెపి నేతలు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై బిఆర్‌ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలపై బిజెపి ఎమ్మెల్యేలు పాల్వాయి హరీష్, రామారావు పటేల్, అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్‌లు ఒక ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిపుణుల బృందం సందర్శించి ప్రాజెక్టు లోపాలను ఎత్తి చూపిందన్నారు. కాళేశ్వరంలో జరిగిన అక్రమాలు, నాణ్యతా లోపాలు, మొరాయించిన మోటార్లు, ప్రభుత్వ నిరక్ష్యాన్ని ఎన్‌డిఎస్‌ఏ స్పష్టంగా చెప్పిందని, అయినా ఎన్‌డిఎస్‌ఏ నివేదికను బిఆర్‌ఎస్ నేతలు తప్పుపట్టడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. పిసి ఘోష్ కమిషన్ విచారణ సందర్భంగా బిఆర్‌ఎస్ నేతలు కారుకూతలు కూశారని అన్నారు. బిఆర్‌ఎస్ నేతల అవినీతిని బిజెపి పార్టీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, కాళేశ్వరంపై సిబిఐ విచారణ జరగాలని రాహుల్ గాంధీ చెప్పిన మాటలను మార్చిపోయారా అంటూ ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ చేసిన తప్పులకు శిక్ష అనుభవించక తప్పదన్నారు. కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

## పాస్‌పోర్టు దరఖాస్తుల పరిశీలనలో రాష్ట్ర పోలీసు శాఖకు దేశంలో అగ్రస్థానం

### ఢిల్లీలో నేడు అవార్డు అందుకోనున్న నిఘా విభాగం బాస్

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** పాస్‌పోర్టు దరఖాస్తుల పోలీసు ధృవీకరణ ప్రక్రియలో తెలంగాణ పోలీసు విభాగం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఇందుకోసం రాష్ట్ర పోలీసులు అభివృద్ధి చేసిన వెరి ఫాస్ట్ యాప్ కీలక భూమిక వహించింది. ఈ యాప్ పాస్‌పోర్టు ధృవీకరణ ప్రక్రియను వేగవంతంగా, కచ్చితంగా, పారదర్శకంగా, అత్యుత్తమంగా ప్రజా ప్రయోజనకారిగా రూపుదిద్దుకుంది. విదేశాంగ శాఖ తాజా జాతీయ గణాంకాల ప్రకారం తెలంగాణ పోలీసులు దేశం లోనే అత్యంత వేగంగా పాస్‌పోర్టు ధృవీకరణను పూర్తి చేస్తూ మూడు రోజుల్లోనే మెజారిటీ దరఖాస్తులను పరిష్కరిస్తున్నట్లు తేలింది. ఈ క్రమంలో 95 శాతం విజయాన్ని సొంతం చేసుకుంది. రోజుకు సగటున రెండు వేలకు పైగా ధృవీకరణలు పూర్తవుతున్నాయి. ఇదే సమయంలో మోసపూరిత దరఖాస్తులను పక్కాగా తిరస్కరించడం జరుగుతుంది. ఇందుకోసం తెలంగాణ పోలీసు శాఖ సాంకేతికను వాడుకోవడాన్ని విదేశాంగ శాఖ ప్రశంసించింది. తెలంగాణ పోలీసు శాఖ పాస్ పోర్టు ధృవీకరణలో గోల్డ్ స్టాండర్డ్ నెలకొల్పినందుకు మంగళవారం నాడు ఢిల్లీలో జరిగే పాస్‌పోర్టు సేవా దివస్ సందర్భంగా విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ చేతుల మీదుగా రాష్ట్ర నిఘా విభాగం అధిపతి శివధర్‌రెడ్డి ఉత్తమ సేవా ధ్రువీకరణ పత్రాన్ని అందుకోనున్నారు.



## మాజీ రాష్ట్రపతి వివి గిరి, సంజయ్‌గాంధీకి కాంగ్రెస్ నేతల నివాళులు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** సంజయ్‌గాంధీ, మాజీ రాష్ట్రపతి వివి గిరికి సోమవారం కాంగ్రెస్ పార్టీ నివాళులు అర్పించింది. గాంధీభవన్‌లో మాజీ రాష్ట్రపతి వివి గిరి, జాతీయ కాంగ్రెస్ నాయకులు దివంగత నేత సంజయ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించినారు. ఎఐసిసి ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ , ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేయర్ గద్వాల విజయ లక్ష్మి ్మ, సిడబ్ల్యుసి సభ్యులు వంశీచంద్‌రెడ్డి పాల్గొని దేశానికి వారు చేసిన సేవలు గుర్తు చేసుకొన్నారు. సంజయ్‌గాంధీ ఐదు సూత్రాల కార్యక్రమం దేశగతిని మార్చిందని మీనాక్షి నటరాజన్ అన్నారు. యువజన కాంగ్రెస్ ద్వారా అనేక మంది కొత్తతరం రాజకీయ నాయకులను అన్నివర్గాల నుంచి అనేక ప్రాంతాల నుంచి ఉద్భవించేందుకు దోహదం చేసిన వ్యక్తి సంజయ్ అన్నారు. వివి గిరి రాష్ట్రపతిగా ఎంతో గొప్ప సేవలు అందించారని ఆమె జ్ఞాపకం చేసుకొన్నారు.

## మిడిల్‌ఈస్ట్ నుంచి తిరిగొచ్చే తెలంగాణ పౌరులకు ప్రభుత్వం సాయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 23:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాలను అనుసరించి, తెలంగాణ ప్రభుత్వం మిడిల్ ఈస్ట్ సంక్షోభాన్ని నిశితంగా పర్యవేక్షిస్తూ, ప్రభావిత ప్రాంతాల నుంచి తిరిగి వచ్చే తెలంగాణ పౌరులకు పూర్తి సహాయాన్ని అందిస్తోంది. సమన్వయంతో కూడిన ప్రయత్నంతో, ఆరుగురు తెలంగాణ విద్యార్థులు ఆదివారం అర్ధరాత్రి న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. వీరిలో నలుగురు ఇరాన్ నుంచి, ఇద్దరు ఇజ్రాయెల్ నుంచి సురక్షితంగా వచ్చారు. అందరూ హైదరాబాద్‌కు ముందస్తు విమానాలను బుక్ చేసుకోగా, సోమవారం ఉదయం 5:30 గంటలకు హైదరాబాద్ బయలుదేరే వరకు తెలంగాణ భవన్ సిబ్బంది వారికి సహాయం చేశారు. మరో ఏడుగురు తెలంగాణ పౌరులు ఇజ్రాయెల్ నుంచి జోర్డాన్‌లోని అమ్మాన్‌కు సురక్షితంగా చేరుకున్నారు. త్వరలోనే న్యూఢిల్లీకి చేరుకోనున్న వీరి కోసం అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఇజ్రాయెల్ గగనతలాన్ని తాత్కాలికంగా మూసివేయడం వల్ల ఇబ్బందులు తలెత్తినప్పటికీ, ఈ సవాళ్లను అధిగమించి, ప్రభావిత పౌరులందరికీ సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది. విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత రాయబార కార్యాలయాలు, సంబంధిత అధికారులతో తెలంగాణ ప్రభుత్వం నిరంతర సమన్వయంతో పనిచేస్తోంది. స్వదేశానికి వచ్చే ప్రతి తెలంగాణ నివాసికి సకాలంలో సహాయం, సరైన వసతి, తదుపరి ప్రయాణ సౌకర్యం అందేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పౌరులంతా అధికారిక మార్గాలనే అనుసరించాలని, ధృవీకరించని సమాచారంపై ఆధారపడరాదని సూచనలు జారీ అయ్యాయి. ఈ క్లిష్ట సమయంలో తెలంగాణ ప్రభుత్వం పౌరులకు అండగా నిలుస్తూ వారి భద్రతకు, త్వరితగతిన స్వదేశానికి రప్పించేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తోంది.

## అప్పులతో ఇద్దరు రైతులు ఆత్మహత్య

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అప్పులు తీర్చలేక తీవ్రమనస్తాపంతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రాష్ట్రంలోని జనగామ మండలం శామీర్‌పేటకు చెందిన రైతు చాపల భాస్కర్ (41) తనకున్న ఎకరం సాగు చేసుకుంటున్నారు. పంట పెట్టుబడి, గృహోప వినియోగం నిమిత్తం రూ.8 లక్షల వరకూ అప్పులు చేశారు. వాటిని తీర్చుడానికి తన స్వంత పొలంతో పాటు, మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. అయితే పంటలు సక్రమంగా పండక, దిగుబడులు రాక నష్టాల పాలయ్యారు. మరోపక్క అప్పు ఇచ్చినవారు డబ్బులు చెల్లించాలని ఇంటికి రావడంతో మనస్తాపంతో భాస్కర్ ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. అలాగే హనుమకొండ జిల్లా గూడూరుకు చెందిన కుమ్మరి ప్రతాప్ (42) అనే రైతు 2.20 ఎకరాల భూమిలో వరి సాగు చేశారు. రెండేండ్లుగా దిగుబడులు రాక రూ.12 లక్షలు అప్పులయ్యాయి. వ్యవసాయం కలసిరాక వాటిని ఎలా తీర్చాలో తెలియక బెంగపెట్టుకున్నారు. తీవ్ర మనస్థాపానికి గురై పొలం వద్ద గడ్డిమందు తాగి ప్రాణాలు కోల్పోయారు.

## నా ప్రాణాలకు ముప్పు ఉంది.. భద్రత పెంచాలి

### బీహార్ సర్కార్‌కు లాలూ పెద్దకుమారుడి అర్జీ



**పాట్నా, జూన్ 23:** తన ప్రాణాలకు ముప్పు ఉందని, తనకు భద్రత పెంచాలని లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు, ఆర్జేడీ బహిష్కృత నేత తేజ్ ప్రతాప్ యాదవ్ బీహార్ ప్రభుత్వాన్ని కోరారు. పార్టీకి చెందిన నలుగురైదుగురు నేతల కుట్ర కారణంగానే పార్టీ (ఆర్జేడీ) నుంచి తాను బహిష్కరణకు గురైనట్లు ఆరోపించారు. తన గర్ల్‌ఫ్రెండ్ అనుష్క యాదవ్, తానూ 12 ఏళ్లుగా ప్రేమించుకుంటున్నామని, చాలాకాలంగా ఈ విషయాన్ని అందరితో పంచుకోవాలని అనుకుంటున్నప్పటికీ అదెలాగో తెలియలేదనీ పేర్కొంటూ తేజ్ ప్రతాప్ యాదవ్ ఒక పోస్ట్ పెట్టారు. అయితే అప్పటికే తేజ్‌ప్రతాప్ వివాహం 2018లో బీహార్ మాజీ మంత్రి చంద్రికా రాయ్‌తో జరగడం, కొద్దిరోజుల్లోనే విభేదాలు పొడచూపి విడాకుల వరకూ వెళ్లడంతో ఆయన పోస్ట్ సంచలనమైంది. ఈ క్రమంలో క్రమశిక్షణ పేరుతో తేజ్ ప్రతాప్‌ను పార్టీ నుంచి ఆరేళ్ల పాటు లాలూ ప్రసాద్ యాదవ్ సస్పెండ్ చేశారు. అయితే ఆ వెంటనే తన సోషల్ మీడియా అకౌంట్ హ్యాక్ అయిందని తేజ్ ప్రతాప్ వివరణ ఇచ్చారు. ఎడిట్ చేసిన ఫోటోను పోస్ట్ చేశారని చెప్పారు. ఆర్జేడీలోని కొందరు తనపై కుట్ర చేశారని ఆరోపించారు. తాజాగా అదే వాదనను ఆయన మరోసారి వినిపించారు. బీహార్ ప్రజలకు తానేంటో బాగా తెలుసునని, నలుగురైదుగురు పన్నిన కుట్రకు తాను బలైన విషయాన్ని వారు గ్రహించారని తేజ్ ప్రతాప్ తెలిపారు. తనను ఒంటరిని చేయడం ద్వారా అణిచివేయాలని అనుకున్నారని, దీనిపై తాను ప్రజల్లోకి వెళ్తానని, వాళ్లే తనకు న్యాయం చేస్తారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని సంకేతాలిచ్చారు. ఆర్జేడీ నుంచి తన బహిష్కరణకు కారణమైన వారి పేర్లు వెల్లడిస్తానని, తన వ్యక్తిగత విషయంలో జోక్యం చేసుకున్న వారిపై కోర్టుకు వెళ్తానని తేజ్ ప్రతాప్ చెప్పారు. వ్యక్తిగత జీవితంలోకి తొంగిచూస్తే ఎవరూ సహించలేరని అన్నారు. తన ప్రాణాలకు ముప్పు ఉన్నందున భద్రత పెంచాలని బీహార్ ప్రభుత్వాన్ని ఆయన కోరారు.


**నా సోదరుడు సీఎం కావాలి**

తల్లిదండ్రుల పట్ల తనకు ఎంతో గౌరవం ఉందని తేజ్ ప్రతాప్ ఈ సందర్భంగా చెప్పారు. ఒక పెద్ద సోదరుడుగా తన తమ్ముడు తేజస్వి ముఖ్యమంత్రి కావాలని ఎప్పుడూ తాను కోరుకుంటూనే ఉంటానని, అందుకు అవసరమైన సపోర్ట్ కూడా ఎప్పుడూ ఉంటుందని తెలిపారు.

## లడ్డూలకు 'కియోస్క్'!

### తిరుమలలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు

### బ్యాంకుల ద్వారా ఐదు యంత్రాలు అందుబాటులోకి




**తిరుమల,జూన్ 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం తరువాత అంతేపవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదాన్ని భక్తులు ఇకనుండి సులభంగా అందుకునేందుకు వీలుగా టిటిడి అధికారులు "కియోస్క్" యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ యంత్రాలను లడ్డూవితరణశాలలో మొదట్లోనే ఏర్పాటుచేశారు. యూనియ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో ఐదు కియోస్క్ యంత్రాలను ప్రయోగాత్మకంగా ఉంచారు. భక్తులు సులభంగా ఈ కియోస్క్‌ల వద్దకు చేరుకుంటే రెండు రకాల సేవలు యంత్రం తెరపై కనిపిస్తుంది. మొదటిది దర్శన టిక్కెట్ కలిగిన భక్తులకు లడ్డూప్రసాదం, దర్శనం టిక్కెట్ లేని భక్తులకు ఆధార్‌కార్డు ఆదారంగా లడ్డూలు అందుకునేందుకు సాంకేతికతను అమర్చారు. దీనిపై భక్తులు ఏదేని ఒకదానిని వినియోగించుకుంటే లడ్డూలకు దర్శన టిక్కెట్‌నంబర్‌గానీ, ఆధార్ కార్డునంబర్ నమోదు చేయాలి. ఆ తరువాత మొబైల్‌నంబర్ నమోదు చేస్తే ఎన్ని లడ్డూలు అవసరం అనేది తెరపై కనిపిస్తుంది. భక్తులు ప్రస్తుతం ప్రయోగత్మక విధానంలో ఆధార్‌కార్డు ఆధారంగా కేవలం 2లడ్డూలు మాత్రమే అందుకునే అవకాశం ఉంది. దర్శన టిక్కెట్ ఉంటే ఆ నంబర్‌ను నమోదుచేస్తే 6లడ్డూలు వరకు అందుకునే వీలుంది. ఈ విధానంలో భక్తులు చేతిలో డబ్బులు లేకున్నా కియోస్క్‌ల ద్వారా యుపిఐ స్కానర్‌తో నగదు చెల్లింపులు జరిపి, కౌంటర్‌ల వద్ద నిరీక్షించే అవసరం లేకుండా లడ్డూలు పొందవచ్చు. ఆదివారం మధ్యాహ్నం నుండి ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ కియోస్క్‌యంత్రాలను తక్కువ సంఖ్యలోనే భక్తులు సేవలు వినియోగించుకున్నారని టిటిడి ఆలయ వర్గాల సమాచారం. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తుల రద్దీ పెరిగిన సమయంలో దర్శనానంతరం లడ్డూప్రసాదాల కోసం కూడా భక్తులు వితరణశాలలో క్యూలలో బారులుతీరడం కనిపిస్తుంది. కౌంటర్ల వద్ద అధిక రద్దీని, నిరీక్షించే సమయాన్ని తగ్గించేందుకు ఈ యంత్రాలు ఉపయోగకరంగా ఉంటాయి. రోజుకు 80వేలమందినుండి 90వేలమంది వరకు భక్తులు కలియుగవైకుంతవాసుడిని దర్శించుకుంటున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో మాత్రమే లడ్డూవితరణశాలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంటుంది.

## ఆర్‌టిసి సిబ్బందిపై దాడులకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు

### డ్రైవర్‌ను పరామర్శించిన ఎండి సజ్జనార్

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టిసి) సిబ్బందిపై దాడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టిజిఎస్‌ఆర్‌టిసి ఎండీ విసి సజ్జనార్ స్పష్టం చేశారు. దుండగుల చేతిలో దాడికి గురైన డ్రైవర్‌ను తార్నాక ఆర్‌టిసి ఆసుపత్రిలో ఎండి సోమవారం పరామర్శించారు. దుండగుల చేతిలో దాడికి గురై తార్నాక ఆర్‌టిసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బండ్లగూడ డిపో డ్రైవర్ విద్యాసాగర్‌ను పరామర్శించి.. అతని ఆరోగ్య పరిస్థితితో పాటు అతనిపై జరిగిన దాడి తీరును అడిగి తెలుసుకున్నారు. గాయపడ్డ డ్రైవర్‌కు సంస్థ పూర్తిగా అండగా ఉంటుందని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. మెహదీపట్నం నుంచి ఎల్బీనగర్ వెళ్తున్న రూట్ నంబర్ 300 ఆర్డినరీ బస్సు కింద బైక్ పడి ఒక గర్భిణి మృతి చెందారు. రోడ్డు పక్కన ఆగి ఉన్న కారు డోర్ ఒక్కసారిగా తెరవడంతో బైక్ అదుపు తప్పి బస్సు వెనుక టైర్ల కింద పడింది.

అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 198 వద్ద ఈ నెల 19న ఈ ప్రమాదం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో ఎలాంటి తప్పు లేకున్నా డ్రైవర్ విద్యాసాగర్‌పై కొందరు విచక్షణరహితంగా దాడి చేశారు. అసభ్యపదజాలంతో దూషిస్తూ తీవ్రంగా కొట్టారు. విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఆర్‌టిసి కానిస్టేబుళ్లు భాస్కర్, ముఫకర్ అలీలు డ్రైవర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అప్పటికే తీవ్ర గాయాలవడంతో అక్కడి నుంచి తార్నాకలోని ఆర్‌టిసి ఆస్పత్రికి డ్రైవర్‌ను తీసుకొచ్చి చికిత్సను అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో తమ డ్రైవర్‌ది ఎలాంటి తప్పులేదని, ప్రజల మధ్య విధులు నిర్వర్తించే ఆర్‌టిసి సిబ్బందిపై దాడి చేయడం బాధాకరమని సజ్జనార్ అన్నారు.

ఈ ఘటనపై ఆర్‌టిసి అధికారుల పిర్యాదు మేరకు దుండగులపై సైబరాబాద్ కమిషనరేట్ అత్తాపూర్ పోలీసులు బీఎన్ఎస్‌లోని 121(1), 126(2), 115(2) 352, 351(2) ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని తెలిపారు. తమ సిబ్బంది ఆత్మస్థైర్యాన్ని దెబ్బతిసే, మనోవేదనకు గురిచేసే ఇలాంటి దాడులను యాజమాన్యం ఏమాత్రం సహించబోదని.. నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని ఎండి విసి సజ్జనార్ హెచ్చరించారు.

## బిసిల రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

### కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలి: మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్




ప్రెస్‌క్లబ్‌లో అభివాదం చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, కుమార్, పల్లె కళ్యాణి, సుర్వియాదయ్యాగౌడ్, వెంకటేష్‌యాదవ్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 23,ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వెనకబడిన తరగతుల ప్రజాప్రతినిధుల వేదిక (బిసిపిఎఫ్)ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రతి హామీని ప్రభు త్వం అమలు చేయాలని లేకుంటే బిసి లను కాంగ్రెస్ మోసం చేసినట్లుగా గుర్తించాల్సి వస్తుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షంలో ప్రధానిని కలవకుండా పార్లమెంట్ లో బిల్లు ఎలా పాస్ అవుతుందని ప్రశ్నించారు. వెంటనే సిఎం అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలిసి బిల్లు పాస్ అయ్యేటట్టు చూడాలన్నారు. అలాగే బిసిల రిజర్వేషన్‌కి చట్టబద్ధత తెచ్చినంకనే ఎలక్షన్స్ పెట్టాలని డిమాండ్ చేశారు. తమిళనాడులో నాడు జయలలిత సిఎంగా ఉన్నప్పుడు అప్పటి ప్రధానితో కొట్లాది రిజర్వేషన్లు సాధించిందని గుర్తుచేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఎన్నో అమలు చేయలేని హామీలను ఇచ్చారని వాటిలో ఒక్కటికూడా అమలు చేయలేదన్నారు. కాంట్రాక్టులో రిజర్వేషన్లు అన్నారు ఇంకా ఎక్కడ అమలు కాలేదని ఆర్థికంగా, సామాజికంగా వెనకబడ్డ బీసీలను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈసమావేశంలో ఎంపీటీసీ ల సంగం అధ్యక్షుడు కుమార్,సర్పంచులు సంఘం అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, ఎంపిపిల సంగం పల్లె కల్యాణి, వెంకటేష్ యాదవ్, మన్నే రాజు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల జాతరలో కల్తీ మద్యం అమ్మకాలపై నిఘా పెట్టండి

### ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** మద్యం అమ్మకాలు పెరుగుతుండటంతో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ అమ్మకాలు, వినియోగం లేకుండా చేయాలని,అప్పుడే రంగారెడ్డి డివిజన్ టార్గెట్లను చేరుకుంటామని రంగారెడ్డి డివిజన్ సమీక్షా సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ ఆదేశించారు.ఢిల్లీ, హర్యానా ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంతాలకు ఎక్కువగా వస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ లిక్కర్‌పై ఎక్సైజ్ సిబ్బందితో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ టీమ్‌లు నిఘా పెట్టి పట్టు కోవాలని, ఫంక్షన్లలో ఎన్‌డీపీఎల్, ఫ్యూరియస్ లిక్కర్ వినియోగాన్ని కఠినంగా వ్యవహరించాలని డిప్యూటీ కమిషనర్ అన్నారు.రాబోయే బోనాల జాతర సందర్భంగా ఫ్యూరియస్, ఎన్‌డీపీఎల్ మద్యాన్ని పూర్తిగా అరికట్టాలని ఆయన సూచించారు.

## డిప్యూటీ తహశీల్దార్ రాజేష్‌ఖన్నాకు అండగా ఉద్యోగుల జెఎసి

### ఆస్పత్రికి వెళ్లి పరామర్శించిన జెఎసి ఛైర్మన్ లచ్చిరెడ్డి

### బిల్లులను మాఫీ చేయించి డిశ్చార్జికి నేతల ఏర్పాటు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** అనారోగ్యంతో ఆస్పత్రి పాలై బిల్లులు చెల్లించలేక తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్న డిప్యూటీ తహశీల్దార్ రాజేష్‌ఖన్నాకు తెలంగాణ ఉద్యోగుల జెఏసి ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి అండగా నిలిచారు. వి.లచ్చిరెడ్డి, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాకతో కలిసి సోమవారం ఆస్పత్రికి వెళ్లి రాజేష్ ఖన్నాను పరామర్శించారు. అప్పటికప్పుడే ఆస్పత్రి బిల్లు సమస్యను కూడా పరిష్కరించి రాజేష్ ఖన్నా డిశ్చార్జికి ఏర్పాట్లు చేశారు. వరంగల్ జిల్లా, నల్లబెల్లి డిప్యూటీ తహశీల్దార్ రాజేష్‌ఖన్నా తీవ్రమైన అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. 25 రోజులకు రూ.20 లక్షలకు పైగా ఆస్పత్రిలో బిల్లు కాగా అప్పటికే రూ.13 లక్షల వరకు కుటుంబ సభ్యులు వివిధ రూపాలలో డబ్బులు తీసుకు వచ్చి బిల్లులను చెల్లించారు. మిగిలిన రూ.7 లక్షలు చెల్లించే పరిస్థితి ఆ కుటుంబానికి లేదు. మిగతా రూ. 7 లక్షలు చెల్లిస్తేనే డిశ్చార్జి చేస్తామని ఆస్పత్రి వారు తెగించి చెప్పారు. రాజేష్ ఖన్నా, అతడి కుటుంబం యొక్క దయానీయ పరిస్థితి తెలుసుకున్న తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, టీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాకతో కలిసి ఆస్పత్రికి వెళ్లి మిగతా చెల్లించాల్సిన రూ.7 లక్షలు చెల్లించకుండానే సెటిల్ (మాఫీ) చేసి రాజేష్ ఖన్నాను డిశ్చార్జి చేసేలా ఏర్పాటు చేశారు.




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిసిపి శ్రీనివాస్

## రూ.30లక్షల విలువైన డ్రగ్స్ పట్టివేత

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. టీ.న్యాబ్, నార్సింగ్ పోలీసుల జాయింట్ ఆపరేషన్‌లో సోమవారం రూ.30లక్షల విలువైన ఎస్టీపీసీ పిల్స్, కొకైన్‌లు పట్టుబడ్డాయి. ఈ మేరకు సోమవారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. నైజీరియన్ నకిలీ పాస్‌పోర్టుతో అక్రమంగా నగరానికి వచ్చి గత కొంత కాలంగా తిష్ట వేశారు. అయితే నాటి నుంచి ఇతను డ్రగ్స్ విక్రయాలే చేస్తున్నాడు. ఈ క్రమంలో మణికొండకు చెందిన ముతా.విస్డం ఒనేకా, మణికొండ కి చెందిన గోపిశెట్టి రాజేష్‌తో పాటు వెస్ట్ గోదావరికి చెందిన బొమ్మ దేవర వీరరాజులు పరిచయం కావడంతో మత్తుపదార్థాల వ్యాపారం గురించి చెప్పాడు. దీంతో అందరు కలిసి దందా కోసం అక్కడే ఓల్గజరీ ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్నారు. గోవా నుంచి డ్రగ్స్ తీసుకవచ్చి నగరంలో అమ్ముతున్నారు. గత నెల మొయినాబాద్ అజీజ్‌నగర్‌లో ఓ ఫాంహౌజ్‌లో నిర్వహించిన రేవ్‌పార్టీకి వీరే డ్రగ్స్ సరఫరా చేశారు. అదేవిధంగా గతనెల 31న కూడా మంగళగిరిలో ఫణిరాజ్‌కు 15గ్రాముల కొకైన్‌ను విక్రయించారు. పోలీసులకు సమాచారం అందడంతో అల్కాపురిలో జాయింట్ ఆపరేషన్ నిర్వహించగా దందా బయటపడింది. అదేవిధంగా వెంటనే అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అదేవిధంగా ఫణిరాజ్, పవిత్రరెడ్డి, సతీష్, సదా శివ, సుధీర్, భానులు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.

## విత్తనోత్పత్తి రైతులకు నష్టపరిహారం చెల్లించండి

### రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని గద్వాల్ జిల్లాలో పత్తి విత్తనోత్పత్తి చేసే రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీడ్ కంపెనీలను రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో సోమవారం సీడ్ కంపెనీలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గద్వాల్ జిల్లాలో




విత్తనోత్పత్తి చేసే రైతులకు జీవోటీ పేరుతో సీడ్ కంపెనీలు మోసం చేస్తున్నాయని కమిషన్ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ఈ నెల 13న జిల్లాలో పర్యటించి రైతుల అభిప్రాయాలు సేకరించామని చెప్పారు. సీడ్ కంపెనీలు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించకుండా రైతుల కోణంలో ఆలోచన చేయాలన్నారు. రైతులతో విత్తనోత్పత్తి చేయించుకోవడంతో పాటు, వారు నష్టపోయిన సమయంలో ఆదుకోవాల్సిన బాధ్యత సీడ్ కంపెనీలపై ఉందని స్పష్టంచేశారు. రైతులతో ఆర్గనైజర్లు వడ్డీ వ్యాపారం చేయడం నేరమని హెచ్చరించారు. విత్తనోత్పత్తి కోసం సీడ్ కంపెనీలు రైతులకు ఇచ్చిన విత్తనమే జివోటి పరీక్షలో ఎట్లా ఫెయిల్ అవుతుందని ప్రశ్నించారు.



## చిన్నారులను వదలని 'కామాంధుల్లు'

### ఆప్యాయతతో దగ్గరై లైంగికదాడులు

### మంటగలుస్తున్న మానవత్వం

### గతేడాది బాలికలపై వేధింపుల కేసులు 468

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** అభంశుభం తెలియని పసిపాపలపై ఏడుపదుల వయస్సు వారు మానవత్వాన్ని మంట కలేసేలా వ్యవహరిస్తున్నారు. వావీ వరుసలు మరిచి కామంధులు వాంఛకోరికలకు ఎగబడుతున్నారు. మనిషి అనేది ఆలోచించకుండా చిన్నారీ బాలికలపై క్రూరమృగాలుగా లైంగికదాడులకు తెగబడుతున్నారు. కేవలం చాక్లెట్ల ఆశ, పెద్దయాన అని పలుకరింపులకే మొగ్గుచూపుతున్న పసిపిల్లలపై ప్రబుద్ధులు లైంగికదాడులకు పాల్పడడంతో పాటు హత్యలు సైతం చేస్తున్నారు. మానని గాయాన్ని చేసి జీవితానికి మాయని మచ్చగా మిగులుస్తున్నారు. గతేడాదిలో ఏకంగా బాలికల లైంగిక వేధింపుల్లో 468 మందిపై (పోక్సో) కేసులు నమోదయినట్లు పోలీసులు చెబుతున్నారు. ఇరుగుపొరుగు, పరిచయస్తులు, బంధువులే కీచక ఘటనల్లో అధికంగా ఉండడం మాయని మచ్చ. చిన్నారుల మానసిక ప్రవర్తనను తల్లిదండ్రులు గుర్తించడం ద్వారా కేసులు వెలుగు చూస్తున్నాయి. ఇంకా పరువు పోతుందని అనేవి మరెన్నో..

**గతేడాది వందల్లో కేసులు..**

రాష్ట్రవ్యాప్తంగా గత ఏడాది వ్యవధిలో చిన్నారులు, బాలికలు, యువతులపై ఏకంగా 468 లైంగిక వేధింపుల (పోక్సో) కేసులు నమోదయ్యాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మూడేళ్లుగా ఓ చిన్నారి, తన తండ్రి ప్రవర్తనను గమనించకపోయింది. అయితే దుబాయ్ నుంచి వచ్చిన ఆమె తల్లి బిడ్డ పరిస్థితిని పరిశీలించి ఏమైందని అడిగితే, జరిగిన విషయాన్ని చెప్పింది. ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడయిన తండ్రిని అరెస్టు చేశారు. ఆ బాలికను నిపుణుల పర్యవేక్షణలో కౌన్సెలింగ్ నిర్వహించగా, ఇప్పుడిప్పుడే ఆమె సాధారణస్థితికి వస్తుందని ఓ పోలీసు అధికారి తెలిపారు. పదేళ్ల చిన్నారి, వరసకు అన్నయ్యే కదా! అని బైక్‌పై అతనితో బయటకు వెళ్తే లైంగిక దాడికి గురైంది. ఇక నగర శివారులో అశ్లీల వీడియోలకు అలవాటుపడిన కన్నతండ్రి, తన కుమార్తెపై నే లైంగికదాడి చేయబోయాడు. మరొకటి 70ఏళ్ల వృద్ధుడు ఇంటిపక్కన ఆడుకుంటున్న బాలికపై కన్నేసి లైంగికదాడికి యత్నిం చాడు. ఇవి మచ్చుకు కొన్ని ఉదాంతాలేనని శిశు సంక్షేమ శాఖ వెల్లడించాయి.

గత ఏడాదిలో చిన్నారులపై లైంగిక వేధింపుల కేసులు ఎక్కువగా మహబూబ్‌నగర్ జిల్లాలో నమోదయ్యాయి. సఖి వన్‌స్టాప్ కేంద్రాలలో 59 కేసులు ఉన్నాయి. కొత్తగూడెం, మంచిర్యాల జిల్లాల్లో ఒక్కో కేసు ఉండగా 10 లోపు మెదక్ (8), ములుగు (6), కరీంనగర్ (6), భూపాలపల్లి (5), సూర్యాపేట (5), ఖమ్మం (4), ఆసిఫాబాద్ (3), పెద్దపల్లి (3), జనగాం (3), మహబూబాబాద్ (3), వరంగల్ రూరల్ (2), వరంగల్ అర్బన్ (2) జిల్లాల్లో ఉన్నాయి.

**ఆడపిల్లలకు మొదటి స్నేహితురాలు తల్లియే..**

మొదటి ఏడాది నుంచి పరిపక్వత వచ్చే ఇరవై ఏళ్ల వరకు ఆడపిల్లలకు మొదటి స్నేహితురాలు, గురువు తల్లియే కావాలని మనసత్వ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కామవాంఛలో అధికంగా తెలిసిన వారు, బంధువులు, పరిచయస్తులే అధికంగా ఉంటున్నారు. పిల్లలు కూడా మనవారే అనుకొని తేలిగ్గా నమ్ముతున్నారు. వారి దుర్బుద్ధి పసిగట్టలేకపోతున్నారు. ఆడపిల్లల వ్యవహారశైలీ, ప్రవర్తనను నిత్యం గమనించి సమాజస్థితిగతులు చెప్పాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత కాలానుగుణంగా తల్లియే స్నేహభావంతో పిల్లలతో మెలుగుతూ రోజువారి విషయాలు తెలుసుకునే ప్రయత్నం చేయాలని సైకాలాజిస్ట్ దయానంద్ శర్మ వెల్లడించారు. ఎవరైనా ఇబ్బందికరంగా ప్రవర్తించినట్టు గుర్తిస్తే తమతో పంచుకోవాలని తల్లిదండ్రులు ధైర్యాన్నివ్వాలి. కన్నవారితో పంచుకుంటే తమనే ఏమైనా అంటారేమోనన్న అభద్రతాభావాన్ని వారి నుంచి దూరం చేయాలి. లైంగిక వేధింపులు, దాడులు గురించి ఇంట్లో, పాఠశాలల్లో కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఎలా తప్పించుకోవాలి, ఎలా సహాయం పొందాలన్నది నేర్పించాలి.

## పహల్గాంకు సందర్శకుల తాకిడి

### జమ్మూకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా సంతోషం

**జమ్మూకశ్మీర్, జూన్ 23:** జమ్ముకశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం పహల్గాంలో గల మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరాన్ వ్యాలీలో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడితో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ముష్కరులు సృష్టించిన నరమేధంలో 26 మంది బలయ్యారు. అయితే ఈ దాడి తర్వాత జనం ఆ ప్రాంతానికి వెళ్లేందుకు భయపడ్డారు. దీంతో పర్యాటకులు లేక వ్యాలీ మొత్తం ఇన్ని రోజులూ వెలవెలబోయింది. అయితే ఇప్పుడు మళ్లీ అక్కడ సందడి వాతావరణం నెలకొంది. పెద్ద ఎత్తున టూరిస్ట్‌లు పహల్గాం బాట పట్టారు. ఆ ప్రాంతానికి పర్యాటకులు క్యూ కడుతున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఎక్స్ వేదికగా షేర్ చేశారు. పహల్గాంలో మళ్లీ సందడి నెలకొన్నట్లు పేర్కొన్నారు.

# 'పెద్ది' హ్యూజ్ యాక్షన్ నైట్ సీక్వెన్స్ షూటింగ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్ఇండియా ప్రాజెక్ట్ పెద్ది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్‌తో దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. పవర్ ఫుల్ కొలాబరేషన్, అద్భుతమైన టీంతో పెద్ది భారతీయ సినిమాలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడానికి సిద్ధంగా ఉంది. ప్రముఖ పాన్ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్ పై భారీ స్థాయి లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం భారీ యాక్షన్ నైట్ సీక్వెన్స్ షూటింగ్ జరుగుతోంది. స్టార్ డీవోపీ రత్నవేలు ఖిపెద్దిఖి సెట్స్ నుంచి పవర్ ఫుల్ మోమెంట్‌ను షేర్ చేశారు. గ్లోబల్ స్టార్‌తో భారీ నైట్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నట్లు తెలియజేశారు. డీవోపీ రత్నవేలు షేర్ చేసిన స్టిల్ లో రామ్ చరణ్ ఇంటెన్స్ అండ్ బీస్ట్ మోడ్‌లో కనిపించారు. ప్రస్తుతం ఈ స్టిల్ సోషల్ మీడియాలో వైరల్ 'పెద్ది' హ్యూజ్ యాక్షన్ నైట్ సీక్వెన్స్ షూటింగ్‌అవుతోంది. సినిమాలో ఈ సీక్వెన్స్ మేజర్ హైలెట్‌గా ఉండబోతోంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. చిత్రానికి స్టార్ డివోపీ ఆర్.రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రెహ్మాన్ సంగీతం



అందిస్తున్నారు. జాతీయ అవార్డు గెలుచుకున్న నవీన్ నూలి ఎడిటర్. వినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేశారు. ఈ చిత్రం 2026 మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజున ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తారాగణం: రామ్ చరణ్, జాన్వి కపూర్, శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: బుచ్చి బాబు సానా, సమర్పణ: మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్: వృద్ధి సినిమాస్, నిర్మాత: వెంకట సతీష్ కిలారు సంగీతం: ఎఆర్ రెహమాన్, డిఒపి: ఆర్ రత్నవేలు ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, ఎడిటర్: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్: ఫస్ట్ షో పీఆర్వో: వంశీ శేఖర్.

# ఆడియన్స్‌ను ఆకట్టుకున్న కుబేర: మెగాస్టార్ ప్రశంసలు

సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున, రష్మికమందన్న లేటెస్ట్ యునినామస్ బ్లాక్ బస్టర్ శేఖర్ కమ్ముల కుబేర. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎస్‌విసిఎల్‌ఎల్‌పిపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని హై బడ్జెట్ హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మించారు. కుబేర తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలై యునానిమస్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని హౌస్ ఫుల్ బుకింగ్స్‌తో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ బ్లాక్ బస్టర్ కుబేర సక్సెస్



మీట్ నిర్వహించారు. మెగాస్టార్ చిరంజీవి చీఫ్ గెస్ట్‌గా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది. బ్లాక్ బస్టర్ కుబేర సక్సెస్ మీట్‌లో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఇది నా సక్సెస్ మీట్ లా అనిపిస్తుంది. అలాంటి ఆనందాన్ని ఇక్కడ పొందుతున్నాను. ఇక్కడ ఉన్నవాళ్లంతా నాకు కావలసిన వాళ్లు. వాళ్ళ మొహంలో ఆనందం చూస్తుంటే ఇది నా సక్సెస్ మీట్ అనిపిస్తోంది. ఇక్కడకి నేను గెస్ట్‌గా రాలేదు. మీలో ఒకడిగా, ఆత్మీయుడుగా వచ్చాను. నాగార్జున ఈ సినిమాకు ముందు ఒకసారి కలిశారు. కుబేర గురించి అడిగాను. ఇందులో ఒకడిఫరెంట్ క్యారెక్టర్ చేశాను. ధనుష్ లీడ్ క్యారెక్టర్ అని చెప్పారు. ఎలా ఒప్పుకున్నావు అని అడిగాను. నాకు ఎక్కడో డిఫరెంట్‌గా చేయాలని ఉంది. కొత్త గేట్స్ ఓపెన్ చేయాలనిపిస్తుంది అలా ఈ సినిమాఉపయోగపడుతుందని చెప్పారు. నేను సినిమా చూశాను. ఆయన చెప్పినది 100శాతం కరెక్ట్. ఈ సినిమా తర్వాత తను మరో 40 ఏళ్లు అద్భుతంగా రాణిస్తారనేది వాస్తవం. ఈ క్యారెక్టర్ శేఖర్ రాయడం, అది నాగార్జున గారుప్పుకొని చేయడం ఇదే ఫస్ట్ సక్సెస్‌గా భావిస్తున్నాను. దేవ క్యారెక్టర్‌లో ధనుస్‌ని తప్ప ఇంకెవరిని ఊహించుకోలేం. ఆక్యారెక్టర్ చూసిన తర్వాత అలా అనిపించింది. సినిమా చూస్తున్నప్పుడు ధనుష్‌ని గుర్తించలేకపోయాను. అంతలా క్యారెక్టర్‌లో ఇన్వాల్వ్ అయిపోయారు. ఈ సినిమాని ఒక సినిమాలా కాకుండా ఒక ఎక్స్పీరియన్స్ లా చూశాను. వాస్తవంగా జరుగుతున్నట్టుగా అనిపించింది. ఒక్కొక్క సినిమాని ఆణిముత్యం లాగా చేస్తూ ప్రేక్షకుల గుండెల్లో ఒక సుస్థిరమైన స్థానాన్ని ఏర్పరచుకున్నా శేఖర్ కమ్ముల. స్టేట్ రౌడీ షూటింగ్ జరుగుతున్నప్పుడు శేఖర్ కమ్ముల నన్ను ఓ అభిమాని లా కలిశారు. ఆరోజే సినిమా ఇండస్ట్రీలో స్థిరపడిపోవాలని నిర్ణయించుకున్నారు. ఈరోజు ఇలాంటి ఆణిముత్యాలు లాంటి సినిమాలు తీసి ప్రేక్షకుల మన్ననలని పొందుతున్న దర్శకుడిగా ఆయన ఉండడం నిజంగా నాకు చాలా గర్వంగా ఉంది. ఈ సిల్వర్ జూబ్లీ ఇయర్ సందర్భంగా ఆయనకి మరొకసారి నా అభినందనలు తెలియజేస్తున్నాను. శేఖర్‌కమ్ముల సినిమాలో వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. ఈ సినిమాల పాత్రలు కూడా దేవ దీపక్ అనే గుర్తు పెట్టుకుంటాం. నాగ్ అనుకున్నట్లుగా ఇది ఆయనకి మరో డోర్ ఓపెన్ అయింది. మరిన్ని ఫెంటాస్టిక్ క్యారెక్టర్స్ ఆయనకి వస్తాయి. ఆయన దోవలో కూడా నేను వస్తానని అనుకుంటున్నాను.

# మాళవికకు 'పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్' అవార్డ్

బ్యూటిఫుల్ టాలెంటెడ్ హీరోయిన్ మాళవికమోహనన్ మరో ఘనత దక్కించుకుంది. ఆమె ముంబైలో జరిగిన ఐడబ్ల్యూఎంబజ్ డిజిటల్ అవార్డ్స్‌లో పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్‌గా అవార్డ్ దక్కించు కుంది. ఓటీటీ, వెబ్ ఎంటర్‌టైన్ మెంట్‌కు సంబంధించిన బిగ్గెస్ట్‌అవార్డ్స్‌గా ఈ సంస్థకు పేరుంది. ఐడబ్ల్యూఎంబజ్ డిజిటల్ అవార్డ్స్ ఈవెంట్ లో రెడ్ కార్పెట్‌పై నడిచిన మాళవిక మోహనన్ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మాళవిక మోహనన్ ప్రస్తుతం ప్రభాస్ సరసన రాజా సాబ్ చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాతో ఆమె టాలీవుడ్‌లోకి గ్రాండ్‌ఎంట్రీఇస్తోంది. రీసెంట్‌గా రిలీజ్ చేసిన రాజా సాబ్ టీజర్‌లో మాళవిక స్టన్నింగ్ లుక్స్‌తో



ఆకట్టుకుంది. ఈ సినిమాతో తెలుగు ఆడియెన్స్‌కు మరింత దగ్గర కానుంది మాళవిక.

# ఆగస్టు 30న దుబాయ్‌లో 'గామా' అవార్డ్స్

ఆగస్టు 30న టాలీవుడ్ అవార్డ్స్‌తో పాటు ఆగస్టు 29న ఎక్సలెన్స్ అవార్డ్స్ వేడుకను నిర్వహించేలా భారీ సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి టాలీవుడ్ హీరోలు సిద్దు జొన్నలగడ్డ, తేజ సజ్జ, కిరణ్ అబ్బవరం, శ్రీ విష్ణు, రోషన్.. హీరోయిన్స్ మీనాక్షిచౌదరి, దక్ష నాగర్కర్‌తో పాటు.. తెలుగు చలనచిత్ర పరిశ్రమ నుంచి అగ్ర కథానాయకులు, టాప్ టెక్నీషియన్స్ పాల్గొనబోతున్నారు. అలాగే హీరోయిన్స్ ఊర్వశి రౌతేలా, కేతిక శర్మ, ఫరియా అబ్దుల్లా, ప్రియా హెగ్డే, శ్రీదేవి స్పెషల్ పర్ఫార్మెన్స్‌లతో అలరించనున్నారు. ప్రత్యేక అతిథులుగా బ్రహ్మానందం, దర్శకులు సుకుమార్, బుచ్చి బాబు, బాబీ, సాయి రాజేష్, సంగీత దర్శకులు దేవిశ్రీప్రసాద్, తమన్, నిర్మాతలు అశ్విని దత్, డివివి దానయ్య, చంద్రబోస్, వెన్నెల కిషోర్ తదితర ప్రముఖులు హాజరవనున్నారు. వీరితో పాటు పలువురు టాలీవుడ్ అగ్రశ్రేణి నటీనటులు సర్ ప్రైజ్ గెస్ట్ లుగా హాజరు కానున్నారు. అతిరథ ప్రముఖుల మధ్య



అంగరంగ వైభవంగా జరగనున్న ఈఅవార్డ్స్ వేడుక కోసం చిత్ర పరిశ్రమతో పాటు ప్రేక్షకులు సైతం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తు న్నారు. టాలీవుడ్ 24 క్రాఫ్ట్స్‌కు ఈ అవార్డ్స్‌ను అందించనున్నారు. 2024లో విడుదలైన చిత్రాల్లో నామినేటె అయిన విభాగాలకు, పబ్లిక్ ఓటింగ్ ప్రక్రియ ద్వారా సెలెక్ట్ చేస్తున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఈ వేడుకకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంగీత, కళా రంగ ప్రముఖులు, ప్రతిభావంతులు, సినీ పరిశ్రమకు చెందిన లెజెండ్స్ ఈ గామా అవార్డ్స్ 2025 లో పాల్గొననున్నారు. ఈ ఏడాది కూడా పలు పాపులర్ చిత్రాలు, స్టార్ హీరోలు, స్టార్ హీరోయిన్స్, టాప్ టెక్నీషియన్స్ గామా అవార్డులను అందుకోనున్నారు. ఇటీవల ఈ కార్యక్రమానికి సంబంధించి గ్రాండ్ రివీల్ ఈవెంట్‌ను దుబాయ్‌లో నిర్వహించగా అద్భుతమైన స్పందన వచ్చింది. మైత్రి ఫార్మ్‌లో గామా అవార్డ్స్ 5వ ఎడిషన్ టిక్కెట్లను మహిళలు విడుదల చేశారు. గామా అవార్డ్స్ 2025 జ్యూరీ చైర్ పర్సన్స్ ప్రముఖ సినీ దర్శకులు ఏ.కొదండ రామిరెడ్డి, ప్రముఖ సంగీత దర్శకులు కోటి, ప్రముఖ సినీ దర్శకులు బి. గోపాల్ ఆధ్వర్యంలో వివిధ రంగాలకు ఎంపిక అయిన టాలీవుడ్ కళాకారులకు, సినిమాలకు గామా అవార్డ్స్ బహూకరించబడతాయి.

# 'డ్యూడ్' నుంచి మమిత బైజూ స్పెషల్ బర్త్‌డే పోస్టర్

వరుస విజయాలతో దూసుకుపోతున్న యంగ్ సెన్‌సేషన్ ప్రదీప్ రంగనాథన్ ప్రస్తుతం మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రం డ్యూడ్‌లో నటిస్తున్నారు. కీర్తిశ్వరన్ దర్శకత్వంలో ఈ చిత్రం యువతకు నచ్చే ఎంటర్టైనర్‌గా ఉండనుంది. ప్రదీప్‌కు జోడీగా ప్రేమలు ఫేమ్ మమిత బైజూ కథానాయికగా నటిస్తుండగా, సీనియర్ నటుడు శరత్ కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రదీప్ రంగనాథన్, మమిత బైజూకు ఫస్ట్‌లుక్ పోస్టర్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ మమిత బైజూ బర్త్ డే విషెస్‌ని అందిస్తూ ఆమె పాత్రని కురళ్‌గా పరిచయం చేస్తూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో మమిత బైజూ తన బ్యూటీ అండ్ చార్మ్‌తో కట్టిపడేశారు. ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రేమలులో తన ఎనర్జిటిక్ పెర్ఫామెన్స్‌తో క్రేజ్ తెచ్చుకున్న మమిత డ్యూడ్‌తో అద్భుతంగా అలరించడానికి రెడీ అవుతున్నారు. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. యంగ్ సెన్సేషన్ సాయి అభ్యాంకర్ మ్యూజిక్ అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. లతా నాయుడు ప్రొడక్షన్ డిజైనర్‌గా, భరత్ విక్రమన్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ప్రొడక్షన్ ఇప్పటికే పూర్తి స్థాయిలో జరుగుతుండటంతో దీపావళికి సరైన ఎంటర్టైనర్‌ను అందించడానికి టీం జెట్ స్పీడ్‌లో వర్క్ చేస్తోంది. డ్యూడ్ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో విడుదల కానుంది. తారాగణం: ప్రదీప్ రంగనాథన్, శరత్ కుమార్, మమిత బైజు, హృదు హారూన్, ద్రవిడ్ సెల్వం, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: కీర్తిశ్వరన్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్ సిఇఒ: చెర్రీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనిల్‌యెర్నేని, సంగీతం: సాయి అభ్యంకర్, సినిమాటోగ్రాఫర్: నికేత్ బొమ్మి, ప్రొడక్షన్ డిజైనర్: లతానాయుడు.





శ్రీలీల నయా లుక్

# ప్రిన్స్ హీరోగా నూతన చిత్రం షురూ

హీరో ప్రిన్స్, సుహానా ముద్వాన్ హీరోయిన్‌గా, సునైనా, నెల్లూరు సుదర్శన్, ప్రధాన పాత్రలలో కుమార్ రవికంటి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ అయిన లైట్ స్టోర్మ్ సెల్లులోయిడ్స్‌పై కుమార్ రవి కంటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కెఎల్ స్టూడియోలో జరిగిన పూజా కార్యక్రమాలకు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరు అయ్యారు. చిత్ర బృందాన్ని అభినందించారు. కుమార్ రవి కంటి మాట్లాడుతూ, ఈ చిత్రం జూన్ జూలై మరియు ఆగస్ట్‌లో ఏకధాటిగా సినిమా చిత్రీకరణ జరుపుకుని విదేశాలలో సాంగ్స్ షూటింగ్ జరుపుకోనుంది. అద్భుతమైన సాంకేతిక విలువలు



కలిగిన చిత్రం ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ బేబీ దియ రవికంటి కొట్టారు మరియు కెమెరా స్విచ్ ఆన్ శ్రీమతి సుమ రవికంటి, బేబీ మాయ రవికంటి మొదటి దర్శకత్వం వహించారు. ఇన్వెస్టిగేషన్ అండ్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికగా ఈ సినిమా రూపుదిద్దుకోనున్నట్లు చిత్ర బృందం తెలిపింది. నటీనటులు: ప్రిన్స్, సుహాన ముద్వాన్, సునైనా, నెల్లూరు సుదర్శన్, సతీష్ సారెపల్లి, శ్రీమని సాంకేతిక నిపుణులు: బ్యానర్: లైట్ స్టోర్మ్ సెల్లులోయిడ్స్, నిర్మాత: కుమార్ రవికంటి, రచన, దర్శకత్వం: కుమార్ రవికంటి, కెమెరామెన్: జి.అమర్, మాటలు: భవాని ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: అర్జున్ సూరిశెట్టి కో డైరెక్టర్: జే.జి.రాజు, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: భిక్షపతి తుమ్మల, పీఆర్ఒ: శ్రీపాల్ చొల్లేటి.

# 'ఐకాన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్స్' ప్రదానం

వివిధ రంగాల్లో ప్రతిభ చూపించిన వారి కృషికి మంచి గుర్తింపు ఇవ్వాలనే ప్రయత్నంతో విజన్ స్టూడియోస్ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఐకాన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 పేరుతో అవార్డ్స్ అందించారు. సినీ, విద్యా, వైద్యం, రియల్ ఎస్టేట్..ఇలా పలు రంగాల్లో ఈ అవార్డ్స్ అందించారు. విజన్ స్టూడియోస్ వారు మొదటి సారిగా నిర్వహించిన ఈ అవార్డ్స్ ఈవెంట్ హైదరాబాద్ లోని ఓహోటల్లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సినీ రంగంతో పాటు ఇతర రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఈ ఈవెంట్‌లో అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రమేష్ కింద స్థాయి నుంచి ఎదిగిన వ్యక్తి. పట్టుదలతో కష్టపడే తత్వం కలవాడు. ఆయన విజన్ స్టూడియోస్ స్థాపించి 11 ఏళ్లుగా సక్సెస్‌ఫుల్‌గా నిర్వహిస్తున్నాడు. ఈ అవార్డ్స్ కార్యక్రమానికి అతిథిగా రావడం సంతోషంగా ఉంది. హైదరాబాద్‌ను



బాలీవుడ్‌సహా అన్ని సినిమాలకు కేంద్రంగా మార్చాలని తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు హైదరాబాద్‌లో సినీ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయబోతున్నాం. హైదరాబాద్ ఇన్ ఛార్జ్ మంత్రిగా నేను ఆ బాధ్యత వహిస్తాను. విజన్ స్టూడియోస్‌లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ నా అభినందనలు తెలియజేస్తున్నా అన్నారు. విజన్ స్టూడియోస్ అధినేత రమేష్ మాట్లాడుతూ, కింద స్థాయి నుంచి నా ప్రస్థానం మొదలైంది. చిన్న బిజినెస్ నుంచి స్టూడియో స్థాపించే దాకా ఒక లక్ష్యంతో పట్టుదలగా పనిచేశాను.

# 'మిత్ర మండలి' నుంచి ఫస్ట్ సాంగ్

బన్నీ వాస్ నూతన నిర్మాణ సంస్థ బి.వి. వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం మిత్ర మండలి. అభిరుచి గల నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంతో సోషల్‌మీడియా సంచలనం నిహారిక ఎన్.ఎం. తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. నూతనదర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన టీజర్‌కు విశేష స్పందన లభించింది. ఈ చిత్రం అపరిమిత వినోదాన్ని అందించనుందనే నమ్మకాన్ని టీజర్ కలిగించింది. తాజాగా మిత్ర మండలి నుంచి మొదటి గీతం కత్తందుకో జానకిని నిర్మాతలు విడుదల చేశారు. రెబల్ స్టార్ కృష్ణంరాజు ఐకానిక్ డైలాగ్ కత్తందుకో జానకిని తీసుకొని, ఈ తరం మెచ్చేలా అద్భుతమైన పాటగా మలిచారు. ఆర్.ఆర్. ధృవన్ స్వరపరిచిన ఈ గీతం.. వినసొంపుగా, అందరూ సరదాగా పాడుకునేలా ఉంది. కాసర్ల శ్యామ్ మరోసారి తన కలం బలం చూపించారు. ఈ సరదా గీతాన్ని ఎంతో అందంగా, అర్థవంతంగా వ్రాశారు. ఇక రాహుల్ సిప్లిగంజ్ తన గాత్రంతో పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. మిత్ర మండలి మొదటి గీతం ఖికత్తందుకో జానకిఖికి అద్భుతమైన స్పందన లభిస్తోంది. ప్రధాన పాత్రధారులు ప్రియదర్శి, విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరాల ప్రపంచాన్ని పరిచయం చేస్తూ గీతం సాగింది. తమ గురించి తాము ఉల్లాసంగా పాడుతూ.. నేటి జెన్‌జెడ్ అలవాట్లయిన రీల్స్, రిలేషన్స్, పబ్జీ గేమింగ్ ఇలా ప్రతిదానిని ప్రస్తావిస్తూ కత్తందుకో జానకి గీతం నడిచిన తీరు కట్టిపడేసింది. ఓ వైపు యువత తమ అలవాట్లను చెప్పుకుంటుంటే, మరోవైపు తల్లిదండ్రులు వారిని తరుముతూ కత్తందుకో జానకి అనడం ఆకట్టుకుంది. అమలాపురం కిమ్స్ కాలేజ్ లో జరిగిన కత్తందుకో జానకి గీతావిష్కరణ వేడుకకు ముఖ్య అతిథిగా అమలాపురం ఎంపీ జి.ఎం. హరీష్ బాలయోగి హాజరయ్యారు. అలాగే కిమ్స్ చైర్మన్ చైతన్య రాజు, ఎండీ రవివర్మ ఈ వేడుకలో పాల్గొన్నారు. ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో చిత్ర సమర్పకులు బన్నీ వాస్, నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల, నటీనటులు ప్రియదర్శి, నిహారిక, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా, దర్శకుడు విజయేందర్ ఎస్, సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధృవన్ తదితరులు సందడి చేశారు. కత్తందుకో జానకి గీతం యువత మెచ్చేలా ఉందని ప్రశంసించిన అతిథులు.. మిత్ర మండలి సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధలన్నీ మర్చిపోయి, థియేటర్లలో మనస్ఫూర్తిగా నవ్వుకునేలా మిత్ర మండలి సినిమా ఉంటుందని చిత్ర యూనిట్ తెలిపింది.



# కళాకారులకు ఆర్థికసాయం


సుస్మిత

**గొప్ప కళలకు పుట్టనిల్లు భారతదేశం. అలాంటిది ఇక్కడే ప్రాచీన కళలు అంతరించిపోతుంటే తట్టుకోలేక పోయారు సుస్మితా కనేరి. అందుకు తన ఉద్యోగాన్ని సైతం పక్కనపెట్టి 'గుల్లక్ క్రౌడ్ ఫండింగ్' ద్వారా విరాళాలు సేకరిస్తున్నారు. వాటిలో అంతరించి పోతున్న కళలకు ప్రాణం పోస్తున్నారు.**

సుస్మిత పుట్టిపెరిగింది మహారాష్ట్రలోని పుణె. అక్కడే విట్ కాలేజీలో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. వృత్తి రీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయినప్పటికి కళలపై మక్కువ ఎక్కువ. సుస్మితకి చిన్నప్పటినుంచి సేవ చేయడం ఇష్టం. దీంతో చదువుకుంటున్న రోజుల్లోనే అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించేవారు. అంతేకాదు, 'క్రౌడ్ ఫండింగ్' పేరుతో విరాళాలు సేకరించి అనాథ పిల్లలకు చదవు చెప్పించడం, పుస్తకాలు కొనివ్వడం చేసేవారీమె. 2021లో నిర్మల్ పెయింటింగ్స్‌ని చూడటానికి తెలంగాణ వచ్చారు. బొమ్మలే కథ మొత్తాన్ని చెప్పే ఈ ఆర్ట్ తనకెంతో నచ్చిందట. దాంతో వాటి చరిత్ర తయారీ విధానం అడిగి తెలుసుకున్నారట. ఈ కళను మీ పిల్లలకు నేర్పిస్తున్నారా? మీ తర్వాత వారు దాన్ని కొనసాగిస్తారా? అని అడిగా ఆయన వెంటనే 'నాలా నా పిల్లలు కూడా కష్టపడాలా? వాళ్లు ఉద్యోగం చేస్తారు. ఆదాయం లేదు సరే, విలువలేని పని చేయడం ఎందుకు? అంటూ బాధ పడ్డాడు. చేతివృత్తులు చేసే అందరూ ఇలానే అనుకుంటే కొన్నాళ్లకు ఈ కళలు అంతరించిపోతాయి. అందుకే ఆ కళలకు ప్రాణం పోయాలనుకున్నా అంటారామె. అందుకే చేతివృత్తుల వారికి ఉపాధి కల్పించాలనుకున్నారు.

**గుల్లక్.. ఇద్దరి మధ్యా వారధి...** నగరవాసులు వైవిధ్యభరిత కళలతో ఇంటి సొబగులు కోరుకుంటున్నారు. వాళ్లకు నేరుగా కళాకారుల ఉత్పత్తులు అందేలా చేస్తే ఇద్దరికీ మేలని భావించి 'గులాకరీ.ఓఆర్‌జీ'ని ఏర్పాటు చేశారు. సంప్రదాయ, గిరిజన, చేతి కళలలో నైపుణ్యం ఉండి ఆదరణ కరమైన కళాకారులకి ఇది ఓ మంచి వేదిక. ఇందులో సంప్రదాయ, గిరిజన కళాఖండాలను ఆన్‌లైన్‌లో ఉంచుతారు. నచ్చినవారు వాటిని కొనుగోలు చేసుకుంటారు. ఈ రకంగా కళాకారులని, కష్టమర్లని ఏకం చేస్తున్నారీమె. ఓ పక్క వారికి ఉపాధి



కల్పిస్తూనే కళలను కాపాడుతున్నారు. అంతేకాదు, గులక్ క్రౌడ్ ఫండింగ్‌తో విరాళాలు సేకరించి ఉపాధి కోల్పోయిన కళాకారులకు ఆర్థికసాయం అందిస్తున్నారు సుస్మితా కనేరి. ◻

# రొట్టెలతో ఉపాధి పొందుతూ..

**జొన్న లేదా సజ్జ పిండితో రొట్టెలు వేరుశనగ పొడి, ఇంకా పెరుగు కలబురగిలోని మహిళల రోజువారీ వంటలో ఇవి తప్పనిసరి పూరి గుడిసె. డాబా అన్న తేడా లేదు. కానీ అవే ఇప్పుడు వారిని ఆదుకునే మార్గమవుతాయని అక్కడి మహిళలూ ఊహించి ఉండరు వారిని ఆర్థిక స్వావలంబన దిశగా నడిపిస్తోన్న ఆ కలబురగి రొట్టె గూర్చి తెలుసుకుందాం.**

ఒకరికి అనారోగ్య సమస్యలు మరొకరికి పిల్లల చదువులెలా అన్న బెంగ. ఇంకొకరికి ఇల్లు ఎలా గడ పాలో తెలియక తికమక. ఏడాదిన్నర క్రితం వరకూ కర్ణాటకలోని కలబురగి జిల్లా మహిళల జీవన సమస్యలివి. కర్ణాటకలోనే కాదు దేశంలోనే అత్యంత వెనకబడిన జిల్లాల్లో కలబురగి ఒకటి మహిళల మహిళతో మాట్లాడారు. రోజువారీ ఎంత సంపాదిస్తారో కనుక్కున్నారు. వచ్చేది నామమాత్రపు మొత్తమే. దీంతో వీటికి ఒక నబ్రాండ్ సృష్టిస్తే ఈ మహిళల ఆదాయాన్ని మరింత పెంచొచ్చు అన్న ఆలోచనను జిల్లా మంతి ప్రయింక్ ఖర్గేతో పంచుకున్నారు. ఆపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో వ్యాపార



అక్షరాస్యత చాలా తక్కువ అత్యల్ప వర్షపాతం కారణంగా ఇక్కడ ప్రధాన వ్యవసాయ పంట చిరుధాన్యాలే. దీంతో ఇక్కడి ఆహారం రొట్టెలే. వారి ఆకలి తీర్చే ఆ ఆహారమే ఆర్థిక చైతన్యానికి కారణమైంది. ఇందుకు పునాది వేసింది అక్కడి జిల్లా యంత్రాంగమే అక్కడి మహిళలకు బాగా తెలిసిన రొట్టెల తయారీతోనే ఉపాధి మార్గాన్ని చూసి ఓ బ్రాండ్‌ని సృష్టించి పేద మహిళలను భాగస్వాములుగా చేసింది. జిల్లాలోని ఏడు తాలూకాల్లో 175కుపైగా మహిళా స్వయం సహాయక బృందాలతో కలబురగి రొట్టె ఉత్పాదక సహకార సంఘాన్ని ఏర్పాటు చేసింది.


**అలా మొదలైంది....** కలబురగి జిల్లా కలెక్టర్ ఫౌజియా తరను ఓసారి నగర పర్యటనలో భాగంగా కారులో వెళ్తున్నప్పుడు ప్రతి బస్టాండ్ వద్ద కొందరు మహిళలు రొట్టెలను విక్రయించడం గమనించారు. వాటిని కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు కొంటుండటం చూసి.. ఓ ప్రణాళిక సిద్ధం చేయించి. 2024 నవంబరులో కలబురగి రొట్టె బ్రాండ్‌ను ఆవిష్కరించారు. సాధారణంగా కర్ణాటక వ్యాప్తంగా ఉత్తర కర్ణాటక వంటకాలకు ప్రసిద్ధి చెందిన హోటళ్లు, రెస్టరంట్లలో కలబురగి, విజయపుర బీదర్ వంటి జిల్లాల మహిళలు పని చేస్తుంటారు. అలా పొట్ట కూటికోసం వలసల వాళ్ల ఈ కార్యక్రమం అడ్డుకుని, మహిళా సంఘాలుగా ఏర్పాటుచేశారు. ఒక్కో సంఘం రోజుకు 3 వేల రొట్టెలను తయారుచేస్తోంది. జొన్న, సజ్జ ఇతర మిల్లెట్ రొట్టెలను ఒక్కొటీ రూ.5కొని సహకార సంఘం బ్రాండ్ ద్వారా రూ.10కు విక్రయిస్తుంటుంది. వాటితో పాటు వేరుశనగ,



కంది పొడి, పెరుగు, పచ్చళ్లనూ ప్యాకెట్లుగాచేసి అమ్ముతున్నరీ మహిళలు. నెలకు ఒకొక్కర్కురు సుమారు రూ.10 వేలు వరకూ అందుకుంటున్నారు. వ్యక్తిగతంగా ఆసక్తి ఉన్నవారూ వీళ్లకి చేసిస్తున్నారు. అలా వీటికోసం ప్రస్తుతం 50 వేల మంది మహిళలు శ్రమిస్తున్నారు.

**ఆన్‌లైన్‌లోనూ...** స్విగ్గీ, జొమాటోల్లో కొద్ది రోజుల్లోనే కలబురగి రొట్టెలకు ఆదరణ పెరిగింది. జిల్లా, రాష్ట్ర స్థాయి హోటళ్లలోనే కాదు. ఈ కామర్స్ వేదికల్లోనూ అందుబాటు లోకి తెచ్చారు. పండుగల వేళ 'కలబురగి బుట్ట' పేరుతో ప్రత్యేక ప్యాక్‌లు బెంగళూరు, మైసూరుతోపాటు ఇతర 15 నగరాల్లో ప్రత్యేక ఔట్‌లెట్లలో విక్రయిస్తున్నారు. ఇటీవల జిల్లా యంత్రాంగం ఈ బ్రాండ్ కోసం ప్రత్యేక క్యూఆర్ కోడ్‌నీ తయారుచేసింది. దాన్ని స్కాన్ చేస్తే ఈ రొట్టెల ద్వారా అంటే పోషకాలను తెలుసుకోవచ్చు. ఈ అవగాహనతో అమ్మకాలు మరింత పెరిగాయి. ఇప్పటికే కలబురగి కందులు, కొబ్బరికాయకు భౌగోళిక గుర్తింపు (జిఐ) వచ్చింది. కలబురగి రొట్టెకీ అంతటి గుర్తింపు తేవాలన్నది జిల్లా యంత్రాంగం లక్ష్యమట. ◻

# సమన్వయాన్ని పెంచే స్విస్ బాల్ !



**బరువు తగ్గాలి.. ఆరోగ్యం మెరుగుపడాలి. ఇకనైనా వర్కవుట్లు చేద్దాం అని చాలాసార్లే అనుకుంటాం. కానీ అమలు చేయం. ఈ స్విస్ బాల్‌ని ఇంటికి తెచ్చుకుని చూడండి.**

బోలెడన్ని ప్రయోజనాలు.

✦ స్విస్‌బాల్‌తో పొట్ట, వీపు, పొత్తికడుపునకు ప్రయోజనం ఇచ్చే కసరత్తులు సులువుగా చేయెచ్చు. దీతో శరీరాన్ని బ్యాలెన్స్ చేయగలరు. మెరుగైన పోశ్చర్ కూడా వస్తుంది. ఉదాహరణకు బాల్‌పై సిట్-అప్స్, ప్లాంక్స్ ప్రయత్నించి చూడండి.


✦ గర్భిణులు, వర్క్‌ఫ్రమ్ హోమ్ చేసేవారు, డెస్క్ ఉద్యోగులు.. ఈ స్విస్ బాల్‌పై వ్యాయామం చేయడం వల్ల వెన్ను కండరాలు బలపడతాయి. గర్భిణులకు ప్రసవ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయి.

✦ రోజువారీ పనులు చేసుకోవడం కష్టంగా ఉందా? అయితే, మీ శరీరం ఫ్లెక్సిబుల్‌గా మారాలంటే స్విస్‌బాల్‌తో వ్యాయామాలు మొదలుపెట్టండి. ఒత్తిడీ అదుపులో ఉంటుంది. ◻

# అరటి చెక్కుతో పపితా ఖార్ !

**ఆస్సామీలు ఎంతో ఇష్టంగా తినే సంప్రదాయ వంటకం పపితా ఖార్.** దీన్నే అమితా ఖార్, పపయా ఖార్ అనికూడా పిలుస్తారు. వీళ్ల భోజనాన్ని దీంతోనే మొదలు పెట్టడానికి ఇష్టపడతారు.

ఎవరికివాళ్లు ఇంట్లో చేసుకోవడమే కాదు. హోటళ్లలోనూ వండి వడ్డిస్తారు. ఇంతకీ దీన్నెలా చేస్తారంటే.. ముందుగా అరటికాయ చెక్కు తీసి కాల్చి, పది నిమిషాల పాటు వేడి నీళ్లలో నానబెట్టి, వడకట్టి ఖార్ తయారుచేస్తారు. దీన్ని బంగాళదుంపలతోనూ వండుతారు. అయితే పచ్చి బొప్పాయితో కలిపి చేసేది ఇంకా రుచిగా ఉంటుంది. కడాయిలో నూనె, మెంతులు, వెల్లుల్లి తరుగు, పసుపు, ఉప్పు, బొప్పాయి ముక్కలు, చెక్కు తీసిన బంగాళ దుంప ముక్కలు, సిద్ధంగా ఉన్న ఖార్, వంటసోడా వేసి వేయించాలి. మిశ్రమం గోధుమ రంగులోకి మారాక.. అరకప్పు నీళ్లు పోసి..సెగ తగ్గించి మూత పెట్టాలి. మధ్యలో కలియబెడుతూ దగ్గరపడ్డాక దించేస్తే 'పపితా ఖార్' తయారైపోతుంది. ఇది రుచికే కాదు ఆరోగ్యానికీ మంచిదే. దీన్ని తినడం వల్ల పొట్ట శుభ్రపడటంతోపాటు కంటిచూపూ మెరుగుపడుతుంది. అన్నిటికంటే ముఖ్యంగా బరువూ పెరగరని నమ్ముతారు. ◻



# ఆలోచించండి !



పెళ్లిళ్ల సీజన్‌లో మొహండీ, హల్దీ, పెళ్లి, రిసెప్షన్... ఇలా వేడుకలమీద వేడుకలు. అతిథి మర్యాదలు ఎక్కడా తగ్గకూడదని రకరకాల వెరైటీలు పెడతారు. అన్నీ టేస్టు చేద్దామని ప్లేటు. నిండా పెట్టుకుంటారు కొందరు. సగం కూడా తినరు, తినలేరు. పిల్లల కోసమూ ప్రత్యేకంగా ప్లేటు తీసుకుంటారు. ఏదో ఒకటి తింటారని కనిపించినవన్నీ వడ్డిస్తారు. తీరా వాళ్ళు తినేదీ నాలుగు మెతుకులే ఎంత వృథా? కానీ ఏమాత్రం గిల్టీ లేకుండా ఆ ప్లేటుని అలాగే తీసుకెళ్లి వేస్ట్ డబ్బాలో పెట్టేస్తారు. దానికోసం లక్షలు ఖర్చుపెట్టిన యజమాని కాదు, ఎంతమంది ఎన్ని రకాలుగా కష్టపడితే అది మన ప్లేటులోకి వచ్చిందో అని కనీస స్పృహ ఉన్న వాళ్లవారికైనా బాధగానే అనిపిస్తుంది. అలాగని నచ్చకున్నా తినమని చెప్పడంలేదు. తినలేనన్ని వెరైటీలు అక్కడ ఉన్నా మీరేది తినగలరో ఏ మేరకు తినగలరో అవే పెట్టుకోండి కొత్త వెరైటీల్ని రుచి చూశాకే వడ్డించుకోండి. నచ్చితే మరింత పెట్టుకోవచ్చు. అలాగే రెస్టరెంట్లకు వెళుతుంటారు. ఎవరైనాకొద్దీ ఆర్డరు చేస్తారు. అది కాస్తా ఇది కాస్త కెలికినట్లుగా తిని పక్కన పెట్టేస్తారు. అదంతా వెళ్లేదీ చెత్తలోకే కోట్లాది మంది ఆకలితో అలమటిస్తే.. ఆహారాన్ని ఈ స్థాయిలో వేస్ట్ చేయడం ఎంతవరకూ కరెక్టో ఒక్కసారి ఆలోచించండి, అంతేకాదు, ఆతిథ్యం ఇచ్చేవాళ్లూ తిన్న ప్లేట్లను పెట్టి కొందరిని ఉంచాలి. మనం ఉంటే మరొకరు గమనిస్తున్నారన్న స్పృహతో అయినా ఎంత కావాలో అంతే పెట్టుకోవడం అలవాటవు తుంది. రెస్టరెంట్లలో సైతం ప్లేటులో ఆహారం వదిలేస్తే జరిమానా విధించాలి. ఆహార వృథా హాస్టళ్లలోనూ ఎక్కువే అక్కడ కూడా వదిలే సిన ఆహారాన్ని లెక్కించేలా డిజిటల్ మానిటరింగ్ ట్రాకర్లని పెట్టాలి. అలాగైనా ఆహార వృథా తగ్గుతుందేమో! ◻

# చిన్నారులను పుడీగా..

**ఏడాది నిండుతున్న బుజ్జాయిలకు ఆహారాన్ని అందించడమనేది ప్రతి తల్లికీ ఒక సవాలే. పోషకాలతో చిన్నారుల పొట్టనెలా నింపాలని సతమతమయ్యే తల్లులకు నిపుణులు కొన్ని సూచనలిస్తున్నారు. బుజ్జాయిని పుడీగా ఎలా మార్చొచ్చనేదీ వివరిస్తున్నారు.**



ఆహారంలో ఏదో ఒకటి కాకుండా ఆరోగ్యానిచ్చేవాటిని పిల్లలతో ఎలాగైనా తినిపించాలనే ప్రయత్నంలో చిన్నారులు అయిష్టపడుతున్నా కూడా తినిపిస్తారు కానీ ఈ పద్ధతి సరైనది కాదంటున్నారు నిపుణులు. దీనివల్ల భోజనంపై పుర్తిగా ఆసక్తి తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మరికొందరైతే ఆహారాన్ని మెత్తగా చేసి పిల్లలకు బలవంతంగా అందిస్తారు. ఈ విధానం కూడా తప్పే అంటున్నారు. ఇలా చేస్తే నమలడమనే ప్రక్రియ పిల్లలకు పరిచయం కాదు. మింగేస్తుంటారు కొత్తగా దంతాలొస్తున్న ఆ వయసులో చిన్నారులు వాటిని ఉపయోగించక పోవడంతో ఆహారంతో లాలా జలం కలవక జీర్ణసమస్య ఎదురవుతుంది. ఇలా మెత్తగా చేసిచ్చే ఆహారంలో పీచు, పోషకాలు అందక, మెరుగైన జీర్ణశక్తిని కోల్పోతారు.

**సహనంతో తినిపించాలి..** పోషకాహారంవైపు చిన్నారులను అడుగు వేయించడంలో కాస్తంత సహనాన్ని పాటించాలి. అలాకాకుండా ఆసక్తిగా తింటున్నారని అదే రకమైన ఆహారాన్ని ప్రతి రోజూ అందిస్తే పిల్లలు దానివైపు కన్నెత్తికూడా చూడరు. అప్పుడు మరొక కొత్తరకాన్ని తినిపించడానికి ప్రయత్నించినా అయిష్టత ప్రదర్శిస్తారు. ఈ దశనే వైద్యులు 'నియో ఫోబియో' అంటున్నారు. కొత్త ఆహారాలపై ఉండే ఈ భయాన్ని దాటించడానికి పెద్దవాళ్లు ప్రయత్నిస్తూనే ఉండాలి. సలాడ్స్ చేసేటప్పుడు వారినీ భాగస్వాములను చేయాలి. పండ్లతో రకరకాల ఫుడ్ ఆర్ట్ నేర్పించాలి. చిన్న మొత్తంలో అందించాలి. ఇవన్నీ వాళ్లలో ఆహారంపై ఆసక్తిని పెంచుతాయి.

**రంగుల మయంగా కనిపించాలి..** ఆహారంపై ఆసక్తిని పెంచాలంటే వాళ్లెదుట ఉంచే బౌల్ లేదా ప్లేటు ఆకర్షణీయంగా ఉండాలి. భోజనం ప్లేటులో స్ట్రాబెర్రీలు, ఉడికించిన క్యారెట్ వంటివి వాళ్లకు కలర్‌ఫుల్‌గా కనిపిస్తాయి. ప్లేటుతోపాటు చుట్టూ వాతావరణం కూడా ప్రోత్సహించేలా ఉండాలి. కుటుంబసమేతంగా భోజనం చేయాలి. పిల్లలు వాళ్ల తల్లిదండ్రులను ఎక్కువగా అనుకరిస్తుంటారు. అందుకే పెద్దవాళ్లు పోషకాలున్న ఆహారానికి ప్రాధాన్యతనిస్తూ, వాటిని ఆస్వాదిస్తూ తీసుకోవాలి. వాటి రుచిని మాటల్లో చెబుతుండాలి. ఇప్పుడు చిన్నారులను తప్పక ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకునే పుడీగా మారుస్తాయి. ◻

# అర్ధ నారీశ్వరుడు

అర్ధ నారీశ్వర అంటే 'భగవంతుడు, అతను సగం స్త్రీ'అని అర్థం. లయకారునిగా భావింపబడే ఈశ్వరుడిని సాధారణంగా లింగ రూపంలో పూజిస్తారు. శబ్దవ్యుత్పత్తి పరంగా శివ మరియు లింగ అనే రెండు పదాల అర్థం విశ్వం దానిలో కరిగిపోతుంది అందువలన శివుడు సమస్త సృష్టికి అంతిమ మూలం అని వేదాలుచెబుతున్నాయి.పురాణాలలో, దేవుడు విశ్వాన్ని సృష్టించి, నిలబెట్టి, లయం చేయడానికి ఉపయోగించే శక్తి లేదా శక్తిని దేవతగా చిత్రీకరించారు. ఈశ్వరుడి భార్య పార్వతి. అయితే ఈశ్వరుడు తనను తాను వ్యక్తపరచుకున్న అనేక రూపాలలో అర్ధనారీశ్వరుడు ఒకటి మరియు ముఖ్యమైనదిగా చెప్పబడుతోంది. శివుడు తన మొత్తం శరీరంలోని ఎడమ అర్ధభాగాన్ని పార్వతి దేవికి ఇచ్చాడని తద్వారా వారివురూ అన్ని విధాలుగా సమానమని సూచిస్తుంది. ఈ సిద్ధాంతాన్ని నేటి భార్యాభర్తలందరికీ ఆదర్శప్రాయం. అర్ధనారీశ్వర తత్వంపై శ్రీ అర్ధ నారీశ్వర స్తోత్రం శ్రీ ఆది శంకరాచార్యులచే రచించబడింది. ఆయన స్తోత్రంలో శివుడు మరియు పార్వతి దేవి ఇద్దరి గుణాలను వర్ణించాడు. శ్రీ అర్ధ నారీశ్వర స్తోత్రం కూడా భక్తులు దేవుడిని మరియు దేవతను పూజించడంలో ఎలాంటి వివక్షతను పాటించకూడదని సూచిస్తుంది. శ్రీ శివపురాణం ప్రకారం, శివుడు మొదట శ్రీ అర్ధ నరీశ్వర రూపంలో శ్రీ బ్రహ్మకు ముందు ప్రత్యక్షమై సృష్టి భావనను బోధించాడు. బృంగి మహర్షి కూడా శ్రీ అర్ధ నరీశ్వర రూపంలో శివుని దర్శనం చేసుకున్నాడని కొన్ని పురాణ కథనాలు వున్నాయి. అర్ధ అంటే సగం..నారి+ఈశ్వర అంటే శివ పార్వతులు.. ఇద్దరూ అంటే స్త్రీ, పురుషులిద్దరూ కలిస్తే సృష్టి ప్రారంభమవుతుందని అర్ధనారీశ్వరుని తత్వం బోధిస్తుంది.



**- సి.హెచ్. ప్రతాప్.**

ఆధ్యాత్మికం

# సైంధవలవణం మంచిది..



**ఉప్పు వీలైనంత తగ్గంచమని పదేపదే హెచ్చరిస్తోన్న ఆహార నిపుణులు సైంధవ లవణం చాలా మంచిదని చెబుతున్నారు. పెద్ద పెద్ద చెఫ్‌లు ఇది ఆరోగ్యకరమని, కొన్ని వంటల్లో ప్రత్యేకంగా దీన్నే ఉపయోగించమంటున్నారు. ఇంతకీ సైంధవ లవణం ఎందుకు మంచిదో, దాని వల్ల ఏమేం లాభాలున్నాయో చూద్దాం.**

పింక్‌సాల్ట్‌లో సోడియం, క్లోరైడ్, సల్ఫర్, ఐరన్, పొటాషియం,మెగ్నీసియం, మాంగనీస్, కాపర్, జింక్‌లు ఉన్నాయి. మామూలు ఉప్పు వాడటం వల్ల వచ్చే అనారోగ్యాలు దీని వల్ల రావు. సైంధవలవణాన్ని ఉపయోగించడం వల్ల ఆహారం చక్కగా జీర్ణమవుతుంది. కీళ్లనొప్పులు, మెకాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. సాధారణ ఉప్పుతో పోలిస్తే ఇందులో సోడియం పరిమాణం తక్కువ. కనుక శరీరంలో సోడియం పేరుకోదు. ఇది ఒంట్లో పేరుకున్న కొవ్వును కరిగిస్తుంది. కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచి, జుట్టు రాలకుండా కాపాడుతుంది. శరీరంలో చేరిన అనేక రకాల సూక్ష్మక్రిములను నశింపచేస్తుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్ గుణాలున్నాయి. ఎనీమియాతో బాధ పడుతున్న వారికి ఎంతో మేలు చేస్తుంది. గృహచిట్కాల్లో ఇదిముందుంటుంది. కడుపునొప్పి, మలబద్ధకం, గుండెమంట, కడుపుబ్బరం లాంటి ఇబ్బందులను నివారిస్తుంది. ◻

**నచ్చిన చోట, ఉన్నతి లేని చోట పనిచేయడం కంటే ప్రత్యామ్నాయం వెతుక్కొని కెరీర్‌లో అభివృద్ధిని సాధించడం ఇటు వ్యక్తిగతంగా, అటు వృత్తిపరంగా మంచిదంటున్నారు. మరి, ఇంతకీ పని వాతావరణాన్ని నెగటివ్‌గా ప్రభావితం చేసే కొన్ని అంశాలేంటో తెలుసుకుందాం..**

**మిమ్మల్ని దూరం పెడుతున్నారా? ....** ఒక బృందం ప్రాజెక్ట్ మీద పని చేస్తోందంటే దానికి సంబంధించిన ప్రతి విషయం, ప్రతి అప్‌డేట్ ఆ గ్రూప్‌లో ఉన్న అందరికీ తెలిస్తేనే కలిసికట్టుగా ముందుకెళ్లగలం.. అనుకున్న సమయానికి చక్కటి అవుట్‌పుట్‌ని కంపెనీకి సమర్పించవచ్చు. అయితే బాగా పనిచేసే వాళ్లపై ఇతర కొలీగ్స్‌కి ఉండే అసూయ, సహోద్యోగుల మధ్య కమ్యూనికేషన్ లోపం, గ్రూపిజం.. వంటి అంశాలు పని వాతావరణాన్ని దెబ్బతీస్తుంటాయి. ఇలాంటి చోట మీరు పని చేస్తున్నా, చక్కటి నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నా మిమ్మల్ని వేరు చేసి చూడడం, పనికి సంబంధించి మీకు ఎలాంటి అప్‌డేట్ చెప్పకపోవడం..వంటి అంశాలు మీ వ్యక్తిగత పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఇది క్రమంగా మీ మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అంటే అంతిమంగా మీ కెరీర్ ఉన్నతికి గండి పడ్డటే! కాబట్టి ఇలాంటి వాతావరణంలో పనిచేస్తున్నప్పుడు మీ వెనక జరిగే గ్రూపిజం, ఆఫీస్ రాజకీయాల గురించి మీ తీరు గురించి ముందుగా పై అధికారులకు తెలియజెప్పే ప్రయత్నం చేయండి. అయిన లాభం లేదనుకుంటే అందులోనే వేరే విభాగానికి మారడం లేదంటే వేరే ఉద్యోగం వెతుకోనకవడం వల్ల కెరీర్ ముందుకెళ్లచ్చు.



# ఉద్యోగం మారాల్సిందేనా?

**ఎంత చేసినా బూడిదలో పోసిన పన్నీరే!.........** వచ్చిన ఉద్యోగం వచ్చింది. ఇక నా పనితనమేంటో చూపిస్తా.. అంటూఎంతో ఉత్సాహంగా తాము కోరుకున్న జాబ్‌లో జాయినవుతుంటారు చాలామంది. అయితే అక్కడికెళ్లి కొన్నాళ్ల పాటు ఉద్యోగం చేస్తే గానీ తెలియదు ఆ కంపెనీ పని వాతావరణం గురించి! ఈ క్రమంలో ఎంత పని చేసినా సరైన ప్రోత్సాహకాలు లేకపోవడం, కొన్ని కంపెనీల్లోనైతే పనిచేసే వారికంటే చేయని వారికే అధిక ప్రాధాన్యమిస్తూ వారికే పై అధికారుల నుంచి ప్రోత్సాహం లభించడం..వంటివి కూడా జరుగుతుంటాయి. అయితే ఇలాంటి వాతావరణం ప్రత్యక్షంగా మనం చేసే పనిపైన కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంటుంది. 'ఛ..ఛ.. ఎంత పని చేసినా బూడిదలో పోసిన పన్నీరే! అన్న భావన కలిగేలా చేస్తుంది. నిజానికి ఆ ఫీలింగ్ వచ్చిందంటే అలాంటి చోట పని చేయలేమని అర్థం. అందుకే అక్కడే రోజులు గడిపేయడం కాకుండా సత్వరమే వేరే ఉద్యోగంలోకి మారిపోవమే మంచిదంటున్నారు నిపుణులు. దీనివల్ల ఆ సమయాన్ని వేరే కంపెనీలో కరీర్‌లో ఉన్నతి సాధించడానికి వినియోగించుకోవచ్చు.

**పనిభారమంతా మీదేనా ?...** చేసే ఉద్యోగమేదైనా సరే.. మనకు అప్పగించిన పనికే పరిమితం కాకుండా.. ఫలానా పనిని నేను చేయగలను అన్న ఆత్మవిశ్వాసంతో, యాక్టివ్‌గా ఆ పనిని స్వీకరించాలి. ఈ క్రమంలో మీలోని సృజనాత్మకతను చాటుకుంటే మరి మంచిది అయితే ఈ చురుకుదనం ఒక్కోసారి మన తలపై భారంగా మారే అవకాశాలూ లేకపోలేదు. ఎలాగూ ఈ అమ్మాయి యాక్టివ్‌గా పనిచేస్తుంది కదా అని కొంతమంది అధికారులు సహోద్యోగుల పనిని కూడా వారి నెత్తినేస్తుంటారు. దీనివల్ల మోయలేని భారం మీపై పడడంతో పాటు అంతిమంగా ఇది మీపై ఒత్తిడిని తీసుకొస్తుంది. తద్వారా మీరు చేసే పనిలో నాణ్యత లోపిస్తుంది. అందుకే ఇలా పని విషయంలో మీ తలకు మించిన భారం అనిపిస్తే 'నో' చెప్పడానికి ఎనకాడకూడదని చెబుతున్నారు నిపుణులు. కొలీగ్ రానప్పుడు అత్యవసరంగా చేయాల్సిన పనో, ఏవైనా అరుదైన సందర్భాల్లో అదనపు పనిని తీసుకోవడంలో తప్పులేదు. అంతేకానీ.. అదే నిత్యకృత్యం అయితే నిర్మొహమాటంగా నేనే చేయనని చెప్పడం..ఎంత చెప్పినా వినకుండా మీపై ఒత్తిడి తెస్తే మాత్రం ఆ ఉద్యోగానికి గుడ్‌బై చెప్పడమే మంచిదని చెబుతున్నారు నిపుణులు. సహోద్యోగులపై చేసే చెడు ప్రచారాలు, పనిచేసే చోట లైంగిక వేధింపులు సెలవు తీసుకున్నా పనిచేయాల్సి రావడం, పై అధికారుల ప్రోత్సాహం కరువవడం.. వంటివి కూడా అటు పని వాతావరణాన్ని, ఇటు ఉద్యోగుల కెరీర్ ఉన్నతిని దెబ్బతీస్తాయి. అందుకే ఇలాంటి విషపూరిత వాతావరణానికి టాటా చెప్పి.. కొంచెం లేటైనా సరే సౌకర్యవంతంగా, అభివృద్ధి ఉన్న చోటికి రెక్కలు కట్టుకొని వాలిపోవడమే అన్ని విధాలా శ్రేయస్కరమని చెబుతున్నారు నిపుణులు. ◻



# రెండోసారి క్వీన్స్ రాజుగా అల్కరాజ్

## లెహెక్కాను ఓడించి 21వ టైటిల్ కైవసం

**న్యూఢిల్లీ:** స్పానిష్ యువ టెన్నిస్ స్టార్ కార్లోస్ అల్కరాజ్ ఈ ఏడాది తన హాట్ రన్‌ను కొనసాగించి ఛాంపియన్‌గా నిలిచాడు. క్వీన్స్ క్లబ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ప్రపంచ నెంబర్ 2 ఆటగాడు జిరి లెహెక్కాను ఓడించి, ఈ సీజన్‌లో తన ఐదవ టైటిల్‌ను అల్కరాజ్ కైవసం చేసుకున్నాడు. పశ్చిమ లండన్‌లో రెండు గంటల 10 నిముషాల్లో అల్కరాజ్ 33 విన్నర్లు, 18 ఏస్‌లు కొట్టి చెక్ ప్రపంచ 30వ ర్యాంక్ క్రీడాకారుడిని ఓడించాడు. 22 ఏళ్ల స్పానియార్డ్ 7-5, 6-7 (5), 6-2 తేడాతో విజయం సాధించి, క్వీన్స్ క్లబ్‌లో తన 21వ టూర్ లెవల్ టైటిల్‌ను సాధించాడు. 2 గంటల 8 నిముషాల్లో అల్కరాజ్ తన విజయాన్ని సాధించాడు. నోవాక్ జోకోవిచ్ (8), మాటియో బెరెట్టిని (4), టేలర్ ఫ్రిట్జ్ (4), నికోలస్ మహుత్ (4) తర్వాత నాలుగు లేదా అంతకంటే ఎక్కువ గ్రాస్-కోర్ట్ టైటిళ్లను సాధించిన క్రియాశీల ఆటగాళ్లలో ఐదవ వ్యక్తిగా నమోదయ్యాడు.

రెండు సార్లు డిఫెండింగ్ వింబుల్డన్ ఛాంపియన్ అయిన ఈ టోర్నమెంట్‌లో 18 మ్యాచ్‌ల విజయాల పరంపరతో ఇది అల్కరాజ్‌కు పెద్ద విజయం కావడం విశేషం. మయామిలో జరిగిన ఎటిపి మాస్టర్స్ 1000లో డేవిడ్ గోఫిన్ చేతిలో తొలి రౌండ్ ఓటమి తర్వాత, అల్కరాజ్ ఈ పోటీల్లో తనను తాను తిరిగి నిరూపించుకున్నాడు. అప్పటి నుండి 27-1 రికార్డును, మోంటో కార్లో, రోమ్, ఫ్రెంచ్ ఓపెన్, క్వీన్స్ క్లబ్‌లలో టైటిల్ విజయాలను సాధించాడు. ఎటిపి లైవ్ రేస్ టు టురిన్‌లో రెండవ స్థానంలో ఉన్న జానిక్ సిన్నర్‌పై అల్కరాజ్ తన ఆధిక్యాన్ని 2240 పాయింట్లకు పెంచుకున్నాడు.

# అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు పతకాల వెల్లువ

## బంగారు, కాంస్య, రజతాలతో మెరిసిన అథ్లెట్లు





**న్యూఢిల్లీ:** జాతీయ అండర్ 20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు పతకాలు వెల్లువెత్తాయి. ఈ టోర్నమెంట్‌లోని వివిధ విభాగాల్లో భారత్ అథ్లెట్స్ రాణించి గతంలో నమోదైన రికార్డులను బద్దలు కొట్టారు. ఉత్తరప్రదేశ్‌లో 23వ జాతీయ జూనియర్ (అండర్ 20) ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సుదూర రన్నర్లు మరియు స్ప్రింటర్ల వేగం, స్టామినా మరియు రికార్డు బద్దలు కొట్టే విన్యాసాలతో అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. పురుషుల 3000 మీటర్ల ఈవెంట్‌లో 8 మంది పురుష అథ్లెట్లు మునుపటి మీట్ రికార్డును అధిగమించారు. 2021లో పంజాబ్‌లోని సంగ్రూర్‌లో అజయ్ నెలకొల్పిన 8:26.72 పాత రికార్డును మధ్యప్రదేశ్‌కు చెందిన వినోద్ సింగ్ 8:14.22 సమయంతో బంగారు పతకం సాధించడంతో వెనుకబడి పోయారు. గుజరాత్‌కు చెందిన వివేక్ చంద్ (8:14.81) మరియు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రాహుల్ కుమార్ (8:15.25) అతని తర్వాతి స్థానాల్లో నిలిచారు. మరో రికార్డు సృష్టించిన ప్రదర్శనలో, తమిళనాడుకు చెందిన కవిన్‌రాజా ఎస్ పురుషుల పోల్ వాల్ట్‌లో 5.11 మీటర్లు సాధించి, 2024లో కుల్దీప్ కుమార్ నెలకొల్పిన 5.10 మీటర్ల మార్కును తృటిలో మెరుగుపరుచుకుని బంగారు పతకాన్ని సాధించాడు. అలాగే పురుషుల 100 మీటర్ల స్ప్రింట్‌లో హర్యానాకు చెందిన హిమాన్షు 10.49 సెకన్లలో గమ్యాన్ని చేరుకుని స్వర్ణం సాధించాడు, 2018మీట్ రికార్డు అయిన గురిందర్ వీర్ సింగ్ 10.47 సెకన్లలో తృటిలో అధిగమించాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన అభయ్ సింగ్ (10.50 సెకన్లు) మరియు తమిళనాడుకు చెందిన వరుణ్ ఊరి (10.54 సెకన్లు) వరుసగా రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. మహిళల్లో, ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిపమ్ 100 మీటర్ల పరుగులో 11.86 సెకన్ల సమయంతో ఆధిపత్యం చెలాయించింది, పశ్చిమ బెంగాల్‌కు చెందిన అర్చితా బెనర్జీ (11.90సె) మరియు ఢిల్లీకి చెందిన సంజన (12.01సె) వెనుకబడి ఉన్నారు. మహిళల 3000 మీటర్ల ఫైనల్లో, హర్యానాకు చెందిన సంజనసింగ్ 9:51.77సమయంలో గమ్యస్థానంలో నిలిచి, గుజరాత్‌కుచెందిన శిల్పాదిహోరా (9:53.19) మరియు ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్షు (9:53.44)లను తృటిలో ఓడించి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఫీల్డ్ ఈవెంట్లలో, హర్యానాకు చెందిన అనిషా మహిళల డిస్కస్‌త్రోలో ఆకట్టుకుంది, డిస్క్‌ను 49.62 మీటర్ల దూరం విసిరి స్వర్ణం గెలుచుకుంది, ఆ తర్వాత సహచరురాలు రిద్ధి (47.68 మీ) మరియు విదివీని పాటియాలా నుండి సుప్రియా అత్రి (44.74 మీ) ఉన్నారు.

# సీషెల్స్ బాక్సింగ్ టోర్నీలో.. ఫైనల్స్‌కు ఏడుగురు భారత్ బాక్సర్లు

**న్యూఢిల్లీ:** సీషెల్స్ బాక్సింగ్ టోర్నమెంట్-2025లో ఏడుగురు భారత బాక్సర్లు ఫైనల్స్‌కు చేరుకున్నారు. వీరిలో ఆదిత్య (65 కిలోలు), నీరజ్ (75 కిలోలు), హిమాన్షు (50 కిలోలు), ఆశిష్ (55 కిలోలు), అన్మోల్ (60 కిలోలు), కార్తీక్ దలాల్ (70 కిలోలు) మరియు గౌరవ్ (90+ కిలోలు) స్వర్ణ పతాకాలకు చేరువలో ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆదిత్య ప్రతాప్ (65 కిలోలు) మూడో రౌండ్‌లో హోమ్ ఫేవరెట్ జోవానీ బౌజిన్‌పై ఆర్ఎస్‌సి (రిఫరీ స్టాప్స్ కాంటెస్ట్) విజయంతో ఆకట్టుకున్నాడు. ప్రతాప్ కజకిస్తాన్‌లో జరిగిన ఎలోర్దా కప్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాడు. అలాగే 75 కిలోల విభాగంలో, నీరజ్ తన ప్రత్యర్థిపై ఆర్ఎస్‌సి రెండవ రౌండ్ విజయంతో ఆ ప్రయత్నానికి అద్దం పట్టాడు. నీరజ్ నేషనల్ కంబైన్డ్ ఫైనల్స్ రజత పతక విజేత కూడా. 50 కిలోల విభాగంలో, మాజీ బెల్‌గ్రేడ్ బాక్సింగ్ ఛాంపియన్ మరియు 6వ ఎలైట్ నేషనల్స్‌లో కాంస్య పతక విజేత అయిన హర్యానాకు చెందిన హిమాన్షు శర్మ, మారిషస్‌కు చెందిన మాథ్యూ సుప్రయెన్‌పై 4:1 తేడాతో ఆత్మవిశ్వాసంతో విజయం సాధించాడు. 55 కిలోల బౌట్‌లో, ప్రస్తుత జాతీయ కంబైన్డ్ ఛాంపియన్ ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆశిష్ ముద్వానియా, మారిషస్‌కు చెందిన గుయిలౌమ్ ఫ్రాన్సిస్‌పై 4:1 తేడాతో ఘన విజయం సాధించాడు. హర్యానాకు చెందిన అన్మోల్ (60 కిలోలు), సీషెల్స్‌కు చెందిన డారియో గబెరియల్‌పై 4:1 స్ప్లిట్ డెసిషన్ విజయాన్ని సాధించాడు.



# మహిళల ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో.. భారత్ రికార్డు

## రాణించిన తెలంగాణ అమ్మాయి సౌమ్య

### 13-0 తేడాతో మంగోలియా ఓటమి

**న్యూఢిల్లీ:** ఎఫ్‌సి మహిళల ఆసియా కప్-2026 క్వాలిఫయర్స్ మ్యాచ్‌లో మంగోలియాను ఓడించి భారత్ రికార్డు విజయం సాధించింది. భారత్ తరపున ఆడిన తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాకు చెందిన గగులోత్ సౌమ్య ఈ మ్యాచ్‌లో రాణించింది. చియాంగ్ మాయి స్టేడియంలో సోమవారం జరిగిన క్వాలిఫయర్స్‌లో భారత్ మహిళల ఫుట్‌బాల్ జట్టు మంగోలియాపై 13-0 తేడాతో విజయం సాధించింది. ప్యారీ క్సాక్సా ఐదుసార్లు నెగ్గగా, సౌమ్య, ప్రియదర్శిని సెల్లాదురై చెరో రెండు రెట్లు సాధించి కీలకమయ్యారు. సంగీత బస్‌ఫోర్, రింప హల్దార్, మాళవిక మరియు గ్రేస్ డాంగ్‌మీలు ఒక్కొక్కరు ఒక్కో గోల్ చేసి ఆధిక్యాన్ని నిలిపారు. సౌమ్యఇచ్చిన క్లోజ్‌రేంజ్ క్రాస్‌ను బాస్ఫోర్ ద్వారా స్కోరింగ్‌ను ప్రారంభించడంతో, మ్యాచ్ ప్రారంభం నుంచే భారత్ ఆధిపత్యం చెలాయించింది. ఆ తర్వాత రింపా క్రాస్‌ను శక్తివంతమైన వాలీతో సౌమ్య భారత్ ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. హాఫ్ టైమ్‌కు ముందే ప్యారీ రెండు రెట్లు ఎక్కువ గోల్స్ చేసింది, మొదట సౌమ్య చేసిన కట్‌బ్యాక్ ద్వారా, తరువాత టాప్ కార్నర్ లోకి శక్తివంతమైన లాంగ్‌రేంజ్ షాట్‌ద్వారా బ్లూ టైగ్రెస్‌లు తొలి అర్ధభాగంలో వేగంగా ఆడితే, రెండో అర్ధ భాగంలో వారు మరింత వేగంగా ఆడారు. ప్యారీ గ్రేస్ క్రాస్ ద్వారా తన హ్యాట్రిక్‌ను పూర్తి చేసుకుంది. 55వ నిమిషం నాటికి భారత స్ట్రైకర్ మరో రెండు గోల్స్ జోడించడంతో, మ్యాచ్‌లో ఆమె మొత్తం గోల్స్ ఐదుకు చేరుకుంది. గోల్ కీపింగ్ తప్పిదాన్నే సౌమ్య సద్వినియోగం చేసుకుని భారత్ తరఫున ఎనిమిదో గోల్ చేసిన తర్వాత, రింపా, మాళవిక, ప్రియదర్శిని వరుసగా ఒక్కో గోల్‌చేసి భారత్ స్కోరును రెండంకెలకుచేర్చారు. గ్రేస్‌డాంగ్మీ పెనాల్టీతో భారత్ 12గోల్స్ సాధించింది. మ్యాచ్ ముగిసే సమయానికి, ప్రియదర్శిని తన రెండవ మరియు భారత్ 13వ గోల్స్‌సాధించి బ్లూ టైగ్రెస్‌కు ఘన విజయాన్ని అందించింది.

# హాకీ ప్రో లీగ్‌లో.. భారత్ థ్రిల్లింగ్ విక్టరీ

## 4-3 తేడాతో బెల్జియం ఓటమి



**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ హాకీఫెడరేషన్ (ఎఫ్ఐహెచ్) ప్రో లీగ్-2024-25 సీజన్‌లోని చివరి మ్యాచ్‌లో భారత్ పురుషుల హాకీ జట్టు థ్రిల్లింగ్ విక్టరీని సాధించింది. భారత్ పురుషుల హాకీ జట్టు తమ చివరి మ్యాచ్‌లో బెల్జియంను 4-3 తేడాతో ఓడించి ఉత్సాహభరితమైన పునరాగమనాన్ని కనబరిచింది, సుఖ్జీత్ సింగ్ (21వ నిముషం, 35వ నిముషం), అమిత్ రోహిదాస్ (36వ నిముషం), మరియు హర్మన్‌ప్రీత్ సింగ్ (59వ నిముషం) గోల్స్ చేయడం ద్వారా భారతదేశం విజయం సాధించింది. బెల్జియం తరపున ఆర్థర్ డి స్లూవర్ (8వ నిముషం), థిబ్యూ స్టాక్‌బ్రోక్స్ (34వ నిముషం) మరియు హ్యూగో లాబౌచెరే (41వ నిముషం) గోల్స్ చేశారు. అంట్వెర్ప్‌లో బుధవారం జరిగిన హాకీ ప్రో లీగ్‌లో ఇప్పటి వరకూ వరుస పరాజయాలతో ఘోరంగా విఫలమైన భారత్ జట్టు చివరి మ్యాచ్‌లో చెత్త ముగింపును తప్పించింది, బెల్జియం 8వ నిమిషంలో ఆర్థర్ డి స్లూవర్ గోల్ చేయడంతో బలంగా ప్రారంభమైంది. భారత్ రెండవ క్వార్టర్‌లో సుఖ్జీత్ సింగ్ ప్రతిస్పందించించాడు. అతను 21వ నిమిషంలో గోల్ చేసి స్కోరును సమం చేశాడు. రెండవ అర్ధభాగంలో ఎండ్ టు ఎండ్ యాక్షన్ కనిపించింది. బెల్జియం 34వ నిమిషంలో థిబ్యూ స్టాక్‌బ్రోక్స్ ద్వారా ఆధిక్యాన్ని తిరిగి పొందింది. కానీ భారత్ నుండి ఆ వెనువెంటనే బెల్జియంకు ఎదురుదెబ్బ తగిలింది. ఒక నిమిషం తర్వాత సుఖ్‌జీత్ మళ్లీ గోల్ చేశాడు. మళ్లీ 36వ నిముషం అర్ధభాగంలో అమిత్ రోహిదాస్ పెనాల్టీ కార్నర్‌లో గోల్ చేసి స్కోరును 3-2కి పెంచాడు. అయినప్పటికీ బెల్జియం ఆట పూర్తి చేయలేదు. యువ ఆటగాడు హ్యూగో లాబౌచెర్ పెనాల్టీ కార్నర్ ద్వారా తన తొలి అంతర్జాతీయ గోల్ సాధించడం ద్వారా వారు 41వ నిముషంలో స్కోరును సమం చేశారు. 59వ నిమిషంలో చివరి మలుపు తిరిగింది, అయితే భారత్‌కు పెనాల్టీ స్ట్రోక్ ఇవ్వబడింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ముందుకు వచ్చి గోల్‌గా మలచడంతో 4-3 తేడాతో భారత్ హాకీ జట్టు నాటకీయ విజయాన్ని సాధించింది. కాగా ఈ విజయంతో పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో ముగించింది. ఐర్లాండ్ కంటే 14 పాయింట్లు ఆధిక్యంలో ఉంది.

# 1.5 బిలియన్ డాలర్లకు ఫోన్‌పే ఐపిఒ


## ఆగస్టులో డిఆర్‌హెచ్‌పి దాఖలుకు కసరత్తు

**ముంబై, జూన్ 23:** దేశంలోని అగ్రగామి డిజిటల్ చెల్లింపుల సంస్థ ఐపిఒకు వస్తోంది. వాల్‌మార్ట్ అనుబంధంగా ఉన్న ఈ సంస్థ ఐపిఒద్వారా 1.5బిలియన్ డాలర్లు సమీకరించాలని నిర్ణయించింది. ఈ ఐపిఒకోసం బ్యాంకర్లు సంస్థ విలువలను 15 బిలియన్ డాలర్లుగా అంచనా వేసారు. ఈ ఫిన్‌టెక్‌సంస్థ సెబీకి డిఆర్‌హెచ్‌పిని ఆగస్టులో దాఖలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయి. ఐపిఒను నిర్వహించేందుకు పర్యవేక్షణ చేసేందుకుగాను ఈ సంస్థను అన్ని టాప్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్స్‌లో లిస్టింగ్‌చేసింది. వాటిలో కోటక్ మహీంద్ర కేపిటల్, జెపిమోర్గాన్‌ఛేజ్, సిటీగ్రూప్, మోర్గాన్ స్టేన్లీ సంస్థలు కూడా ఉన్నాయి. 2015లో స్థాపించిన ఫోన్‌పే రానురాను భారత్‌లో యుపిఐ వ్యవస్థల్లో అగ్రగామిగా నిలిచింది. సుమారు 610 మిలియన్ల మంది రిజిస్టరయిన కస్టమర్లు ఉన్నారు. రోజువారి లావాదేవీలే సుమారు 34కోట్ల డాలర్లవరకూ ఉన్నాయి. రిబ్బిట్ క్యాపిటల్, టైగర్ గ్లోబల్ మేనేజ్‌మెంట్, టివిఎస్ కేపిటల్ ఫండ్స్‌ల నుంచి గత ఏడాది ఈ కంపెనీ 100 మిలియన్ డాలర్లను పెట్టుబడులుగా సేకరించింది. ఆటైమ్‌లో కంపెనీ విలువలు 12 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఫోన్‌పే సుమారు 12.56 లక్షలకోట్ల లావాదేవీలను నిర్వహించినట్లు యుపిఐ గణాంకాలే చెపుతున్నాయి. గూగుల్‌పే ఆ తర్వాత 8.85లక్షల కోట్లు లావాదేవీలు చేస్తే పేటిఎం 1.27 బిలియన్ లావాదేవీలు నిర్వహించింది. దీనితో ఫోన్‌పే, గూగుల్‌పేలు 80శాతం యుపిఐ లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు తేలింది. 2022లో భారత్‌లోనే రిజిస్టరు చేసుకుంది. ఈనెలలోనే స్టాండర్ట్ ఛార్టర్డ్ బ్యాంకు మాజీ సీఈఓ జరిన్ దారువాలాను బోర్డులోకి తీసుకుంది. ఐపిఒ విజయవంతం అయితే భారత్ ఫిన్‌టెక్ కంపెనీల్లో ఫోన్‌పే ఐపిఒ సూపర్‌సక్సెస్ అయిన సంస్థగా నిలుస్తుంది.




# స్టాక్ సూచీలపై వార్ ఎఫెక్ట్

**ముంబై, జూన్ 23:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య పోరులో అమెరికా జోక్యం చేసుకోవడంతో పాటు అక్కడి అణు కేంద్రాలే లక్ష్యంగా దాడులు నిర్వహించడంతో ప్రపంచ మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. చమురు ధరలకు రెక్కలు రావడంతో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుందన్న భయాలు కూడా ఇందుకు తోడయ్యాయి. ఐటీ షేర్లు ప్రధానంగా నష్టపోగా.. నిఫ్టీ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం భౌగోళిక ఉద్రిక్తతలను తట్టుకుని నిలబడడం విశేషం. ఇంట్రాడేలో భారీ నష్టాలు చవిచూసిన సూచీలు.. ఆఖర్లో కాస్త కోలుకున్నాయి. ఓ దశలో 900 పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్ చివరికి 500 పాయింట్ల నష్టంతో గట్టెక్కింది. నిఫ్టీ మళ్లీ 25 వేల దిగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 81,704.07 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,408.17) భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 81,476.76 వద్ద కనిష్ఠాన్ని తాకింది. రోజంతా నష్టాల్లో కొనసాగిన సూచీ.. మధ్యాహ్నం తర్వాత కాస్త కోలుకుంది. చివరికి 511.38 పాయింట్ల నష్టంతో 81,896.79 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 140.50 పాయింట్ల నష్టంతో 24,971.90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.76గా ఉంది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ, మహీంద్రా అండ్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్ ప్రధానంగా నష్టపోయాయి. ట్రెంట్, బీఈఎల్ బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 77.35 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,381 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.






# కొత్తగా ఇపిఎఫ్‌ఒ చందాదారులు 8.49 లక్షల మంది

**న్యూఢిల్లీ, జూన్ 23:** ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ పరిధి లోకి ఏప్రిల్ నెలలో 19.14 లక్షల మంది చేరారు. ఈ యేడాది మార్చి నెలలో చేరికతో పోలిస్తే 31శాతం, 2024 ఏప్రిల్ నెల గణాంకాలతో పోలిస్తే ఒకశాతం వృద్ధి నమోదైంది. ఈ వివరాలను కేంద్ర కార్మిక శాఖ విడుదల చేసింది. ఏప్రిల్‌లో కొత్త సభ్యుల చేరిక 8.49 లక్షలుగా ఉంది. మార్చి నెలలో కొత్త సభ్యుల చేరిక కంటే 12.39 శాతం ఎక్కువ. అంటే వీరు మొదటిసారి సంఘటిత రంగంలో ఉపాధి పొందినట్లు తెలుస్తోంది. ఇందులో మహిళా సభ్యులు 2.45 లక్షల మంది ఉన్నారు. మార్చి నెలతో పోలిస్తే 17.63శాతం పెరిగారు. కొత్తసభ్యుల్లో 57శాతం మేర అంటే 4.89 లక్షల మంది వయసు 18-25 యేళ్ల మధ్య ఉంది. మహిళా సభ్యుల నికర చేరిక మాత్రం మార్చి నెలతో పోలిస్తే 35శాతం అధికంగా 3.95 లక్షలుగా ఉంది. ఏప్రిల్‌లో సుమారుగా 15.77 లక్షల మందిసభ్యులు ఒక సంస్థలో ఉద్యోగం మానేసి, మరో సంస్థలో చేరారు. మార్చి నెలతో పోలిస్తే 19శాతం పెరిగింది. నికర చేరికలో అత్యధికంగా 21శాతం సభ్యులు మహారాష్ట్ర నుంచి ఉన్నారు.

# పెరగనున్న సిలిండర్ల ధరలు!

**ముంబై, జూన్ 23:** ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం ప్రభావాన్ని మీ వంటగదిపై పడవచ్చు. రాబోయే కాలంలో దేశంలో ఎల్‌పిజిసిలిండర్ల ధరలు పెరగవచ్చు. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తత ప్రభావం సిలిండర్ల ధరలపై చూడవచ్చు. ఎందుకంటే దేశంలోని ప్రతి 3 ఎల్‌పీజీ సిలిండర్లలో 2 పశ్చిమాసియా నుండి వస్తాయి. ఇటి నివేదిక ప్రకారం.. ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడులు ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తి ప్రాంతమైన పశ్చిమాసియా నుండి సరఫరా అంతరాయాల భయాలను పెంచాయి. గత 10 సంవత్సరాలలో భారతదేశంలో ఎల్‌పిజి వినియోగం రెండింతలు పెరిగింది. ఇప్పుడు ఎల్‌పిజి 33 కోట్ల ఇళ్లకు చేరుకుంటోంది. దాదాపు 66శాతం ఎల్‌పిజి విదేశాల నుండి వస్తుంది. దానిలో 95శాతం సౌదీ అరేబియా, యుఎఇ, ఖతార్ వంటి పశ్చిమాసియా దేశాల నుండి వస్తుంది. అయితే పెట్రోల్, డీజిల్ విషయంలో భారతదేశం స్థానం చాలా మెరుగ్గా ఉంది. భారతదేశం రెండింటినీ నికర ఎగుమతిదారు, అంటే, పెట్రోల్‌లో 40శాతం, మనం ఉత్పత్తి చేసే డీజిల్‌లో 30శాతం ఎగుమతి అవుతాయి. అవసరమైతే, ఈ ఎగుమతి పరిమాణాన్ని దేశీయ మార్కెట్‌కు మళ్లించవచ్చు. శుద్ధి కర్మాగారాలు, పైపులైన్‌లు, నౌకలు, నేషనల్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ (ఎస్‌పిఆర్)లో ముడి చమురు కోసం 25 రోజుల నిల్వ ఉంది. మీరు ఇప్పుడు ఆర్డర్ చేసినా, డెలివరీ వచ్చే నెల లేదా తరువాత వస్తుందని ఒక ఎగ్జిక్యూటివ్‌చెప్పినట్లు ఇటి పేర్కొంది. అదనపు నిల్వ కోసం మా వద్ద తక్కువ సామర్థ్యం కూడా ఉంది. అంతరాయం కలిగించే ప్రమాదం తక్కువగా ఉన్నప్పుడు, ఎక్కువ కొనుగోలు చేసి డబ్బు పెట్టుబడి పెట్టడంలో అర్థం లేదు. జాగ్రత్తగా ఉండటం, దేశీయ వినియోగదారులను రక్షించడం ముఖ్యమన్నారు. చమురు ధరల పెరుగుదల స్వల్పకాలంలో శుద్ధి కర్మాగారాల మార్జిన్లపై ప్రభావం చూపవచ్చు. కానీ పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు మారే అవకాశం లేదు. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు గత 3 సంవత్సరాలుగా పంపు ధరలను స్థిరంగా ఉంచుతున్నాయి. అలాగే ప్రపంచ మార్కెట్లో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ అలాగే కొనసాగుతాయి.



# గుజరాత్‌లో తొలి గ్రీన్ హైడ్రోజన్ యూనిట్: అదానీ గ్రూప్

**న్యూఢిల్లీ, జూన్ 23:** గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో కీలక ముందడుగు పడింది. ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ భారత్ లోనే తొలి ఆఫ్‌గ్రిడ్ 5 మెగా వాట్ గ్రీన్ హైడ్రోజన్ పైలట్ ప్లాంట్‌ను గుజరాత్‌లోని కచ్‌లో ప్రారంభించింది. ఈమేరకు కంపెనీ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది.సోలార్, విండ్ వంటి పునరుత్పాదక వనరులను ఉపయోగించుకొని నీటిని ఎలక్ట్రోలైసిస్ ప్రక్రియ ద్వారా విభజించి హైడ్రోజన్ ఉత్పత్తి చేయడం ఈ ప్లాంట్ ముఖ్య ఉద్దేశం. సొంత పునరుత్పాదక కేంద్రాలను అదానీ గ్రూప్ వినియోగించుకుంది. హైడ్రోజన్ వాయువు విశ్వంలో అత్యంత తేలికైనది, స్వచ్ఛమైనది. ఇది మండినప్పుడు కేవలం నీటి ఆవిరిని ఉత్పత్తి చేస్తుంది. దేశీయ అవసరాలకు దిగుమతులపై ఆధారపడడం తగ్గించుకోవడంలో భాగంగా నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను కేంద్రం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ అదానీ న్యూ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 5 మెగావాట్ ప్లాంట్‌ను నెలకొల్పింది. దేశ గ్రీన్ హైడ్రో జన్ మిషన్‌లో దీన్నో కీలక ముందడుగుగా అదానీ గ్రూప్ అభివర్ణించింది. గ్రీన్ హైడ్రో జన్ ఉత్పత్తిలో హబ్‌గా నిలవాలన్న భారత సంకల్పానికి అదానీ గ్రూప్ తన వంతు తోడ్పాటు అందిస్తోందని పేర్కొంది. గుజరాత్ లోని ముంద్రాలో గ్రీన్ హైడ్రో జన్ హబ్‌ను కూడా అదానీ గ్రూప్ ఏర్పాటు చేస్తోంది.



# వాణిజ్యం

## ఆల్‌టైమ్ కనిష్ఠానికి ఓలా ఎలక్ట్రిక్ షేర్లు

**ముంబై, జూన్ 23:** ప్రముఖ విద్యుత్తు ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ షేర్లు ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకాయి. బ్లాక్‌డీల్ కారణంగా సోమవారం పెద్ద మొత్తంలో కంపెనీ షేర్లు చేతులు మారిన నేపథ్యంలో వాటి విలువ పతనమైంది. కంపెనీలో 0.8శాతం వాటాకు సమానమైన 44 లక్షల షేర్లు రూ.44.1 వద్ద చేతులు మారాయి. దీంతో ఈ ఉదయం బీఎస్ఈలో కంపెనీ షేరు విలువ 6 శాతం మేర పతనమై రూ.43.20 వద్ద కనిష్ఠాన్ని తాకాయి. బ్లాక్ డీల్ ద్వారా ఎవరు విక్రయించారు? ఎవరు కొనుగోలు చేశారనే వివరాలు మాత్రం తెలియరాలేదు. మధ్యాహ్నం 12.50 గంటల సమయానికి ఓలా ఎలక్ట్రిక్ షేర్లు 4.76 శాతం నష్టంతో 43.86 వద్ద ట్రేడవుతున్నాయి. 2017లో స్థాపితమైన ఓలా



ఎలక్ట్రిక్ 2024 ఆగస్టు 9న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయ్యింది. అప్పట్లో రూ.76 ఐపీఓ ధర కాగా.. రూ.91.20 వద్ద ప్రీమియంతో దలాల్ స్ట్రీట్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. అయితే, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు, మరోవైపు నియంత్రణ సంస్థల దర్యాప్తు, ఇంకోవైపు సంప్రదాయ ఆటోమొబైల్ సంస్థలైన బజాజ్, టీవీఎస్ నుంచి గట్టి పోటీ కారణంగా మార్కెట్ వాటా క్షీణించడం వంటి కారణాలతో షేరు విలువ పడుతూ వస్తోంది. గత 12 నెలల్లో షేరు విలువ 51 శాతం మేర క్షీణించింది. గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలోనూ రూ.870 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే నష్టం రెట్టింపుకావడం గమనార్హం. ఈనేపథ్యంలో బ్లాక్‌డీల్ జరగడంతో కంపెనీ షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇదే నెలలో నెలలో హ్యుందాయ్ మోటార్ కంపెనీ రూ.51.40 వద్ద 3.23 శాతం వాటాకు సమానమైన 14.22 కోట్ల షేర్లను విక్రయించడం గమనార్హం.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.